అనుదినం... జనస్వరం

www.navatelangana.com

నవతెలంగాణ

గురువారం 15-2-2024 సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 9 | సంచిక : 355 | Published from Khammam, Rangareddy, Hyderabad, Karimnagar | 12 పేజీలు | వెల : 6.50

వీల్‌చైర్ నాటకాలు మానండి

ప్రగల్భాలొద్దు..చర్చకు రండి



- కాళేశ్వరం, గోదావరి జలాలపై వాస్తవాలు తేలాలి
- మాజీ సీఎం స్థాయిలో ఎలాంటి భాషను వాడుతున్నారు?
- చచ్చిన పామును మేమెందుకు చంపుతాం : కేసీఆర్‌నుద్దేశించి సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

కాళేశ్వరం ప్రాజెక్టులపైనా, గోదావరి నదీ జలాలపైనా చర్చించేందుకు తమ ప్రభుత్వం సిద్ధంగా ఉందనీ, బీఆర్ఎస్ఎల్పీ నేత, మాజీ సీఎం కేసీఆర్ ప్రగల్భాలు మాని సభలో చర్చకు రావాలని సీఎం రేవంత్‌రెడ్డి సవాల్ విసిరారు. గురువారం శాసనసభలో బడ్జెట్ చర్చ సందర్భంగా ఆయన మాట్లాడారు. గోదావరి నదిపై నిర్మించిన కాళేశ్వరం, మేడిగడ్డ, సుందిళ్ల, పంపు హౌజ్‌ల విషయంలో చాలా విషయాలపైనా వాస్తవాల ప్రాతిపదిక చర్చ జరిగేలా స్పీకర్ నిర్ణయం తీసుకోవాలని కోరారు. తెలంగాణ సమాజం, రైతులు, ప్రజల పట్ల గౌరవం ఉంటే ప్రధాన ప్రతిపక్షం తమ ఆహ్వానాన్ని మన్నించి మేడిగడ్డకు వస్తే బాగుండేదన్నారు. సభ్యులమంతా ప్రాజెక్టులను పరిశీలించి అక్కడ జరిగిన నష్టాన్ని, రైతులకు వచ్చిన కష్టాన్ని అర్థం చేసుకుని సమస్యకు పరిష్కారం చూపే అవకాశాన్ని బీఆర్ఎస్ వదులుకున్నదన్నారు. మేడిగడ్డకు రాకపోనూ కొత్తగా వచ్చిన తమ ప్రభుత్వమే ఏదో తప్పు చేసినట్టు చిత్రీకరించే ప్రయత్నం జరుగుతున్నదని విమర్శించారు. 'మాజీ ముఖ్యమంత్రి హోదాలో కేసీఆర్ నల్లగొండలో మాట్లాడిన భాషపై

...10లో



ప్రభుత్వం మా గొంతు నొక్కుతోంది

- బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు వివరాలు 3లో..
- అసెంబ్లీ మీడియా పాయింటు వద్దకు వెళ్తుండగా అడ్డుకున్న పోలీసులు
- బారికేడ్ల వద్ద ఎమ్మెల్యేల బైఠాయింపు



కోరం లేదు.. మేం వెళ్లిపోతాం : హరీశ్‌రావు

- సభను పక్కదోవ పట్టించొద్దు.. కోరం ఉంది : మంత్రి దుద్దిళ్ల

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

'సభలో కోరం లేదు..మేం వెళ్లిపోతాం' అని హరీశ్‌రావు అనగా..సభను పక్కదోవ పట్టించొద్దు. కోరం ఉంది అని శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు చెప్పారు. దీంతో కొంతసేపు ఉద్రిక్తత నెలకొంది. గురువారం శాసనసభలో బడ్జెట్‌పై చర్చ ప్రారంభానికి ముందు ఈ ఘటన చోటుచేసుకున్నది. సభ ప్రారంభంకాగానే పాలంక్షాన్ని ఇరుకునపెట్టేందుకు ప్రతిపక్ష సభ్యులు యత్నించారు. 'సెక్రెటరీగారూ..సమయం 10:05 అవుతున్నది. ఇంకా గంట మోగలేదు. ఇదేంటండి. కనీసం

...10లో

సమ్మిళిత అభివృద్ధి జరగాలి

- మేడిగడ్డ వ్యవహారం బాధ కలిగిస్తోంది
- కారకులపై చర్యలు తీసుకోవాలి
- బడ్జెట్‌లో పొందుపర్చిన అంశాలు ఆశాజనకంగా ఉన్నాయి.
- పద్దును స్వాగతిస్తున్నాం : శాసన మండలిలో అలుగుబెల్లి నర్సిరెడ్డి



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో సమ్మిళిత అభివృద్ధి జరగాలని భావించిన ప్రభుత్వం, ఆ విషయాన్ని బడ్జెట్ ప్రసంగంలో వ్యక్తం చేయటం అభినందనీయమని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి

...10లో

దశాబ్దం నుంచి దగా

మోడీ హామీలు నీటి మీద రాతలే....!

- రెట్టింపు కాని అన్నదాతల ఆదాయం
- ఇది రాష్ట్రాలకు సంబంధించిన అంశమంటూ బుకాయింపు
- యూపీఏ పాలనలో కంటే దారుణం
- ఎంఎస్‌పీల పెంపూ కనిష్టమే





2016లో జరిగిన పార్లమెంటులో బడ్జెట్ ప్రవేశపెట్టడానికి ప్రభుత్వం సిద్ధమవుతున్న సమయంలో ప్రధాని నరేంద్ర మోడీ ఓ వీడియో సందేశాన్ని విడుదల చేశారు. 2022 నాటికి దేశంలో అన్నదాతల ఆదాయం రెట్టింపు చేస్తానని అందులో సగర్వంగా ప్రకటించారు. ఈ లక్ష్యాన్ని సాధించేందుకు చేయాల్సిన ప్రయత్నాలన్నీ చేస్తామని 2019లో విడుదల చేసిన ఎన్నికల ప్రణాళికలో కూడా బీజేపీ నమ్మబలికింది. ఇందుకోసం సంస్థాగత సంస్కరణల నిమిత్తం నగదు బదిలీ సహా పలు చర్యలను ఏకరువు పెట్టింది. ఐదు సంవత్సరాలు గడిచిపోయాయి. మోడీ ఇచ్చిన హామీ అలాగే మిగిలిపోయింది. ఆయన హయాంలో రైతన్నల ఆదాయం మరింత పడిపోయింది.

న్యూఢిల్లీ : అన్నదాతల్ని ఆదుకుంటామంటూ మోడీ ప్రభుత్వం అధికారంలో వచ్చింది...ఆ లక్ష్య సాధన కోసం కార్యాచరణ ప్రణాళికను రూపొందించేందుకు 2016లోనే ప్రభుత్వం ఓ కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీ 2012-13లో జాతీయ శాంపిల్ సర్వే కార్యాలయం

...11లో

జులుం తగదు..



అన్నదాతలపై జులుం తగదు.తులపై పోలీసుల చర్యను ఖండిస్తున్నాం. రైతులపై టియర్ గ్యాస్ షెల్స్ కాల్చడానికి డ్రోన్‌లను ఉపయోగించడం, అన్ని రకాల బారికేడ్లు ఏర్పాటు చేయడం గురించి మేము ఎప్పుడూ వినలేదు. రైతుల పాదయాత్రను ఆపడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తుంది. రైతులను గౌరవించడం, మనందరికీ అన్నం పెట్టే అన్నదాతలను గౌరవించడం ప్రభుత్వం బాధ్యత. ఈ అణచివేతకు తక్షణమే ముగింపు పలకాలి. అర్థవంతమైన చర్చలు జరగాలని కోరుతూ ఫిబ్రవరి 16న దేశవ్యాప్తంగా పెద్దఎత్తున ఉద్యమం జరగనుంది. కార్మిక సంఘాలతో పాటు రంగాల పారిశ్రామిక సమ్మె కూడా జరుగుతుంది. ఇది మోడీ ప్రభుత్వం విస్మరించలేని విషయం. ఇది వెంటనే అంగీకరించాలి".

- సీతారాం ఏచూరి
సీపీఐ(ఎం) ప్రధానకార్యదర్శి



రైతులపై పోలీసుల కర్కశం

- మళ్లీ టియర్ గ్యాస్ ప్రయోగం

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

రైతులు చేపట్టిన 'ఢిల్లీ చలో' నిరసన ప్రదర్శనను అడ్డుకునేందుకు ఢిల్లీలో అడుగడుగునా భద్రతా ఏర్పాట్లు చేయడం, సెంట్రల్ ఢిల్లీలో హర్యానా

...11లో

నేరస్తులుగా చూడొద్దు

- వారితో సంప్రదింపులు అవసరం : మధురా స్వామినాథన్ సూచన



న్యూఢిల్లీ : అన్నదాతలను నేరస్తులుగా చూడవద్దని హరిత విప్లవ పితామహుడు ఎంఎస్ స్వామినాథన్ కుమార్తె,

...11లో

16న సమ్మె, గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయాలి

వామపక్ష పార్టీల పిలుపు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

బీజేపీ ప్రభుత్వ వైఫల్యాలపై శుక్రవారం కేంద్ర కార్మిక సంఘాలు, రైతు సంఘాలు తలపెట్టిన కార్మిక సమ్మె గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయాలని వామపక్ష పార్టీలు పిలుపునిచ్చాయి. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ఉద్యోగ, కార్మిక, రైతాంగ, ప్రజా వ్యతిరేక విధానాలు, కార్పొరేట్ - మతోన్మాద రాజకీయాలను వ్యతిరేకిస్తూ కేంద్ర కార్మిక సంఘాలు, రైతు సంఘాల వేదిక సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కేఎం) సంయుక్తంగా దేశవ్యాప్త ఆందోళనకు పిలుపునిచ్చాయని తెలిపాయి. ఈ మేరకు తమ్మినేని వీరభద్రం (సీపీఐఎం), కె సాంబశివరావు (సీపీఐ), పోటు రంగారావు (సీపీఐఎంఎల్ ప్రజాపంథా), చలపతిరావు (సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ), సాదినేని వెంకటేశ్వరరావు (సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ),

...10లో

ప్రజలాశీర్వదిస్తే పదేండ్లు నేనే ముఖ్యమంత్రిని

- మీ రేవంతన్నగా యువతకు అండగా ఉంటా
- నిరుద్యోగుల తల్లిదండ్రుల కండ్లల్లో ఆనందం చూడాలి
- ఏడాదిలో రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ
- టీఎస్‌పీఎస్సీని ప్రక్షాళన చేసాం
- కల్వకుంట్ల కుటుంబాన్ని తెలంగాణ సమాజం తిరస్కరించింది
- దారిలేకే కేసీఆర్ నీళ్ల దారి పట్టిండు : కానిస్టేబుల్ ఉద్యోగ నియామక పత్రాలు అందజేసే కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

"ఎవరెన్ని కుట్రలు చేసినా రాబోయే పదేండ్లు ఈ రాష్ట్రానికి నేనే ముఖ్యమంత్రిని. ప్రజలాశీర్వదిస్తే మరో పదేండ్లుంటా. మీ రేవంతన్నగా యువతకు అండగా ఉంటా. నిరుద్యోగుల తల్లిదండ్రుల కళ్లలో ఆనందం చూడాలని ఉంది. తొమ్మిదిన్నరేండ్ల పాలనలో వేసిన చిక్కుముడుల్ని ఒక్కొక్కటిగా విప్పుకుంటూ ఏడాదిలో రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేయడమే లక్ష్యంగా ముందుకెళుతున్నాం. నల్లగొండ సభలో కేసీఆర్ చెప్పినట్టు పాలిచ్చే బర్రెను కాదని ప్రజలు దున్నపోతును తెచ్చుకోలేదు... కంచరగాడిదను ఇంటికి పంపించి రేసు గుర్రాన్ని తెచ్చుకున్నారు. కల్వకుంట్ల

...10లో

రాజ్యసభకు సోనియా

రాజస్థాన్ నుంచి నామినేషన్ దాఖలు

- ఏడు రాష్ట్రాల నుంచి అభ్యర్థులు ఖరారు
- తెలంగాణ నుంచి రేణుక చౌదరి, అనిల్ కుమార్‌కు చోటు



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

దేశంలోని ఏడు రాష్ట్రాల నుంచి కాంగ్రెస్ పార్టీ రాజ్యసభ అభ్యర్థుల్ని ప్రకటించింది. ఈ మేరకు బుధవారం కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శి (సంస్థాగత) కెసి వేణుగోపాల్ ప్రకటన విడుదల చేశారు. రాజస్థాన్ నుంచి సోనియా గాంధీ, బీహార్ నుంచి అఖిలేశ్ ప్రసాద్ సింగ్, హిమాచల్ ప్రదేశ్ నుంచి అభిషేక్ మను సింఘ్వి, మహారాష్ట్ర నుంచి చంద్రకాంత్ హండేరేల పేర్లను ప్రకటించింది. కాగా రాజస్థాన్ నుంచి పార్టీ రాజ్యసభ అభ్యర్థిగా కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్ పర్సన్

...10లో

భూగర్భ శోకం

అడుగంటుతున్న జలాలు

- వర్షాభావంకు తోడు తీవ్రమైన ఎండలు
- 10 మీటర్లకు పైగా పడిపోయిన నీటిమట్టం
- ఇప్పుడే ఇలా ఉంటే రానున్న రోజుల్లో తాగునీటి కష్టాలే..!
- సాగర్‌లో నీరు లేక కృష్ణా పరివాహకంలో ఆందోళన
- ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటామంటున్న అధికారులు



నవతెలంగాణ- ఖమ్మం, మహబూబ్‌నగర్, రంగారెడ్డి, మెదక్ ప్రాంతీయ ప్రతినిధుల బృందం/విలేకరులు

ఐదారు నెలలుగా చినుకు రాలకపోవడంతో రాష్ట్రంలో పలుచోట్ల భూగర్భజలాలు అడుగంటుతున్నాయి. వర్షాభావ పరిస్థితులకు తోడు ఫిబ్రవరి నెల నుంచే ఎండలు తీవ్రం కావడంతో భూగర్భ నీటిమట్టం పడిపోతున్నది. ఇలాగే ఉంటే రానున్న రోజుల్లో తాగునీటి కష్టాలు తప్పేలా లేదు. ప్రాజెక్టులు, చెరువుల్లో నీరు తగ్గుతుండడంతో బావులలో నీరు ఉండటం లేదు. పలుచోట్ల నెర్రలు బారిన పొలాలు పశువుల మేతగా మారాయి. 10 మీటర్లకు పైగా భూగర్భ నీటిమట్టం పడిపోవడం కూడా ఈ ఆందోళనకు కారణమైంది. గతేడాది ఫిబ్రవరితో పోల్చుకుంటే భూగర్భ జలాల్లో 3 మీటర్లకు పైగా వ్యత్యాసం ఉంది. ప్రాజెక్టులు, చెరువులు, బావుల్లో నీటిమట్టం అడుగంటుతుండటం యాసంగి పంటలపై ప్రభావం చూపుతోంది. ఉమ్మడి ఖమ్మం, వరంగల్, మహబూబ్‌నగర్, రంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో ఈ సమస్య తీవ్రంగా ఉంది. సమస్య తీవ్రతను అర్థం చేసుకుని ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నామని అధికారులు చెబుతున్నారు.

కృష్ణాతో పాటు గోదావరి పరివాహకంలోనూ నీటి వెతలు

రాష్ట్రానికి ఆదరువుగా ఉన్న కృష్ణా, గోదావరి పరివాహంలో నీటి వెతలు నెలకొన్నాయి. గోదావరిపై నిర్మించిన కాళేశ్వరం ఎత్తిపోతల పథకం నుంచి నీళ్లు వచ్చే పరిస్థితి లేదు. శ్రీరాంసాగర్ నుంచి కూడా నీరు రావట్లేదు. ఇటు కృష్ణా నదిలోనూ నీరు అడుగంటడంతో నాగార్జున సాగర్ ఆయకట్టు ఎండుతోంది. కృష్ణా, గోదావరిని అనుసంధానం చేస్తూ ఉమ్మడి ఖమ్మం జిల్లాతో పాటు మహబూబాబాద్ జిల్లాలో ఏడు లక్షల ఎకరాలకు నీరందించేందుకు 2016లో చేపట్టిన సీతారామ ఎత్తిపోతల పథకం 2019 నాటికి పూర్తి కావాల్సి ఉండగా నేటికీ నిర్మాణ దశలోనే ఉంది.

మండుతున్న ఎండలు


ఉమ్మడి మెదక్ జిల్లాలో 3.50 లక్షల బోరు బావులున్నాయి. వీటి పరిస్థితి ప్రశ్నార్థకంగా మారింది. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 2వేల వరకు చెరువులున్నాయి. ఎండల తీవ్రతకు నీరు అడుగంటడంతో తాగునీటి కష్టాలు చుట్టుముట్టుతున్నాయి.

విస్తీర్ణంలో 30శాతం వరి పంట సాగు

ఉమ్మడి నల్గొండ జిల్లాలోని ఎడమ కాల్వ పరిధిలో 3 లక్షలా 94 వేలా 285 ఎకరాల ఆయకట్టు విస్తీర్ణం ఉన్నది. ఇందులో 3,03,350 ఎకరాలు సాగునీటిపై ఆధారపడి ఆయకట్టు ఉండగా 41 ఎత్తిపోతల పథకం కింద 90,922 ఎకరాలు ఆయకట్టు ఉన్నది. ఈ సీజన్లో తీవ్ర వర్షాభావం కారణంగా

...3లో

అరుతడి పంటలకు నీళ్లు విడుదల చేయాలి




చేశాను. పొట్ట దశలో ఉంది. బోర్లలో నీళ్లు రాక, చెరువులు ఎండిపోయి, భూగర్భజలాలు లేక పొలాలు వాడుబడుతున్నాయి. ఏఎంఆర్‌పీ 8, 9 డిస్ట్రిబ్యూటరీ కాలువలకు వారబంధి ప్రకారమైనా నీళ్లు విడుదల చేసి రైతులను ఆదుకోవాలి.

- పాల్తీ మంగ్లా నాయక్ (పాల్తీ తండా)
రెండెకరాలు వరి పంట సాగు

ఆ నిర్ణయాలు సరైనవి కావు..

నియోజకవర్గాల పునర్విభజన, జమిలి ఎన్నికలకు వ్యతిరేకంగా తమిళనాడు అసెంబ్లీలో తీర్మానం



చెన్నై : తాజా జనగణన ఆధారంగా 2026లో జరిగే నియోజకవర్గాల పునర్విభజన, 'ఒకే దేశం-ఒకే ఎన్నికలు' ప్రతిపాదనకు వ్యతిరేకంగా తమిళనాడు అసెంబ్లీలో బుధవారం రెండు తీర్మానాలను ఆమోదించారు. ఈ రెండు విషయాల్లోనూ కేంద్ర ప్రభుత్వం ముందుకు వెళ్లకూడదని ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్ విజ్ఞప్తి చేశారు. తాజా జనాభా లెక్కలతో 2026లో నియోజకవర్గాల పునర్విభజన జరిగితే దక్షిణాది రాష్ట్రాల రాజకీయ ప్రాతినిధ్యం తగ్గిపోతుందని స్టాలిన్ ఆవేదన వ్యక్తం చేశారు. జనాభా నియంత్రణ చర్యలను దక్షిణాది రాష్ట్రాలు అత్యంత చిత్తశుద్ధితో అమలు చేశాయని, అందుకు అవి శిక్షకు గురికాకూడదని తెలిపారు. ఇందుకు పరిష్కారంగా రాజ్యాంగాన్ని సవరించి 1971 జనాభా లెక్కల ఆధారంగా నిర్ణయించిన 'ప్రస్తుత నిష్పత్తి'నే పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గాలకు కొనసాగించాలన్నారు. 2026లో జరిగే పునర్విభజనను తమిళనాడు, కర్నాటక, ఆంధ్రప్రదేశ్, కేరళ, తెలంగాణ రాష్ట్రాలకు 'తలపై వేలాడుతున్న కత్తి'గా అభివర్ణించిన స్టాలిన్.. ఈ పునర్విభజన ఆయా రాష్ట్రాల రాజకీయ ప్రాతినిధ్యాన్ని తగ్గిస్తుందని తెలిపారు. 'దీనిని మొగ్గలోనే తుంచేయాలి. తమిళనాడు వంటి దక్షిణాది రాష్ట్రాల నుంచి పార్లమెంటు స్థానాల సంఖ్యను తగ్గించడానికి ఈ పునర్విభజన ప్రక్రియ ఒక కుట్ర కూడా కావచ్చు' అని స్టాలిన్ తెలిపారు. తాజా జనగణన ఆధారంగా 2026లో జరిగే నియోజకవర్గాల పునర్విభజనతో జరిగే నష్టాలను ఉదాహరణలతో స్టాలిన్ వివరిస్తూ '1971లో తమిళనాడు, బీహార్ జనాభా ఒకే విధంగా ఉండడంతో వీటికి 39, 40 లోక్‌సభ

...10లో

నిమ్స్ కాంట్రాక్టు కార్మికులను రెగ్యులరైజ్ చేయాలి

సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్



నవతెలంగాణ-బంజారాహిల్స్

నిమ్స్ ఆస్పత్రిలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులను రెగ్యులరైజ్ చేయాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ డిమాండ్ చేశారు. ఈనెల జరగనున్న 16న దేశవ్యాప్త సమ్మె, గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయాలని కోరారు. బుధవారం హైదరాబాద్ పంజాగుట్ట నిమ్స్ ఆస్పత్రిలో నిమ్స్ కాంట్రాక్ట్ కార్మికుల జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిమ్స్ కాంట్రాక్టు కార్మికులను రెగ్యులరైజ్ చేసి వారికి కనీస వేతనం రూ.26,000 ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్ కార్మికులకు గ్రాట్యుటీ సౌకర్యం కల్పించాలన్నారు. 16న ఇందిరాపార్క్ వద్ద జరగనున్న మహాధర్నాలో నిమ్స్ కాంట్రాక్ట్ కార్మికులు పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. దేశవ్యాప్త సమ్మె, గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఎన్నికలకు ముందు బీజేపీ ఇచ్చిన హామీలు ఏ ఒక్కటీ అమలు చేయలేదన్నారు. విదేశాల్లో ఉన్న నల్ల డబ్బు తీసుకొచ్చి ఒక్కొక్కరి అకౌంట్‌లో రూ.15 లక్షలు వేస్తామన్న వాగ్దానం ఏమైందని, ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామన్న హామీ ఏమైందని ప్రశ్నించారు. ఢిల్లీ సరిహద్దుల్లో రైతులు చేసిన పోరాటం సందర్భంగా ఇచ్చిన హామీలు అమలు చేయలేదని చెప్పారు. ఈ సమావేశంలో సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి జే.వెంకటేష్, నిమ్స్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) అధ్యక్షులు ఎం.వెంకటేష్, ప్రధాన కార్యదర్శి ఇ.నరసింహులు, జాయింట్ సెక్రటరీ వెంకటేష్, నిమ్స్ సీఐటీయూ, యూనియన్ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

కంపచెట్లలో పసికందు లభ్యం

- సూర్యాపేట ఏరియాస్పత్రిలో చికిత్స



నవతెలంగాణ-మఠంపల్లి

సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండలంలోని సుల్తాన్‌పూర్‌తండాలో గుర్తు తెలియని వ్యక్తులు పసికందును కండ్లు తెరవకముందే కంపచెట్ల మధ్య వదిలేశారు. పసికందు ఏడుపు విని స్థానికులు గుర్తించి అంగన్వాడి టీచర్ ఉమా, ఆశావర్కర్ శాంతికి తెలియజేశారు. వారు ఐసీడీఎస్ అధికారులకు విషయం చెప్పగా.. జిల్లా వెల్ఫేర్ అధికారి సాయి, హెల్ప్‌లైన్ అధికారి వంశీ వచ్చి పసికందును సూర్యాపేట ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడి చికిత్స అందించారు. ఈ ఘటనపై సీడీపీఓ విజయలక్ష్మి మాట్లాడుతూ.. కంప చెట్లలో వదిలేయడం వల్ల పసికందుకు ముండ్లు కుచ్చుకున్నాయని చెప్పారు. ప్రస్తుతం ఆరోగ్యంగా ఉందని వైద్యులు తెలిపారన్నారు.

రేణుకకు కలిసొచ్చిన సీనియార్టీ..సిన్సియార్టీ

రాజ్యసభకు ఎంపిక



నవతెలంగాణ- ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

రాష్ట్రంలో రాజ్యసభ కాంగ్రెస్ అభ్యర్థిగా కేంద్ర మాజీ మంత్రి రేణుకాచౌదరి పేరు ఖరారైంది. ఆమెతో పాటు కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ మంత్రి అంజన్ కుమార్ యాదవ్ కుమారుడు అనిల్‌కుమార్ యాదవ్‌ను తెలంగాణ నుంచి రాజ్యసభ అభ్యర్థులుగా ఏఐసీసీ బుధవారం ప్రకటించింది. బీఆర్ఎస్ పార్టీ నుంచి వద్దిరాజు రవిచంద్రకు మరోసారి అవకాశం దక్కింది. రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రంలోని 17 స్థానాలకు గాను 16 సీట్లను దక్కించుకునేందుకు కాంగ్రెస్ పార్టీ ప్రణాళికలు రచిస్తోంది. దీనిలో ఖమ్మం కీలకమైన సీటు కావడంతో ఇక్కడున్న సామాజిక సమీకరణాలను దృష్టిలో పెట్టుకుని కాంగ్రెస్ అధిష్టానం రాజ్యసభకు రేణుకాచౌదరిని అభ్యర్థిగా ఎంపిక చేసినట్లు తెలుస్తోంది. ఉమ్మడి ఖమ్మం, వరంగల్ జిల్లాలను దృష్టిలో పెట్టుకుని బీఆర్ఎస్ పార్టీ వద్దిరాజును ఎంపిక చేసి ఉండొచ్చని రాజకీయ వర్గాలు అంటున్నాయి. కాంగ్రెస్ పార్టీలో రేణుకాచౌదరితో పాటు రాజ్యసభ అభ్యర్థిత్వం కోసం పలువురు సీనియర్లు పోటీ పడ్డారు. ఒక దశలో కాంగ్రెస్ జాతీయ నాయకురాలు సోనియాగాంధీ సైతం తెలంగాణ నుంచి రాజ్యసభ లేదా లోక్‌సభకు పోటీ చేయాలనే డిమాండ్ ముందుకొచ్చింది. సీనియర్ నేతలు రేణుకాచౌదరి, మాజీ మంత్రులు జానారెడ్డి, చిన్నారెడ్డి, మాజీ రాజ్యసభ సభ్యులు వి.హనుమంతరావు పేర్లు ప్రముఖంగా వినిపించాయి. కాంగ్రెస్ అధిష్టానం సీనియార్టీతో పాటు పార్టీకి విధేయురాలిగా ఉంటూ అసెంబ్లీ ఎన్నికల్లో ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి పదికి తొమ్మిది స్థానాలు దక్కేందుకు తోడ్పడిన రేణుకాపై విశ్వాసం ఉంచినట్టు తెలుస్తోంది.

రేణుకాచౌదరి గతంలోనే ఉభయ సభలకు ప్రాతినిధ్యం వహించారు. కేంద్ర మంత్రిగానూ పనిచేసిన అనుభవం ఆమెకు ఉంది. రేణుకా 2012 నుంచి 2018 వరకు రాజ్యసభకు ప్రాతినిధ్యం వహించారు. 1999, 2004 లోక్‌సభ ఎన్నికల్లో ఖమ్మం నుంచి గెలిచారు. ఆ తర్వాత 2009, 2018 ఎన్నికల్లో ఓడిపోయారు. రాజకీయంగా అనేక ఒడిదుడుకులు ఎదురైనా రేణుకాచౌదరి మాత్రం 'ఫైర్‌బ్రాండ్'గా తన ప్రత్యేకతను నిలుపుకుంటున్నారు.

హైదరాబాద్‌లో.. బంగారం ధరలు
(10 గ్రాములకు రూ.లలో)

24 క్యారెట్లు	62,180	▼ 660
22 క్యారెట్లు	57,000	▼ 600
కిలో వెండి	77,000	▼ 1500



గూడెం బీఆర్ఎస్‌కు భారీ షాక్

- పలువురు మున్సిపల్ కౌన్సిలర్స్, నాయకులు కాంగ్రెస్ గూటికి..
- భట్టి సమక్షంలో చేరికలు


నవతెలంగాణ-కొత్తగూడెం

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెం నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీకి భారీ షాక్ తగిలింది. పలువురు మున్సిపల్ కౌన్సిలర్స్, మహిళా కౌన్సిలర్స్ భర్తలు, నాయకులు బీఆర్ఎస్‌కు గుడ్‌బై చెప్పారు. బుధవారం కొత్తగూడెం మున్సిపాలిటీలోని బీఆర్ఎస్ పార్టీకి చెందిన పలువురు వార్డు కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్స్, నాయకులు రాష్ట్ర డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, ఏఐసీసీ సెక్రటరీ రోహిత్ చౌదరి, వైరా ఎమ్మెల్యే మాళోత్ రాం దాస్ నాయక్, ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్ సమక్షంలో హైదరాబాద్‌లో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరు గత అసెంబ్లీ ఎన్నికల వరకు బీఆర్ఎస్ పార్టీలో ఉన్నారు. ఆ పార్టీ గెలుపునకు పనిచేశారు. రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ విజయ ఢంకా మోగించి అధికారంలోకి రావడం, స్థానికంగా బీఆర్ఎస్ ఎమ్మెల్యే ఓటమి పాలుకావడంతో వారు తిరిగి గతంలో పనిచేసిన కాంగ్రెస్ గూటికి చేరడం చర్చనీయాంశంగా మారింది.

ఇన్‌ఫార్మర్ నెపంతో ఎలక్ట్రీషియన్ హత్య

- ఘటనా స్థలంలో కరపత్రం వదిలేసిన మావోయిస్టులు

నవతెలంగాణ-చర్ల



పోలీస్ ఇన్‌ఫార్మర్ నెపంతో ఎలక్ట్రీషియన్‌ను మావోయిస్టులు చంపేశారు. రాష్ట్ర సరిహద్దు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుక్మా జిల్లా బెజ్జీ పోలీస్ స్టేషన్ పరిధిలో దోర్నపాల్ నగర గ్రామపంచాయతీలో ఎలక్ట్రిషన్‌గా విధులు నిర్వహిస్తున్న పోడియం జోగా మంగళవారం రాత్రి హత్యకు గురయ్యాడు. మృతదేహాన్ని గూర్కా సమీపంలో రహదారిపై పడేశారు. పాలమడుగు గ్రామానికి చెందిన పోడియం జోగాను పోలీస్ ఇన్‌ఫార్మర్ అని మావోయిస్టులు ఘటనా స్థలంలో ఒక కరపత్రం వదిలారు. ఇతను 2006 నుంచి జనతా మావోయిస్టు పార్టీని వ్యతిరేకిస్తూ వచ్చాడని పేర్కొన్నారు. సల్వాజుడుంలో ఇతను చురుగ్గా పని చేశాడని మావోయిస్టులు ఆరోపిస్తున్నారు. అంతేకాకుండా బీమా పేరుతో సుమారు మూడు లక్షల రూపాయలు ప్రజా ధనాన్ని దోచుకున్నాడని ఆ కరపత్రంలో వెల్లడించారు. ఇతను అందించిన సమాచారం మేరకు పోలీసులు సామాన్య ప్రజలను హింసించడం, జైలుకు పంపించడం, కొట్టడంలాంటివి చేస్తున్నారని, అందుకే అతన్ని మరణ దండన విధించిన పేర్కొన్నారు. బెజ్జీ పోలీస్ స్టేషన్ పరిధిలోని కేసు నమోదు చేశారు.

'కాళేశ్వరం'పై కథలేనా?





జ్యుడీషియల్ విచారణ జరిపిస్తాం :మంత్రి శ్రీధర్‌బాబు

- రాష్ట్ర ప్రభుత్వం లేఖ ఇస్తే... సీబీఐ విచారణ జరిపిస్తాం
- కాంగ్రెస్, బీఆర్ఎస్ కలిసిన చరిత్ర ఉంది : ఏలేటి
- బీఆర్ఎస్‌ను రక్షించేందుకు బీజేపీ ఆరాటం: కాంగ్రెస్
- ఆ రెండు పార్టీలు కలబోవన్న గ్యారంటీ ఇస్తారా? రాజ్‌ఠాగూర్
- లేఖ ఇస్తేనే ఈడీ, ఐటీ దాడులు చేస్తున్నారా? యెన్నం
- బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు బీజేపీ ఎందుకు విచారించలేదు : ఆది శ్రీనివాస్
- కేసీఆర్ బినామీ కిషన్‌రెడ్డి : పొన్నం
- అసెంబ్లీలో వాడివేడీ చర్చ

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

ఒకవైపు కాళేశ్వరం ప్రాజెక్టు కుంగుబాటును పరిశీలించిన అధికార కాంగ్రెస్ ...మరోవైపు కృష్ణా జలాల్లో తెలంగాణకు జరుగుతున్న అన్యాయంపై బీఆర్ఎస్ పోరుబాట సభ...ఆ రెండు వేదికల్లో రేవంత్, కేసీఆర్ మాటల తూటాలు అసెంబ్లీలో మంటలు రేపాయి. బుధవారం శాసనసభలో ఓటాన్ అకౌంట్ బడ్జెట్ పద్దులపై చర్చ సందర్భంగా కాంగ్రెస్, బీజేపీ నేతల మధ్య వాడివేడీ చర్చ జరిగింది. కాళేశ్వరం ప్రాజెక్టుపై జ్యుడీషియల్ విచారణ జరిపిస్తామంటూ అధికార కాంగ్రెస్ వివరణ ఇచ్చింది. హైకోర్టును సిట్టింగ్ జడ్జిని ఇవ్వాలంటూ సీజేను కోరామని తెలిపింది. సిట్టింగ్ జడ్జిని ఇవ్వబోమంటూ హైకోర్టు తెలిపిన విషయాన్ని బీజేపీ గుర్తు చేసింది. కాళేశ్వరం ప్రాజెక్టుపై రాష్ట్ర ప్రభుత్వం లేఖ ఇస్తే, 24 గంటల్లో సీబీఐ చేత విచారణ జరిపిస్తామంటూ బీజేపీ సవాల్ చేసింది. దీంతో శాసనసభలో పద్దులపై చర్చ పక్కదారి పట్టింది. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో నెలకొన్న అవినీతి, పిల్లర్ల కుంగుబాటు తదితర అంశాలపై చర్చ మళ్లింది. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు ఒకదానికొకటి సహకరించుకుంటున్నాయనీ, అందుకే బీజేపీ సభ్యులు కాళేశ్వరం వద్దకు రాలేదంటూ కాంగ్రెస్ సభ్యులు వ్యాఖ్యానించారు. గతంలో బీజేపీ నేతలు ఈటల రాజేందర్, కిషన్‌రెడ్డి, కె లక్ష్మణ్‌ల బృందం పరిశీలించిందనీ, ఇప్పుడు కొత్తగా చూసేదేముందనీ, పిక్నిక్‌కు పోవడం తప్పా? అంటూ బీజేపీఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ఎద్దేవా చేశారు. ఈ దశలో బీజేపీకి, బీఆర్ఎస్‌కు చీకటి ఒప్పందం ఉండటం వల్లే కమలం పార్టీ...ప్రాజెక్టు పరిశీలనకు రాలేదంటూ రాష్ట్ర శాసనసభా వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు విమర్శించారు. వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్ఎస్, బీజేపీ కలిసి ఉంటాయనే తమ సభ్యులు చేసిన విమర్శలకు సమాధానం చెప్పకుండా బీజేపీ సభ్యులు దాట వేస్తున్నారని విమర్శించారు. ఆ రెండు పార్టీలు కలబోవని హామీ ఇవ్వగలరా? గ్యారంటీ ఏమైనా ఉందా? అని ఆయన ప్రశ్నించారు. రాష్ట్ర విభజన చట్టంలో పొందుపరిచిన సమస్యలను పరిష్కరించకుండా కాషాయపార్టీ కాలయాపన చేసిందంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. వాటి ప్రస్తావన చేయకుండా బీజేపీ దాట వేస్తున్నదని చెప్పారు. కాంగ్రెస్ సభ్యుడు రాజ్‌ఠాగూర్ మాట్లాడుతూ వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు కలిసి పోటీ చేయబోమనే గ్యారంటీ ఇవ్వగలరా? అంటూ బీజేపీని ప్రశ్నించారు.

నష్టపోయిన ప్రజాధనాన్ని ప్రజలకు చూపించేందుకే : ఆది శ్రీనివాస్

కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతిపై బీజేపీ పెద్ద పెద్ద మాటలు మాట్లాడిందనీ, ఎందుకు విచారణ జరిపించలేదని కాంగ్రెస్ సభ్యులు ఆది శ్రీనివాస్ బీజేపీని ప్రశ్నించారు. జ్యుడీషియల్ విచారణ జరిపిస్తామంటే, బీజేపీ ఉలిక్కిపడుతున్నదని విమర్శించారు. ప్రజాధనం దుర్వినియోగమైన విషయాన్ని ప్రజలకు చెప్పేందుకే ఎమ్మెల్యేలను, ఎమ్మెల్సీలను మేడిగడ్డకు తీసుకెళ్లామన్నారు.

బీజేపీ, బీఆర్ఎస్ అలయెన్స్ ఎన్నడూ లేదు : ఏలేటి

కమలం, కారు ఎన్నడూ పొత్తు పెట్టుకోలేదనీ, భవిష్యత్తులోనూ అది జరగలేదని బీజేపీ పక్ష నేత ఏలేటి మహేశ్వరరెడ్డి ఈ సందర్భంగా వివరణ ఇచ్చారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు పొత్తు పెట్టుకున్న చరిత్ర ఉందన్నారు. అటు కేంద్రంలోనూ, ఇటు రాష్ట్రంలోనూ కాంగ్రెస్ క్యాబినెట్‌లో బీఆర్ఎస్ నాయకులు చేరారని తెలిపారు. ఎన్నికల్లోనూ కలిసి పోటీ చేశాయని చెప్పారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ, బీఆర్ఎస్ ఒక్కటేనంటూ ప్రచారం చేసి, ఎన్నికల్లో గెలిచారని చెప్పారు. వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో అదే నినాదాన్ని ఇచ్చి గెలవాలనే తాపత్రయం ఆ పార్టీలో కనిపిస్తోందన్నారు. అబద్ధాలను ప్రజలు అన్నిసార్లు నమ్మబోరని హెచ్చరించారు. కాంగ్రెస్ సభ్యులు కాళేశ్వరం ప్రాజెక్టు వద్దకు విహార యాత్రకు వెళ్లారని ఎద్దేవా చేశారు. సీఎంకు ఎప్పుడు మూడొస్తే అప్పుడు అక్కడికి తీసుకెళతారని ఎద్దేవా చేశారు.

ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన హామీలకు తగినట్టుగా బడ్జెట్‌లో కేటాయింపులు లేవన్నారు. ఇచ్చిన హామీల విషయంలో సీఎం రేవంత్‌రెడ్డి యూటర్న్ తీసుకుంటున్నారని ఎద్దేవా చేశారు. ఫార్మాసిటీ రద్దు చేస్తానన్న మాట ఏమైందన్నారు. కులగణన చేపడతామన్న సీఎం...ఆ తర్వాత దాని ఊసేఎత్తలేదన్నారు. రుణమాఫీకి తగిన నిధులు కేటాయించకుండా ఉత్త మాటలు చెప్పారన్నారు. వ్యవసాయరంగానికి రూ. 19వేల కోట్లు కేటాయించినా, అవి ఏ మూలకు సరిపోవని తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల నుంచి తప్పించుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం బీజేపీపై బురదజల్లుతున్నదని విమర్శించారు.

తెలుగు భాషను భ్రష్టుపట్టించారు కేసీఆర్‌పై రామ్మోహన్‌రెడ్డి ఆగ్రహం

ప్రతిపక్ష నేత కేసీఆర్ తెలుగు భాషను భ్రష్టుపట్టించారని కాంగ్రెస్ సభ్యులు టి రామ్మోహన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. మగతనం ఉందా? అని మాట్లాడం ఆయన కుసంస్కారానికి నిదర్శనమన్నారు. మహిళలను కూడా దద్దమ్మలంటూ వారిని అవమానించారని తెలిపారు. పదేండ్లలో అనేక వాగ్దానాలు చేసిన కేసీఆర్ అధికారంలోకి వచ్చాక వాటిని విస్మరించారని చెప్పారు. బీజేపీకి అన్ని విషయాల్లో మద్దతిచ్చి ఆయన తన స్వామిభక్తిని చాటుకున్నారని తెలిపారు. సీఎం స్థానంలో కేసీఆర్ ఎవరిని కలవలేదు. ఎవరికి అపాయింట్‌మెంట్ ఇవ్వలేదు. అంతా దుబారా ఖర్చు. కాళేశ్వరం అవినీతికి నిలయం. ఉద్యోగులకు పీఆర్సీ ఇవ్వలేదు. నిరుద్యోగులకు భృతి ఇవ్వలేదు' అని విమర్శించారు.

ఏ అధికారంతో ఈడీ, ఐటీ దాడులు చేశారు : యెన్నం

మేడిగడ్డపై సీబీఐ విచారణకు రాష్ట్ర ప్రభుత్వం లేఖ ఇస్తే వెంటనే కేంద్రం విచారణ చేపడుతుందని ఏలేటి మహేశ్వర్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను కాంగ్రెస్ సభ్యుడు యెన్నం శ్రీనివాసరెడ్డి ఖండించారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఎవరి అనుమతితో కాంగ్రెస్ నేతల ఇండ్లపై ఐటీ దాడులు చేయించారని బీజేపీని ప్రశ్నించారు. అన్ని రాష్ట్రాల్లో ప్రతిపక్ష నేతల ఇండ్లపై ఈడీ, ఐటీ దాడులు ఎలా కొనసాగుతున్నాయని నిలదీశారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణానికి 30శాతం నిధులను రాష్ట్ర ప్రభుత్వం భరించిందనీ, 60 శాతం నిధులను లు వివిధ కార్పొరేషన్లతో అప్పుల రూపేణా సమీకరించారని గుర్తు చేశారు. వాటిని పర్యవేక్షించాల్సిన బాధ్యత కేంద్రానికి లేదా? అని ప్రశ్నించారు. దొంగలు, దొంగలు కలిసి ఊర్లు పంచుకున్నట్టు బీజేపీ, బీఆర్ఎస్ నేతలు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు.



యువతకు రాజీవ్‌గాంధీ స్ఫూర్తి
సీఎం రేవంత్‌రెడ్డి

- రాజీవ్‌గాంధీ విగ్రహ ఏర్పాటుకు శంకుస్థాపన

నవతెలంగాణ-సిటీబ్యూరో

మాజీ ప్రధాన మంత్రి రాజీవ్‌గాంధీ దేశ యువతకు స్ఫూర్తి అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. సోనియా గాంధీ చేతుల మీదుగా రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని ఆవిష్కరిస్తామని వెల్లడించారు. హైదరాబాద్‌లో రాష్ట్ర సచివాలయం ఎదురుగా ఉన్న స్థలంలో రాజీవ్‌గాంధీ విగ్రహం ఏర్పాటు కోసం బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. యువతలో స్ఫూర్తిని నింపాలనే ఉద్దేశంతో ఈ విగ్రహావిష్కరణ చేపట్టామన్నారు. రాజీవ్‌గాంధీ సేవలు మరువలేమని, దేశ సమగ్రతను కాపాడటంలో ఆయన ప్రాణం అర్పించారని కొనియాడారు. టెలికాం రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారని గుర్తు చేశారు. విగ్రహాలను ఏర్పాటు చేసేది వర్ధంతి, జయంతికి దండలేసి దండం పెట్టడానికి కాదన్నారు. సచివాలయం ఎదుట రాజీవ్‌గాంధీ విగ్రహం ఏర్పాటు చేస్తే అది చూసే వారికి స్ఫూర్తినిస్తుందని చెప్పారు. ఓ పక్క సచివాలయం, మరోపక్క అమరవీరుల స్థూపం, ట్యాంక్‌బండ్‌పై ఎందరో త్యాగమూర్తుల విగ్రహాలు ఉన్నాయన్నారు. అయితే ఈ ప్రాంతంలో పర్యటిస్తున్నప్పుడు ఒక లోటు ఉందని గుర్తించానని, అదే రాజీవ్ గాంధీ విగ్రహం లేకపోవడం అని తెలిపారు. ఈ రోజు ప్రపంచాన్ని గుప్పిట్లో పెట్టుకున్నామంటే మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ తీసుకున్న నిర్ణయాలే ఇందుకు కారణం అని చెప్పారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో సోనియా గాంధీ ప్రత్యేక శ్రద్ధ, కృషిని మరువలేమన్నారు. రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని సోనియాగాంధీ చేతుల మీదుగా ఆవిష్కరిస్తామని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు, పొన్నం ప్రభాకర్, ఖైరతాబాద్ కార్పొరేటర్ విజయారెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నేతలు వి.హనుమంత రావు, షబ్బీర్ అలీ, పలువురు ఎమ్మెల్యేలు, ఎమెల్సీలు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగులందరికీ ఆరోగ్యకార్డులివ్వాలి
మండలిలో నర్సిరెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.ఐదు లక్షల నుంచి రూ.పది లక్షలకు ప్రభుత్వం పెంచిందని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి అన్నారు. అదే తరహాలో ఉద్యోగుల ఆరోగ్య పథకం పరిమితినీ రూ.పది లక్షలకు పెంచాలని కోరారు. బుధవారం శాసనమండలిలో ప్రత్యేక ప్రస్తావన కింద అంశంపై ఆయన మాట్లాడారు. గురుకులాలు, కేజీబీవీలు, మోడల్ స్కూళ్లలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, ఇతర సిబ్బందికి, ప్రభుత్వంలో కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు ఏ రూపంలో పనిచేసినా వారికి ఆరోగ్య కార్డులను ఆరోగ్యకార్డులను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.

భూగర్భ శోకం

(మొదటి పేజీ తరువాయి)

సాగునీరు విడుదల కాకపోవడంతో ఆయకట్టులో 30శాతం బోర్లు బావుల కింద సుమారు1.20 లక్షల ఎకరాలలో వరి పంట సాగు చేశారు. ఈ కాలంలో పంట పొట్ట దశకు వచ్చి అవకాశముంది ఆ సమ యంలో వరి పంటకు నీటి అవసరం ఎక్కువగా ఉం టుంది. సకాలంలో నీరు అందితేనే పంట చేతికి వస్తుంది. లేకపోతే పంట ఎండిపోయే అవకాశముందని అధికారులు చెబుతున్నారు. పెట్టిన వేలాది రూపాయలు పెట్టుబడులు వృథా అవుతామని రైతులు ఆందోళనగా ఉన్నారు.

ఆందోళనకరం రంగారెడ్డి జిల్లాలో భూగర్భజలాలు

రంగారెడ్డి జిల్లాలో భూగర్భ జలాలు పాతాళానికి చేరాయి. గతేడాది కంటే 12 మీటర్ల లోతులోకి జలాలు పడిపోయాయి. వేసవి కాలం ప్రారంభానికి ముందే జనవరి నెలలో అర్బన్ ప్రాంతమైన శేరిలింగంపల్లిలో 30 మీటర్ల లోతులోకి వాటర్ లెవల్స్ పడిపోయాయి. తలకొండపల్లిలో 16.86 మీటర్లు, ఇబ్రహీంపట్నం 14.55 మీటర్లు, హయత్‌నగర్ 13.77 మీటర్ల లోతులోకి భూగర్భ జలాలు పడిపోయాయి. వర్షాలు లేకుంటే మార్చి, ఏప్రిల్, మే నెలలో జిల్లాలో నీటి ఎద్దడి తీవ్రత ఎక్కువగా ఉండనున్నట్టు అధికారులు అంచనా వేస్తున్నారు.

పెద్దవూరలో 40 మీటర్ల లోతులోకి...

నల్లగొండ జిల్లా పెద్దవూర మండలంలో భూగర్భ జలమట్టం భారీగా పడిపోయింది. మండలంలో 40.05 మీటర్లలోతులో నీరు ఉంది. వ్యవసాయ బోర్లు, బావులు వట్టిపోతున్నాయి. తాగునీటి ఎద్దడి తీవ్ర రూపం దాల్చిం ది. చివరికి పశువుల మేతకు సైతం ఇబ్బంది ఏర్పడే పరి స్థితులున్నాయి. మండలంలో 70శాతం బోర్లు మూలన పడ్డాయి. జిల్లావ్యాప్తంగా 2,860 చెరువులు, కుంటలు ఉండగా ఒకటి, రెండింటిలోనే కొద్దిపాటి నీరు ఉంది.

మరికొన్నిచోట్ల ...

ఖమ్మం జిల్లాలో గతేడాది జనవరితో పోల్చితే ఈ ఏడాది ఒక మీటర్ లోతుకు భూగర్భ నీటిమట్టం పడిపోయింది. జనవరి నాటికి సాధారణ వర్షపాతం 956.9 మి.మీ కురవాల్సి ఉండగా కేవలం 854.4 మి.మీ మాత్రమే నమోదైంది. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని ఐదు జిల్లాల్లో 9 మిల్లీమీటర్ల కనిష్ట స్థాయికి భూగర్భజలాలు పడిపోయాయి. జిల్లాలో సాధారణంగా ప్రతి ఏటా 642.2 మిల్లీమీ టర్ల వర్షపాతం నమోదు కావాల్సి ఉంది. ఈ సారి 592.1 మిల్లీమీటర్లకు మించి వర్షపాతం నమోదు కాలేదు. సంగారెడ్డి జిల్లాలో సగటు భూగర్భ నీటిమట్టాలు 7.35 మీటర్లు ఉండగా ఈ ఏడాది జనవరి చివరి నాటికి 9.71 మీటర్లకు తగ్గాయి. జిల్లాలోని కంది, చౌటకూరు మండలాల్లో 11.50 మీటర్లకు పైగా నీటిమట్టం పడిపోయింది.

16 అడుగుల టీఎంసీల లోపే మిడ్ మానేరు ప్రాజెక్టు

సిరిసిల్ల జిల్లాలో మిడ్ మానేరు ప్రాజెక్టు సామర్థ్యం 27.5 టీఎంసీలు ఉండగా ప్రస్తుతం 16 అడుగుల టీఎంసీల లోపే నీటిమట్టం ఉంది. ఈ ప్రాజెక్టు ద్వారా అన్నపూర్ణ ప్రాజెక్టులోకి నీరు ఎత్తిపోయాల్సి ఉంది. 3.50 టీఎంసీల సామర్థ్యం ఉన్న ప్రాజెక్టులో నీటిని రంగనాయక సాగర్‌కు మళ్లించడంతో ఒక టీఎంసీ కూడా లేకపోవడంతో ప్రాజెక్టు అడుగంటిపోయింది.

పాలేరులో ఎండుదశకు పంటపొలాలు

పాలేరు జలాశయంలో నీరు లేకపోవడంతో పాత కాలువ పరిధిలో 8వేల ఎకరాల పంటలు ఎండిపోతున్నాయి. మిషన్ భగీరథ తాగునీటి పథకానికి సైతం సరిపడా నీరందే పరిస్థితి లేదు. ఇటీవల సాగర్ నీరు వదిలినా నెలల తరబడి వర్షాభావం, ఎగువ రైతుల మోటార్లతో నీరు వాడుకోవడం వంటి కారణాలతో ఫిబ్రవరి 2, 3 తేదీల నాటికి కానీ నీరు జలాశయానికి చేరలేదు. పాలేరు నీటిమట్టం 23 అడుగులకు గాను 11 అడుగుల వరకు పడిపోయింది. పాలేరు నీటి ఆధారంగా ఎన్నెస్పీ పరిధిలో లక్ష ఎకరాలకు పైగా రబీ పంటలు సాగు చేశారు. తాగునీటికే కటకట ఏర్పడుతున్న పరిస్థితుల్లో బోర్లున్నా నీరు లేక ఈ పంటలు చేతికి వచ్చేలా లేవు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని కిన్నెరసాని, గోదావరి నీటిమట్టం అడుగంటడంతో అక్కడి పంటల పరిస్థితి కూడా ప్రశ్నార్థకంగా మారింది.

ప్రాజెక్టుల కింద తగ్గిన సాగు..

మహబూబ్‌నగర్ జిల్లాలో యాసంగి 8 లక్షల ఎకరాలకు పైగా సాగవుతుంది. జూరాల ప్రాజెక్టు కింద ప్రతియేటా 40వేల ఎకరాల వరి సాగు చేసేవారు. ఈ ఏడాది రబీలో పదివేల ఎకరాలు కూడా సాగు కాలేదు. కెఎల్ఐ ద్వారా కొల్లాపూర్, అచ్చంపేట, కల్వకుర్తి, నాగర్‌కర్నూల్, వనపర్తి నియోజకవర్గాల పరిధిలో సుమారు వరి, మొక్క, మిర్చి, వేరుశనగ వంటి పంటలు లక్ష ఎకరాలకు పైగా సాగయ్యేది. ఈసారి 25 వేల ఎకరాలకు మించి సాగు కాలేదు. దుందుబీ నది ఆయకట్టు కింద ప్రతియేటా 70 వేల ఎకరాల్లో సాగయ్యే పంటలు ఈసారి 15వేల ఎకరాలకు మించలేదు. ఉమ్మడి జిల్లాలోని శ్రీశైలం, జూరాల రిజర్వాయర్లు వెలవెలబోతున్నాయి. జూరాలలో 1045 అడుగులు ఉండాల్సిన నీటిమట్టం 345 అడుగులు మాత్రమే ఉంది. శ్రీశైలంలో గతేడాది ఈ సమయానికి 885 అడుగుల నీరుండగా ఇప్పుడు 301 అడుగులకు పడిపోయింది. నారాయణపేట, మహబూబ్‌నగర్ జిల్లాల పరిధిలో ఉండే సాగు భూములు బీళ్లుగా మారాయి. ఎటువంటి సాగు వనరులు లేని ఈ రెండు జిల్లాల్లో రబీ సాగు కనిష్ట స్థాయికి పడిపోయింది.

పంటలు ఎండిపోతున్నాయి

కట్ల సైదిరెడ్డి మంగాపురం, వేములపల్లి మండలం

చెరువుల ఎండిపోవడంతో భూగర్భ జలాలు అడుగంటి పోయాయి. యాసంగి పంట మొదట్లో బోర్లు ఆశాజనకంగా పోయడంతో ఆరు ఎకరాలు సాగు చేశాం. భూగర్భ జలాలు అడుగంటడంతో రెండు బోర్లు ఎండిపోయాయి. రెండు ఎకరాల మేర వరి పంటఎండిపోయింది

సంపాదకీయం

ఎవరిపై మీ యుద్ధం?

"మిమ్మల్ని మించిన వీరుల పేర్లే మా వైపున్నాయి
మా వాళ్ళు ఆయుధాలు ఉపయోగించడంలో దిట్టలు
మా కవచాలు గట్టివి, మా యుద్ధమే ప్రసిద్ధమైనది
ఎందుకంటే మా గుండెల నిండా పవిత్రత నిండి యున్నదం"టాడు కింగ్ హెన్రీ- ఫోర్‌లో షేక్స్‌పియర్

సింఘు, టిక్రీ, ఘాజీపూర్‌లు కార్గిల్‌లు కావు. గొల్వాన్ హైట్స్ అంతకంటే కావు. వచ్చేది పాకిస్థాన్, చైనా సైన్యం కాదు. వస్తున్నది కాంక్రీట్ జంగిల్ లాంటి దేశ రాజధానిలోకి. గోధుమలైనా, వరిధాన్యమైనా, తృణ ధాన్యాలైనా, పాలయినా ఢిల్లీలోకి పంజాబ్, హర్యానా, యూపిల నుండి వచ్చే ప్రవేశద్వారాలవే. పాకిస్థాన్ బోర్డర్లో ట్రెంచీలు తవ్వినట్లు, బారికేడ్లు కట్టినట్లు, ముళ్ళబాట పరిచినట్టు మోడీ సర్కార్ సన్నాహాలు చూస్తే ఆశ్చర్యమేస్తుంది. సరిహద్దులు మూసేయడమే కాదు, హర్యానాలో ఏడు జిల్లాల్లో ఇంటర్నెట్ ఆపేశారు. డజన్లకొద్దీ ట్విట్టర్ (ఇప్పుడు ఎక్స్) అకౌంట్లు బంద్ చేశారు. బల్క్ మెసేజులు నిషేధించారు.

ఎంత నిర్బంధం ఉన్నా రైతాంగం అంతే తీవ్రంగా కదలడానికి కారణం కనీస మద్దతు ధర సాధించుకోడానికే. విద్యుత్ ప్రయివేటీకరణ ఆగకుంటే రైతాంగమే కాదు, సామాన్యజనం తీవ్ర ఇబ్బందులు పడతారు. అందుకే నేడు రైతాంగం, కార్మికులు చేస్తున్న పోరాటం దేశం కోసం, దేశాభివృద్ధి కోసం. మన వ్యవసాయాన్ని పరిశ్రమలను కబ్జా జేసేందుకు ప్రయత్నిస్తున్న దేశ, విదేశ పెట్టుబడిదార్లకు వ్యతిరేకంగా. మోడీ సర్కార్ నిలబడ్తున్నదే వారి ప్రయోజనాల కోసం.

మనందరికి తిండిపెట్టే అన్నదాతలపై యుద్ధం ప్రకటించింది మోడీ సర్కార్. వాస్తవానికి సంయుక్త కిసాన్ మోర్చా పిలుపు ఫిబ్రవరి 16న దేశవ్యాపిత గ్రామీణ బంద్. దాంతో అనుసంధానిస్తూ దేశవ్యాపిత కార్మిక సమ్మెకు కార్మిక సంఘాలు పిలుపునిచ్చాయి. దీనికి దేశ వ్యాపిత సన్నాహాలు జరుగుతున్నాయి. ఈలోపు కొన్ని సంఘాలు చలో ఢిల్లీకి పిలుపునిచ్చాయి. దానిపై మోడీ సర్కార్ ఉక్కుపాదం మోపుతున్నది. పైగా 'మోడీ 3.0' పాలనకోసం అటు దేశ, విదేశ పెట్టుబడిదారులు అర్రులు జాస్తున్న నేపథ్యంలో ఈ రైతు ఉద్యమం 2.0' మళ్ళీ రాజుకుంటుంటే రోడ్లపై మేకులు పరవడం మొదలు డ్రోన్లతో ప్రస్తుతానికి ఏడిపించే గ్యాస్‌తోనే దాడి చేయడం వరకు మోడీ సర్కార్ యుద్ధం సాగిస్తోంది.



మన దేశంలో మౌలిక మార్పు వచ్చేవరకు సాగాల్సిన మహాపోరాటంలో నేటి యుద్ధం ఒక దశ. హర్షణీయమైన అంశమేమంటే సంపద సృష్టికర్తలైన కార్మికులు, కర్షకులు, జాయింట్ ప్లాట్‌ఫార్మ్ ఆఫ్ ట్రేడ్ యూనియన్స్‌తో సంయుక్త కిసాన్ మోర్చా ఒకరికొకరు మద్దతుగా రంగంలోకి దిగడం. అడుగులు నెమ్మదిగానైనా దృఢంగా పడటం! గత నవంబర్ చివర్లో జరిగిన 'మహాధర్నా'కి కొనసాగింపుగా జిల్లాల్లో జరిగిన మోహరింపులు, రేపు 16న దేశవ్యాపిత సమ్మెకు వెన్నుదన్నుగా గ్రామీణ బంద్ నిలువనుంది.

ఐదు వందలకి పైగా రైతు సంఘాలతో కూడింది సంయుక్త కిసాన్ మోర్చా. మోడీ భజనల్లో మైమరిచి నృత్యం చేసే బీఎంఎస్ తప్ప మిగిలిన కార్మిక సంఘాలన్నింటితో కూడింది జాయింట్ ప్లాట్‌ఫార్మ్ ఆఫ్ ట్రేడ్ యూనియన్స్. అనేక రాష్ట్రాల్లో పాలక ప్రాంతీయ, జాతీయ పార్టీలు రంగంలోకి దిగాయి. త్రిపుర, బెంగాల్ వంటి రాష్ట్రాల్లో ప్రాణాలకి తెగించి గ్రామీణ బంద్‌ను, జాతీయ పారిశ్రామిక సమ్మెను జయప్రదం చేసేందుకు వ్యక్తులు, శక్తులు, సంఘాలు ప్రయత్నిస్తున్నాయి. దేశాన్ని మతం ఆధారంగా పోలరైజ్ చేసేందుకు కృత నిశ్చయంతో ఉంది మోడీ ప్రభుత్వం. అందుకే, ఎన్నికల్లోపే సి.ఎ.ఎ. ను అమలు చేస్తానం టాడు అమిత్‌షా. మతతత్వ శక్తుల్తో కార్పొరేట్ శక్తులు కలగలిసిన నేపథ్యం నేడు మనముందుంది. అయోధ్య రామమందిర నిర్మాణానికి కన్సల్టెంట్లు 'టాటా'లు కాగా, నిర్మాణ కాంట్రాక్టు ఎల్ అండ్ టిది. పార్లమెంటరీ నియోజకవర్గాల వారీగా రైళ్లలో అయోధ్య తీసికెళ్లడానికి ప్లాన్ చేశారు. అయోధ్య నుండి అక్షింతల్ని దేశంలోని అత్యధిక ఇళ్లకు పంపిణీ చేశారు. ఇవన్నీ కలిసి మెజారిటీ ప్రజల మనసుల్ని జయిస్తాయని తమ ప్రభుత్వాన్ని బయటేస్తాయని మోడీ భావన.

ముఖ్యంగా కార్మికుల్లోను, ఇతర కష్ట జీవుల్లోనూ నిర్దిష్ట రాజకీయ క్యాంపెయిన్ జరగాలి. 2023 ఒక్క ఏడాదిలోనే రూ. 2.14 లక్షల కోట్లు, మోడీ పాలనా కాలంలో రూ. 15.32 లక్షల కోట్లు పారుబాకీలు ఎందుకు రద్దు చేశారో, డిఆర్‌డిఓను దాదాపు పడావు పెట్టే స్థితి ఎందుకొచ్చిందో, ప్రభుత్వ ఆరోగ్య రంగాన్ని ఎందుకు ప్రయివేటు వారి చేతుల్లో పెడ్తున్నారో, అమెరికాలో లాగా ఇన్సూరెన్స్ ఆధారిత వైద్యసేవల మోడల్‌గా ఎందుకు చేస్తున్నారో, విద్యుత్ ప్రయివేటీకరణకు ఎందుకు ముందుకు సాగుతున్నారో వంటి అంశాలన్నింటిని ఈ పోరాట సందర్భంగా చర్చనీయాంశం చేయాలి.

ఎంత నిర్బంధం ఉన్నా రైతాంగం అంతే తీవ్రంగా కదలడానికి కారణం కనీస మద్దతు ధర సాధించుకోడానికే. విద్యుత్ ప్రయివేటీకరణ ఆగకుంటే రైతాంగమే కాదు, సామాన్యజనం తీవ్ర ఇబ్బందులు పడతారు. అందుకే నేడు రైతాంగం, కార్మికులు చేస్తున్న పోరాటం దేశం కోసం, దేశాభివృద్ధి కోసం. మన వ్యవ సాయాన్ని పరిశ్రమలను కబ్జా జేసేందుకు ప్రయత్నిస్తున్న దేశ, విదేశ పెట్టు బడిదార్లకు వ్యతిరేకంగా. మోడీ సర్కార్ నిలబడ్తున్నదే వారి ప్రయోజనాల కోసం.రానున్న ఎన్నికల్లో మోడీ సర్కార్‌ను సాగనంపితేనే దేశం బాగు పడుతుంది.

రెండు దృక్పథాలు-రెండు మార్గాలు



ఎస్. వీరయ్య

రెండు భిన్న దృక్పథాలను ప్రజల ముందుంచుతూ 2024 సంవత్సరం ప్రారంభమైంది. మోడీ ప్రభుత్వం ప్రజలను సమస్యల పరిష్కారం కోసం అయోధ్య వైపు చూడాలంటున్నది. కార్మిక, కర్షక సంఘాలు శ్రామికులను పోరుబాట పట్టాలని పిలుపునిచ్చాయి. జనవరి 22న అయోధ్యలో రామమందిరం ప్రధానమంత్రి నరేంద్రమోడీ ప్రారంభించారు. రాజ్యాంగ మౌలిక సూత్రాలకు భిన్నమైన పని. మతపరమైన క్రతువును ప్రధాని ప్రభుత్వ కార్యక్రమంగా అమలు చేసారు. మతం వ్యక్తిగతం. కానీ ప్రధాని చర్య మతాన్నీ, ప్రభుత్వాన్నీ కలగాపులగం చేస్తున్నది. ప్రజల్లో గందరగోళం సృష్టిస్తున్నది. మతాన్ని రాజకీయ ప్రయోజనాల కోసం బీజేపీ, కేంద్ర పాలకులు వాడుకుంటున్నారు. మత గురువులు, పీఠాధిపతులు చేయవల్సిన పని రాజకీయ నాయకులు, ప్రభుత్వాధినేతలు చేయడం భారత రాజ్యాంగం పునాదులకే విరుద్ధం. మరోవైపు దేశంలో కార్మిక, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాలు ఫిబ్రవరి 16న ఐక్య పోరాటానికి పిలుపునిచ్చాయి. సమస్యల పరిష్కారం కోసం కార్మిక సంఘాలు వివిధ రంగాల్లో దేశవ్యాపిత సమ్మెకు పిలుపు నిచ్చాయి. రైతు, వ్యవసాయ కార్మిక సంఘాలు గ్రామీణ బంద్‌కు పిలుపు నిచ్చాయి. సమస్యల పరిష్కారంలో విఫలమైన మోడీ ప్రభుత్వాన్ని గద్దెదించాలని శ్రామికులను కోరాయి. కార్మికులు, రైతులు, వ్యవసాయ కార్మిక సంఘాలు ఐక్యంగా పోరుబాట పట్టడం, రాజకీయ నినాదంతో కదం తొక్కడం గమనార్హం. రాజ్యాంగానికి అధిపతిగా ఉన్న రాష్ట్రపతి నోట కూడా కేంద్ర ప్రభుత్వం హిందూ ఆధ్యాత్మిక క్షేత్రాల గురించీ, భక్తుల సందర్శన గురించీ పలికించింది. మంత్రివర్గం ఆమోదించిన ప్రసంగపాఠమే కదా రాష్ట్రపతి చదివేది! కానీ నూతన పార్లమెంట్ భవనం ప్రారంభం సందర్భంగా మాత్రం రాష్ట్రపతిని ఆహ్వానించలేదు. ఇప్పుడు రాష్ట్ర పతి నోట రాజ్యాంగ విరుద్ధమైన మాటలు పలికించింది మోడీ ప్రభుత్వం. కేంద్ర బడ్జెట్‌లో ఈ విషయాలు ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ కూడా ప్రస్తావించారు. 'స్పిరిచ్యువల్ టూరిజం' గురించి ప్రత్యేకంగా చెప్పారు. బడ్జెట్ ప్రవేశపెడుతున్న సందర్భంగా

పోరాటాలనుంచి ప్రజల దృష్టి మరల్చి, రానున్న ఎన్నికల్లో లబ్ధిపొందాలని మోడీ ప్రభుత్వం, బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ నాయకులు ప్రయత్నిస్తున్నారు. అందుకే ప్రజల దృష్టిని ఒకవైపు అధ్యాత్మిక చింతన, దైవభక్తి, ఆయోధ్యవైపు మరలిస్తున్నారు. మరోవైపు ప్రజల మధ్య మత పరమైన విభజన సృష్టిస్తున్నారు. మైనారిటీలలో అభద్రతను పెంచుతున్నారు. ఎన్నికలకు ముందే బీజేపీ పాలిత రాష్ట్రాల్లో 'ఉమ్మడి స్మృతి' అమలుకు ప్రయత్నించేది ఇందుకే. పౌరసత్వ సవరణ చట్టాన్ని కూడా ఎన్నికలకు ముందే అమలు చేస్తామని కేంద్ర మంత్రులు బరి తెగించి ప్రకటించడం కూడా ఇందుకోసమే. ప్రజల దైవభక్తినీ, మత విశ్వాసాన్నీ శక్తివంతంగా తమ రాజకీయ ప్రయోజనాల కోసం బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ నాయకులు వాడుకుంటున్నారు.

రామాలయం నిర్మాణం ఐదువందల సంవత్సరాల కలగా ప్రస్తావించారు. పార్లమెంటులో ప్రధాని ప్రసంగంలో "రామాలయం ప్రారంభించడం తమ ప్రభుత్వం సాధించిన గొప్ప విజయం"గా ప్రస్తావించారు. ప్రభుత్వ, పార్లమెంట్ వ్యవహారాలతో మతాన్ని పూర్తిగా కలగాపులగం చేస్తున్నారు.

అయోధ్యలో రామాలయం ప్రారంభోత్సవాన్ని రానున్న ఎన్నికల ప్రచారానికి వాడుకున్నారు. ఇంటింటికీ అక్షింతలు, ప్రతి పార్లమెంట్ నియోజకవర్గం నుంచి అయోధ్యకు ఉచిత రైలు వాగ్దానం, ప్రధాని, కేంద్ర మంత్రులు రాముడి చిత్రంతో ముద్రించిన పోస్టర్లు విస్తృతంగా అంటించడం ఇందులో భాగమే. రామాలయ ప్రారంభోత్సవ నిర్వాహకులు రాజకీయ పార్టీలకు ఆహ్వానాలు పంపారు. వామపక్ష పార్టీలు ప్రజల మతవిశ్వాసాలను గౌరవిస్తూనే, మతపరమైన క్రతువులకు రాజకీయ పార్టీలకు సంబంధం ఉండకూడదని భావించాయి. ఈ సందర్భాన్ని బీజేపీ, తన రాజకీయ ప్రయోజనం కోసం వాడుకోవడాన్ని తప్పుబట్టాయి. కాంగ్రెస్ పార్టీ అగ్ర నేతలు, 'ఇండియా' సమూహంలోని అనేక పార్టీలు కూడా హాజరుకా లేదు. ఇది సరైందే. కానీ క్షేత్రస్థాయిలో కాంగ్రెస్, బీఆర్‌ఎస్ లాంటి పార్టీల నాయకులు, కార్యకర్తలు కూడా అక్షింతల పంపకంలో పోటీపడ్డారు. మరోవైపు బీజేపీ పాలిత రాష్ట్రాల్లో, పార్లమెంట్ ఎన్నికలకు ముందే 'ఉమ్మడిస్మృతి' అమలుకు ప్రయత్నిస్తున్నారు.

రామాలయ ప్రారంభోత్సవ నిర్వాహకులు రాజకీయ పార్టీలకు ఆహ్వానాలు పంపారు. వామపక్ష పార్టీలు ప్రజల మత విశ్వాసాలను గౌరవిస్తూనే, మతపరమైన క్రతువులకు రాజకీయ పార్టీలకు సంబంధం ఉండకూడదని భావించాయి. ఈ సందర్భాన్ని బీజేపీ, తన రాజ కీయ ప్రయోజనం కోసం వాడుకోవడాన్ని తప్పుబట్టాయి. కాంగ్రెస్ పార్టీ అగ్రనేతలు, 'ఇండియా' సమూహంలోని అనేక పార్టీలు కూడా హాజరు కాలేదు. ఇది సరైందే. కానీ క్షేత్ర స్థాయిలో కాంగ్రెస్, బీఆర్‌ఎస్ లాంటి పార్టీల నాయకులు, కార్యకర్తలు కూడా అక్షింతల పంపకంలో పోటీపడ్డారు. మరోవైపు బీజేపీ పాలిత రాష్ట్రాల్లో, పార్లమెంట్ ఎన్నికలకు ముందే 'ఉమ్మడి స్మృతి' అమలుకు ప్రయత్నిస్తున్నారు.

మోడీ ప్రభుత్వం, బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ నాయకులు చేస్తున్న ఈ ప్రయత్నాలతో ప్రజలు తమ నిజమైన సమస్యలు మరచిపోవాలని వీరి కోరిక. ఇహలోకంలో ఎదురవుతున్న బాధలు, కష్టాలన్నీ గత జన్మలో చేసుకున్న పాపం ఫలితాలుగా సర్దుకుపోవాలని వారి భావన. ఈ జన్మలో పెట్టుబడి దారులకూ, భూస్వాములకూ, ధనిక రైతులకు, కాంట్రాక్టర్లకు, సేవలు చేసి, మరణానంతర స్వర్గ సుఖాల కోసం ఎదురుచూడాలని శ్రామికులకు వీరు ఇస్తున్న సందేశం. కార్మిక చట్టాలను మోడీ ప్రభుత్వం రద్దు చేసింది. కోరలు లేని నాలుగు 'లేబర్ కోడ్స్'గా మార్చింది. ఇది పెట్టుబడిదారుల సేవలో కార్మికులు తరించడం కోసమనీ, శ్రమ దోపిడీకి పెట్టుబడిదారులకు మార్గం సులభతరం చేయడం తమకోసమేనని కార్మికులు భావించాలన్న మాట! కుటుంబావసరాలకు సరిపడు వేతనాలు లేకపోయినా, విద్యుత్తు సవరణ బిల్లుతో విద్యుత్తు చార్జీలు పెంచినా, రైతు వ్యతిరేక చట్టాలు చేసేందుకు ప్రయత్నం చేసినా, వ్యవసాయ కార్మికుల గురించి ఏమి పట్టించుకోకపోయినా..... ఇవన్నీ పూర్వజన్మ ఫలితాలుగా సరిపెట్టుకోవాలట! మోడీ ప్రభుత్వ విధానాల ఫలితంగా ధరలు పెరిగినా, ప్రజా పంపిణీ వ్యవస్థ నీరుగారిపోయినా, అటవీ హక్కుల చట్టాలను బలహీనపర్చి ఆదివాసీల జీవితాలతో చెలగాటమాడినా ప్రజలు సర్దుకుపోవాలి. ఉద్యమాల మీద నిర్బంధం ప్రయోగించినా, సామాజిక న్యాయం అమలు చేయకపోయినా, 'ఈ జన్మకు మనకు ఇంతే రాసిపెట్టి ఉన్నద'ని శ్రామికులు సరిపెట్టుకోవాలని మోడీ ప్రభుత్వం భావిస్తున్నది. అందుకే, తాను పరిష్కరించవల్సిన సమస్యల మీద దృష్టి సారించకుండా, ప్రజల దృష్టిని రాముడివైపు, రామాలయం వైపు మరలిస్తున్నది. ఇంతమాత్రాన ప్రజలు తమను వేధిస్తున్న సమస్యలన్నీ మరచిపోతారని భావించడం వారి భ్రమ. రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తిని వెంటనే వైద్యులకు చూపిస్తారే గానీ, దేవుడి ముందు పెట్టి వేడుకోరుకదా! సమస్యలు పరిష్కరించేవారినీ, పరిష్కారం కోసం ప్రజలకు సహాయం చేసేవారినీ, సమీకరించేవారినీ వదిలిపెట్టి దేవుడి మీదనే భారం వేయడం నిజ జీవితంలో ఎక్కడా జరగదు కదా! జనం దేవుడికి మొక్కులు, తాయత్తులకోసం వెతుకులాడేది, మానవ ప్రయత్నాలన్నీ విఫలమైనప్పుడే! ఇక్కడ సమ స్యలు పరిష్కారం కానప్పుడే దేవుడివైపు చూస్తారు. అందుకే వామపక్షాల కార్యకర్తలు గానీ, శ్రామికుల సంఘాల నాయకులుగానీ ప్రజల సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలి. ప్రజలకు దగ్గరై, ప్రజలకు సాయపడుతున్నప్పుడు, ప్రజలు సహాయం పొందడానికే ఇష్టపడతారు. సహాయం చేసే వారి కోసం, తమను సంఘటితం చేసేవారి కోసం ఎదురుచూస్తారు. పాలకవర్గాలు దేశాన్ని ఆదానీ, అంబానీలకు దోచిపెట్టడానికి బద్ధులై ఉన్నారు.



అందుకే శ్రామికుల శ్రమదోపిడీకి అనువైన మార్గాలు ఏర్పాటు చేస్తున్నారు. పారిశ్రామికవేత్తలు, భూస్వాములు సులభంగా శ్రమను దోచుకోవడానికి అన్ని అవకాశాలు కల్పిస్తున్నారు. బడాబాబులు సుఖసంతోషాలతో స్వర్గసుఖాలు అనుభవిస్తున్నారు. శ్రామికులు మాత్రం తమ కుటుంబం సుఖసంతోషాల కోసం ఈ జన్మలో ఓపిక పట్టాలని మతం పేరుతో, దేవుడి పేరుతో జోకొడుతున్నారు. మరోజన్మ ఉన్నదో లేదో బడాబాబులకు నమ్మకం లేదు. అందుకే, ఈ జన్మలోనే సకల సుఖాలూ అనుభవిస్తున్నారు. శ్రామికులు మాత్రం మరో జన్మకోసం ఎదురు చూడాలట! పెట్టుబడిదారులు, భూస్వాములు, కాంట్రాక్టర్లు, బడా వ్యాపారులూ బతికుండగానే సుఖప్రదమైన జీవితం గడపడానికీ, శ్రీమంతులుగా వెలిగిపోవడానికీ కష్టజీవుల జీవితాలు కొవ్వత్తుల్లాగా కరిగిపోవాలట! అది వారి తలరాతగా భావించాలట! శ్రామికులు కూడా, తాము బతికుండగానే, తమ కుటుంబాలు సుఖప్రదమైన జీవితం గడిపేందుకు కదలాలి. మరణానంతర 'స్వర్గసుఖాలు' బతికుండగానే సాధించుకోవాలి. బడాబాబుల సేవలో తరించిపోతున్న కేంద్ర పాలకులు సహజంగానే శ్రామికుల సమస్యలు విస్మరించారు. అందుకే శ్రామికులకు సంఘటితంగా పోరాటం తప్ప మరో మార్గం లేదు.

పోరాటాలనుంచి ప్రజల దృష్టి మరల్చి, రానున్న ఎన్నికల్లో లబ్ధిపొందాలని మోడీ ప్రభుత్వం, బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ నాయకులు ప్రయత్నిస్తున్నారు. అందుకే ప్రజల దృష్టిని ఒకవైపు అధ్యాత్మిక చింతన, దైవ భక్తి, ఆయోధ్యవైపు మరలిస్తున్నారు. మరోవైపు ప్రజల మధ్య మత పరమైన విభజన సృష్టిస్తున్నారు. మైనారిటీలలో అభద్రతను పెంచుతున్నారు. ఎన్నికలకు ముందే బీజేపీ పాలిత రాష్ట్రాల్లో 'ఉమ్మడి స్మృతి' అమలుకు ప్రయత్నించేది ఇందుకే. పౌరసత్వ సవరణ చట్టాన్ని కూడా ఎన్నికలకు ముందే అమలు చేస్తామని కేంద్ర మంత్రులు బరితెగించి ప్రకటించడం కూడా ఇందుకోసమే. ప్రజల దైవభక్తినీ, మత విశ్వాసాన్నీ శక్తివంతంగా తమ రాజకీయ ప్రయోజనాల కోసం బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ నాయకులు వాడుకుంటున్నారు.

వామపక్షాలు, కార్మిక, కర్షక సంఘాలు, అభ్యుదయవాదులు, సంస్థల ముందు ఇది పెద్ద సవాలు. సమస్యకు పరిష్కారం దొరకనప్పుడు సహాయం చేసేవారు లేనప్పుడు మాత్రమే ప్రజలు దేవున్ని, మతాన్ని ఆశ్రయించి ఊరటపొందుతారు. ప్రజా ఉద్యమం బలహీనంగా ఉన్నప్పుడు మాత్రమే మతోన్మాద శక్తుల కుయుక్తులు ఫలిస్తాయి. పోరాటశక్తి బలహీనపడినప్పుడే మతోన్మాదం బలపడుతుందికదా! ఐక్య పోరాటాలే మోడీ పాలకుల కుయుక్తులకు విరుగుడు. ఇప్పటికే ఢిల్లీ చుట్టుపక్కల రాష్ట్రాల రైతాంగం మళ్లీ కదిలింది. ఇది శుభసూచికం. అది గమనించిన కేంద్ర పాలకులు ఉద్యమంమీద ఉక్కుపాదం మోపుతున్నారు. అక్కడి రైతాంగం ఒంటరిగా లేదని గుర్తు చేయాలి. దేశవ్యాపితంగా స్పందించాలి. ఇదే నేటి తక్షణ కర్తవ్యం.

పాక్ ఎన్నికల ప్రహసనం!



ఎం కోటేశ్వరరావు
8331013288

ఫిబ్రవరి ఎనిమిదిన పాకిస్థాన్ జాతీయ అసెంబ్లీ (పార్లమెంట్), నాలుగు రాష్ట్రాల అసెంబ్లీల ఎన్నికలు జరిగాయి. రాష్ట్రాలలో ఒక్క సింధులో మాత్రమే పీపుల్స్ పార్టీకి స్పష్టమైన మెజారిటీ వచ్చింది. జాతీయ అసెంబ్లీ, మిగిలిన మూడు రాష్ట్రాలలో ఏ పార్టీకీ మెజారిటీ రాలేదు. జాతీయ అసెంబ్లీలో ఇమ్రాన్‌ఖాన్ నాయకత్వంలోని నిషేధిత పాకిస్తాన్ తెహ్రీక్ ఇ ఇన్సాఫ్ (పిటిఐ) పార్టీ మద్దతుదార్లు స్వతంత్ర అభ్యర్థులుగా పోటీ చేసి ఇతర పార్టీలకంటే ఎక్కువ సీట్లు తెచ్చుకున్నారు. జాతీయ అసెంబ్లీలో మొత్తం 336 స్థానాలకు గాను 266 నియోజక వర్గాలలో ఎన్నికలు జరిగాయి. మిగిలిన 70 సీట్లలో 60 మంది మహిళలను రాష్ట్రాల వారీగా పార్టీలు తెచ్చుకున్న ఓట్లను బట్టి దామాషా పద్ధతిలో నియమిస్తారు. దేశమంతటి నుంచి మరో పదిమంది ముస్లిమేతర సామాజిక తరగతులకు చెందిన వారిని నామినేట్ చేస్తారు. ఎన్నికలు జరిగిన స్థానాలలో రెండు ఖాళీగా ఉన్నాయి. పార్టీల వారీ పిటిఐ బలపరిచిన స్వతంత్రులు 101 మంది గెలిచినట్లు వార్తలు వచ్చాయి. ఇది రాసిన సమయానికి 91 మంది పిటిఐ స్వతంత్రులు, ముస్లింలీగ్ (ఎన్) 80, పీపుల్స్ పార్టీ 54, ముత్తాహిదా క్వామీ మూవ్‌మెంట్ (ఎంక్యుఎం) 17 సీట్లు తెచ్చుకోగా ఐదుగురు ఇతర స్వతంత్రులు, మరో పది చిన్న పార్టీలకు 17 స్థానాలు వచ్చాయి. అంతిమంగా పార్లమెంటు సమావేశాల నాటికి పార్టీల బలాబలాల్లో మార్పులు ఉండవచ్చు. ఓటర్లలో 47 శాతం మంది పాల్గొన్నారు.



నాలుగు రాష్ట్రాల ఎన్నికల వివరాలిలా ఉన్నాయి. ఖైబర్ ఫక్తూన్‌లోని 145 మొత్తం స్థానాలకుగాను ఎన్నికలు జరిగిన 115లో 84 స్థానాలను పిటిఐ స్వతంత్రులు గెలుచుకున్నారు. అతి పెద్ద పంజాబ్‌లో 371కి గాను ఎన్నికలు జరిగిన 297లో ముస్లిం లీగుకు 137, పీటిఐ స్వతంత్రులు 116, పీపుల్స్ పార్టీ పది స్థానాలు గెలుచుకుంది. మరో రాష్ట్రమైన సింధులో 168కి గాను ఎన్నికలు జరిగిన 130లో పీపుల్స్ పార్టీ 84, ఎంక్యుఎం 28, పిటిఐ స్వతంత్రులు 11 మంది గెలిచారు. ఇక్కడ పీపుల్స్ పార్టీ ఎవరి మద్దతు అవసరం లేకుండానే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే అవకాశం ఉంది. బలూచిస్తాన్‌లో 65కు గాను ఎన్నికలు జరిగిన 51 చోట్ల పీపుల్స్ పార్టీ, జమాతే ఉలేమాకు పదకొండు చొప్పున ముస్లింలీగ్‌కు పది, మిగిలినవి స్వతంత్రులు, చిన్న పార్టీలకు వచ్చాయి. పంజాబ్‌లో ముస్లిం లీగ్‌కు మద్దతు ఇస్తామని, దానికి బదులు ప్రధాని పదవిని తమకు ఇవ్వాలని పీపుల్స్ పార్టీ తన డిమాండ్‌ను ముందుకు తెచ్చింది. పాకిస్తాన్‌లో 12.85 ఇకోట్ల మంది నమోదైన ఓటర్లు ఉన్నారు. వీరిలో 5.6 కోట్ల మంది 35ఏండ్లలోపు వారే.36-45 సంవత్సరాల వారు 2.9 కోట్ల మంది.మొత్తం ఓటర్లలో మహిళలు 46శాతమే. కాశ్మీరు నుంచి ఆక్రమించుకున్న ప్రాంతంతో పాటు గిల్గిట్-బాల్టిస్థాన్‌కు జాతీయ అసెంబ్లీలో ప్రాతినిధ్యం లేదు. వాటిని స్వతంత్ర విముక్త ప్రాంతాలుగా ప్రకటించిన సంగతి తెలిసిందే. అక్కడ విడిగా ఎన్నికలు నిర్వహిస్తారు. జాతీయ అసెంబ్లీకి 5,121 మంది, నాలుగు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో 12,695 మంది పోటీ చేశారు. వీరిలో 882 మంది మహిళలు, నలుగురు ట్రాన్స్ జెండర్లు ఉన్నారు. అభ్యర్థులలో 11,785 మంది స్వతంత్రులు, వారిలో 607 మంది మహిళలు.

పాకిస్తాన్ గద్దె మీద ఇమ్రాన్‌ఖాన్ ఉండటం అమెరికాకు సుతరామూ ఇష్టం లేదు. అతగాడు చేసిన "పాపం" ఏమిటంటే అమెరికాతో పాటు చైనా, రష్యాలతో కూడా సామరస్యంగా ఉండాలన్న వైఖరి తీసుకోవటమే. తటస్థంగా ఉండటం కూడా తమను వ్యతిరేకించటమే అన్నది అమెరికా భావన, అందుకే అనేక దేశాధినేతలను కుట్ర చేసి కూల్చివేసిన చరిత్ర తెలిసిందే. ఇస్లామాబాద్‌లో ఎవరు అధికారంలో ఉన్నప్పటికీ తమకు మాత్రమే విధేయత చూపాలని అది కోరుకుంటున్నది. ఉక్రె యిన్ మీద రష్యా ప్రారంభించిన సైనిక చర్య 2022 ఫిబ్రవరి 24 నుంచి జరుగుతున్న సంగతి తెలిసిందే. సరిగ్గా అదే రోజున మాస్కోలో వ్లదిమిర్ పుతిన్-ఇమ్రాన్‌ఖాన్ భేటీ జరిగింది. వివాదాన్ని సామరస్య పూర్వకంగా పరిష్కరించుకోవాలని ఖాన్ చెప్పాడు. రష్యాపై విధించిన ఆంక్షలను కూడా వ్యతిరేకించాడు. అది అమెరికాకు నచ్చలేదు. మార్చి ఆరవ తేదీన ఇమ్రాన్‌ఖాన్ ఒక పెద్ద బహిరంగ సభ నిర్వహించాడు. దానిలో ఒక కాగితాన్ని చూపుతూ 'రష్యాను ఖండించాలని, వ్యతిరేకంగా ఓటు వేయాలని కోరుతూ ఐరోపా యూనియన్ రాయబారులు ఒక లేఖ రాశారు. మీరు మా గురించి ఏమనుకుంటున్నారు. మీరేం చెబితే దాన్ని చేయటానికి మేము మీ బానిసలమా? మేము రష్యాకు, అమెరికాకు, చైనాకు, ఐరోపాకూ స్నేహితులమే. మేము ఎవరి శిబిరంలోనూ లేము. పాకిస్తాన్ తటస్థంగా ఉంటుంది, ఉక్రెయిన్‌లో యుద్ధాన్ని ముగించాలని కోరుకునే వారితో కలసి పనిచేస్తుంది' అని ప్రకటించాడు. ఆ మరుసటి రోజే కుట్రకు తెరలేచింది. వాషింగ్టన్‌లో పాక్ రాయబారి అసాద్ మజీద్ ఖాన్‌తో జరిపిన సమావేశానికి దక్షిణ, మధ్య ఆసియా వ్యవహారాల అమెరికా సహాయ మంత్రి డోనాల్డ్, మరో అధికారి వచ్చారు. ఆ సమావేశంలో డోనాల్డ్ మాటల సారం ఇలా ఉంది. ఉక్రెయిన్ అంశంలో పాక్ వైఖరి అమెరికా, ఐరోపాకు ఆందోళనకరంగా ఉంది. ఐరోపా దీన్ని ఎలా చూస్తుందో చెప్పలేము, నేనను కోవటం వారి స్పందన కూడా ఇలాగే ఉంటుంది. ఖాన్ గనుక అధికారంలో కొనసాగితే ఐరోపా, అమెరికా అతన్ని ఒంటరిపాటు చేస్తాయి.

మార్చి ఆరవ తేదీన ఇమ్రాన్ ఖాన్ ఒక పెద్ద బహిరంగ సభ నిర్వహించాడు. దానిలో ఒక కాగితాన్ని చూపుతూ 'రష్యాను ఖండించాలని, వ్యతిరేకంగా ఓటు వేయాలని కోరుతూ ఐరోపా యూనియన్ రాయబారులు ఒక లేఖ రాశారు. మీరు మా గురించి ఏమనుకుంటున్నారు. మీరేం చెబితే దాన్ని చేయటానికి మేము మీ బానిసలమా? మేము రష్యాకు, అమెరికాకు, చైనాకు, ఐరోపాకూ స్నేహితులమే. మేము ఎవరి శిబిరంలోనూ లేము. పాకిస్తాన్ తటస్థంగా ఉంటుంది, ఉక్రెయిన్‌లో యుద్ధాన్ని ముగించాలని కోరుకునేవారితో కలసి పనిచేస్తుంది' అని ప్రకటించాడు. ఆ మరుసటి రోజే కుట్రకు తెరలేచింది.

అమెరికా సిఐఏ కుట్ర ప్రకారం సాకులు చూపి పాక్ చరిత్రలో తొలిసారి ఒక ప్రధాని మీద అవిశ్వాస తీర్మానం పెట్టి 2022 ఏప్రిల్‌లో ఖాన్‌ను పదవి నుంచి తొలగించారు. పిటిఐ పార్టీలో అంతర్గత ఎన్నికలు తమకు సంతృప్తి కలిగే విధంగా నిర్వహించలేదని సాధారణ ఎన్నికల్లో పోటీకి ఎన్నికల కమిషన్ అనర్హత వేటు వేసింది, ఎన్నికల చిహ్నం క్రికెట్ బాట్‌ను స్తంభింప చేసింది. దాంతో ఆ పార్టీ అభ్యర్థులందరూ స్వతంత్రులుగా వేర్వేరు గుర్తులతో పోటీ చేయాల్సి వచ్చింది. వారంతా పార్లమెంటులో మరొక కొత్త పార్టీ పేరుతో ఒక బృందంగా ఏర్పడతారా, ఏం జరుగుతుందో తెలియని స్థితి. వారిని చేర్చుకొనేందుకు ప్రధాన పార్టీలు ప్రలోభాలు, బెదరింపులకు పాల్పడుతున్నట్లు వార్తలు. పాక్ నిబంధనల ప్రకారం వచ్చిన ఓట్ల దామాషా ప్రకారం పార్టీలకు నామినేటెడ్ సీట్లను కేటాయిస్తారు. పిటిఐ ప్రస్తుతం ఒక పార్టీగా గుర్తింపు లేనందున దానికి వచ్చే అదనపు సీట్లేమీ ఉండవు. గత ఎన్నికల్లో 31.82 శాతం ఓట్లతో పెద్ద పార్టీగా అవతరించి 336కు గాను 149 సీట్లను కైవసం చేసుకుంది.ఈ సారి ఏ పార్టీ కూడా సంపూర్ణ మెజారిటీకి అవసరమైన 169 సీట్లను తెచ్చుకొనే పరిస్థితి లేదు. ముస్లింలీగ్, పీపుల్స్ పార్టీ సంకీర్ణ కూటమి సర్కార్ ఏర్పాటుకు పూనుకున్నట్లు వార్తలు. డెబ్బయి ఒక్క సంవత్సరాల ఇమ్రాన్ ఖాన్‌కు మూడు కేసుల్లో 31 సంవత్సరాల జైలుశిక్షతో పాటు పదేళ్ల పాటు ఏ ఎన్నికల్లోనూ పోటీ చేయకూడదనే అనర్హతను కూడా కోర్టు ప్రకటించింది.

ఈ పూర్వరంగంలో జరిగిన ఎన్నికలు ఎంత ప్రహసనంగా సాగిందీ అర్థం చేసుకోవచ్చు. ఓట్ల రిగ్గింగు, లెక్కింపును సాగదీశారని, 24చోట్ల గెలిచినట్లు ప్రకటించిన వారికి వచ్చిన మెజా రిటీ కంటే చెల్లవని ప్రకటించిన ఓట్లే ఎక్కువని తేలింది. వాటిలో 13 సీట్లు ముస్లిం లీగ్‌కు, ఐదు పీపుల్స్ పార్టీ, నాలుగు చోట్ల పిటిఐ -స్వతంత్రులు, మరో రెండు చోట్ల ఇతర స్వతంత్రులు గెలిచారు. ఎన్నో ఆరోపణలు వెల్లువెత్తినప్పటికీ 91మంది పిటిఐ మద్దతుదార్లు గెలిచారంటే పాక్ ఓటర్లు ప్రజాస్వామ్యాన్ని కోరుకుంటున్నారని, మిలిటరీ, న్యాయవ్యవస్థ కుట్రలను వ్యతిరేకిస్తున్నారని, అన్నింటికీ మించి ముఖ్యంగా యువత అమెరికా పట్ల వ్యతిరేకతను వెల్లడిస్తున్నారన్నది స్పష్టంగా కనిపిస్తోంది. అనేక విదేశీ మీడియా సంస్థలు వెల్లడించిన అభిప్రాయం కూడా ఇదే. ఈ అక్ర మాల గురించి పిటిఐ మద్దతుదార్లు, సాధారణ ప్రజానీకం ఎలా స్పందించేదీ చూడాల్సి ఉంది. దేశ రాజ్యాంగం ప్రకారం ఎన్నికల ఫలితాల నోటిఫికేషన్ వెలువడిన తరువాత 21 రోజుల్లోపు (ఫిబ్రవరి 29) కొత్త పార్లమెంటు సమావేశం కావాల్సి ఉంది. అంతకు ముందే కూడా ఏర్పాటు కావచ్చు. తొలుత స్పీకర్ ఎన్నిక, తరువాత సభా నేత (ప్రధాని) ఎన్నిక నిర్వహిస్తారు. ఈ పదవికి ఎందరైనా పోటీ పడ వచ్చు. సాధారణ మెజారిటీ 169 ఓట్లు తెచ్చుకున్న వారిని విజేతగా ప్రకటిస్తారు. ఆ మేరకు రాకపోతే ఎక్కువ ఓట్లు తెచ్చుకున్న తొలి ఇద్దరి మధ్య మరోసారి ఎన్నిక నిర్వహిస్తారు. తొలిరోజు సభ్యుల ప్రమాతణ స్వీకారం, మార్చి 1న స్పీకర్, రెండున ప్రధాని ఎన్నిక జరుగుతుంది. తరువాత సెనెట్ ఎన్నికలు జరుగుతాయి.

ఓట్ల రిగ్గింగు, లెక్కింపును సాగదీశారని, 24చోట్ల గెలిచినట్లు ప్రకటించిన వారికి వచ్చిన మెజారిటీ కంటే చెల్లవని ప్రకటించిన ఓట్లే ఎక్కువని తేలింది. వాటిలో 13 సీట్లు ముస్లింలీగ్‌కు, ఐదు పీపుల్స్ పార్టీ, నాలుగు చోట్ల పిటిఐ-స్వతంత్రులు, మరో రెండు చోట్ల ఇతర స్వతంత్రులు గెలిచారు. ఎన్నో ఆరోపణలు వెల్లువెత్తినప్పటికీ 91 మంది పిటిఐ మద్దతుదార్లు గెలిచారంటే పాక్ ఓటర్లు ప్రజాస్వామ్యాన్ని కోరుకుంటున్నారని, మిలిటరీ, న్యాయవ్యవస్థ కుట్రలను వ్యతిరేకిస్తున్నారని, అన్నింటికీ మించి ముఖ్యంగా యువత అమెరికా పట్ల వ్యతిరేకతను వెల్లడిస్తున్నారన్నది స్పష్టంగా కనిపిస్తోంది. అనేక విదేశీ మీడియా సంస్థలు వెల్లడించిన అభిప్రాయం కూడా ఇదే.

1985లో పార్టీ రహిత ప్రాతిపదికన ఎన్నికలు జరిగాయి. గెలిచిన వారందరినీ స్వతంత్రులుగా పరిగణించారు. తరువాత అత్యధికులు తాము పాకిస్తాన్ ముస్లిం లీగ్ అనే పార్టీగా ఏర్పడినట్లు ప్రకటించుకున్నారు. తరువాత ఆ పార్టీలో చీలికలు వచ్చాయి. ఇప్పుడు కూడా పిటిఐ మద్దతుతో గెలిచిన స్వతంత్రులు ఏదో ఒక పార్టీ పేరుతో ఏర్పడతారా లేదా అన్నది చూడాల్సి ఉంది. ఒకవేళ అలా ఏర్పడితే ప్రభుత్వం వేధింపులకు పాల్పడే అవకాశం ఉంది. ఇప్పటికే అనేక మందిని ఆకర్షించేందుకు ప్రధాన పార్టీలు బేరసారాలు, బెదిరింపులకు దిగినట్లు వార్తలు వచ్చాయి. అందువలన పార్లమెంటు సమావేశం నాటికి పార్టీల బలాబలాల్లో మార్పులు జరిగే అవకాశం లేకపోలేదు. నోటిఫికేషన్ ఇచ్చిన తర్వాత 3 రోజుల్లో స్వతంత్ర అభ్యర్థులు పార్టీలను ఎంచుకోవచ్చు. తరువాత పార్టీలకు వచ్చిన ఓట్ల దామాషాలో నామినేటెడ్ సీట్లను కేటాయిస్తారు. తరువాత జాతీయ అసెంబ్లీ సమావేశం జరుగుతుంది.

గవర్నర్ల 'పరివార్' మార్క్!

ప్రజలెన్నుకున్న రాష్ట్ర ప్రభుత్వాల ఆకాంక్షలకు అనుగుణంగా, రాష్ట్ర పెద్దగా గవర్నర్లు తమ పాత్ర పోషించాల్సింది ప్రతిపక్ష పాలిత రాష్ట్రాల్లో పరిపాలనను అనిశ్చితిలో పడేయడం, అడ్డుకోవడమే లక్ష్యంగా మోడీ ప్రభుత్వ హయాంలో వికృత పోకడలు పోవడం దారుణం. ఏటా మొదటి సెషన్‌లో శాసనసభనుద్దేశించి చేసే ప్రసంగం నుంచి, బిల్లులు తొక్కిపెట్టడం, వీధి పోరాటాల వరకూ అన్నింటా ఒకే తీరులో కాషాయ పార్టీ ఏజెంట్లలా వ్యవహరిస్తున్నారు. తాజాగా తమిళనాడు గవర్నర్ ఆర్‌ఎన్ రవి అసెంబ్లీలో ప్రవర్తించిన తీరు జుగుప్సాకరంగా ఉంది. తమిళనాడు ప్రభుత్వం రూపొందించిన ప్రసంగ పాఠాన్ని పూర్తిగా చదివేందుకు తిరస్కరించడంతోపాటు నాలుగు నిమిషాల్లోనే ముక్తసరిగా ముగించేశారు. రాజ్యాంగ నియమాలను, సభా మర్యాదలను మరోసారి ఆయన తుంగలో తొక్కారు. తమిళ భాషను ప్రశంసించే గీతాన్ని సభ ప్రారంభానికి ముందు, సమావేశాల ముగింపులో జాతీయగీతం ఆలపించడం తమిళనాడులో సంప్రదాయంగా వస్తోంది. జాతీయ గీతం ఆలపించేవరకూ ఉండకుండా వెళ్లి పోయిన గవర్నర్ జాతీయ గీతానికి తగిన గౌరవం ఇవ్వడం లేదని ప్రత్యారోపణ చేయడం సిగ్గుచేటు. తమిళనాడు తీవ్రమైన వరదల్లో చిక్కుకున్నా కేంద్రం పట్టించుకోలేదు. రాష్ట్రాలు రుణాలు చేయకుండా, గ్రాంట్లు ఇవ్వకుండా, జీఎస్‌టిలో వాటా సక్రమంగా ఇవ్వకుండా కేంద్రం అనుసరిస్తున్న దుర్మార్గ వైఖరిపై కేరళ, కర్నాటక ప్రభుత్వాలు ఢిల్లీ నడిబొడ్డున నిరసన తెలిపాయి.

ఫెడరలిజాన్ని కాపాడడం కోసం కేరళ సీఎం విజయన్ నేతృత్వంలో నిర్వహించిన నిరసనలో ఢిల్లీ, పంజాబ్ సీఎంలు పాల్గొనగా, తమిళనాడు సీఎం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా గొంతు కలిపారు. ప్రతి వంద రూపాయల పన్నుల వాటాలో బీజేపీ పాలనలోని ఉత్తర ప్రదేశ్‌కు రూ.46 ఇస్తే, కేరళకు రూ.21 అందుతుందంటేనే ఈ వివక్ష అర్థమవుతుంది. 2022 జూన్‌లో నష్టపరిహార నిబంధనలను సైతం కేంద్రం రద్దు చేయడంతో తమిళనాడు ఏటా రూ.20వేల కోట్ల రెవిన్యూ లోటును ఎదుర్కొంటోంది. చెన్నై మెట్రో రైలు ప్రాజెక్టులో సగం ఖర్చు భరిస్తామని ఇచ్చిన హామీ నుండి కేంద్రం వెనక్కివెళ్లి, రెండేళ్లకుపైగా జాప్యం చేస్తోంది. భిన్నత్వంలో ఏకత్వం అనే భావనకు ముప్పు వాటిల్లే సిఏఏను అమలు చేసే ప్రసక్తే లేదని తమిళనాడు సర్కారు ప్రతినబూనింది. జాతీయ జనగణనతోపాటు కుల గణన చేపట్టాలని కోరింది. ఈ అంశాలను చదివేందుకు గవర్నర్‌కు మనస్కరించలేదు. 48 పేజీల ఈ ప్రసంగంలోని కొన్ని పేరాలతో తాను ఏకీభవించలేనని, వాస్తవిక, నైతిక ప్రాతిపదికన వాటితో విభేదిస్తున్నానని సెలవిచ్చిన ఆయన ఆ అంశాలేమిటో మాత్రం చెప్పలేదు. గతేడాది బడ్జెట్ సమావేశాల ప్రారంభంలోనూ కొన్ని పేరాలను వదిలేశారు. రాష్ట్రంలో శాంతి భద్రతల పరిస్థితులు, ద్రవిడ తరహా పాలన, పెరియార్ తదితర ద్రవిడ నేతల గురించి, అంబేద్కర్ గురించి ఉన్న భాగాలను విడిచిపెట్టారు.

ప్రతిపక్ష పాలిత రాష్ట్రాల్లోనే ఇలా ఎందుకు జరుగుతోందని ప్రశ్నించుకుంటేనే గవర్నర్ల వ్యవస్థ దుర్వినియోగం అవుతున్న తీరు అర్థమవుతుంది. బీజేపీయేతర రాష్ట్రాల్లో కేంద్ర ప్రభుత్వ ఏజెన్సీలతో దాడులు చేస్తూ, అక్కడి ప్రభుత్వాలను అస్థిరపరిచేందుకు ప్రయత్నిస్తోంది. ఇప్పటికే జార్ఖండ్ సిఎం హేమంత్ సోరేన్‌ను అరెస్టు చేయగా, ఢిల్లీ సీఎం కేజ్రీవాల్‌కు సమన్లు పంపుతోంది. శాసనసభ ఆమోదించిన బిల్లులు, చట్టాలపై సంతకాలు చేయకపోవడానికి కారణాలుంటే వాటిని నోట్‌చేసి వెనక్కి పంపాలని, మళ్లీ అసెంబ్లీలో ఆమోదించి పంపితే ఆమోదించి తీరాలని సుప్రీంకోర్టు తీర్పు చెప్పినా, తమిళనాడు, పంజాబ్, కేరళ గవర్నర్లకు పట్టింపులేదు. ఆయా రాష్ట్రాల్లో అభివృద్ధిని, సంక్షేమ పథకాలను అడ్డుకుంటున్నారు. పాలనా పరమైన సంక్షోభాన్ని సృష్టించేలా వ్యవహరిస్తున్నారు. రాజ్యాంగం ప్రవచించిన ఫెడరల్ స్ఫూర్తిని మంటగలుపుతున్న 'పరివార్' మార్క్ గవర్నర్ల చర్యలను దేశమంతా ఛీత్కరిస్తున్నా మోడీ సర్కారు వారిని అక్కున చేర్చుకోవడం సిగ్గుచేటు. కనుక ఆ సర్కారును గద్దె దింపితేనే ఇలాంటి నిరంకుశ పోకడలకు ఫుల్‌స్టాప్.

-ఫీచర్స్ అండ్ పాలిటిక్స్

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నవతెలంగాణ-ఎర్రుపాలెం

ములుగుమాడు విద్యుత్ సబ్ స్టేషన్ నందు విద్యుత్ పవర్ ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతుల నిమిత్తం సబ్ స్టేషన్ పరిధిలో గల ములుగుమాడు, ఇనగాలి, రామన్నపాలెం, శకునివీడు, తక్కెళ్లపాడు గ్రామాలకు ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని మామునూరు సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ ఆర్ శ్రీనివాసరావు తెలిపారు.



సైన్స్ ఇన్స్ స్పైర్ అవార్డుకు ఎంపికైన రెజొనెన్స్ ఇన్ఫో విద్యార్థి

నవతెలంగాణ- ఖమ్మం

రాష్ట్ర స్థాయిలో సైన్స్ ఇన్స్ స్పైర్ అవార్డుకు రెజొనెన్స్ ఇన్ఫో స్కూల్ విద్యార్థి ఎంపికైనట్లు రెజొనెన్స్ ఇన్ఫో స్కూల్ డైరెక్టర్ ఆర్.వి. నాగేంద్ర కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర స్థాయి సైన్స్ ఇన్స్పైర్ ప్రాజెక్టులు తయారు చేయటానికి రాష్ట్ర సైన్సు కాంగ్రెస్ కమిటీ ఇచ్చిన సమాచారం మేరకు స్కూల్ లెవల్ ప్రాజెక్టు తయారులో భాగంగా పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న ఎ.షణ్ముఖ శ్రీ గోపాల్ తనకు ఉన్న సృజనాత్మకతతో పాఠశాల విద్యార్థుల స్కూల్ బ్యాగ్ మోయటం చాలా సమస్య గా మారిన తరుణంలో స్మార్ట్ ర్యాంప్ అను ప్రాజెక్టు తయారు చేసి జిల్లా నుండి రాష్ట్ర స్థాయి పోటీకి ఎంపికైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్లు కొండా శ్రీధర్, నీలిమా, ప్రిన్సిపాల్ గోపాలకృష్ణలు విద్యార్థికి శుభాకాంక్షలు తెలిపారు.

విద్యుదాఘాతంతో కౌలు రైతు మృతి

నవతెలంగాణ-ఖమ్మంరూరల్

విద్యుదాఘాతంతో కౌలు రైతు మృతిచెందిన సంఘటన మండల పరిధిలోని మంగళగూడెంలో బుధవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ మండలం రాముతండా పంచాయతీ లకావతండా శివారు గ్రామానికి చెందిన సోమ్లా (59) మంగళగూడెంలో చేను కౌలుకు తీసుకొని వ్యవసాయం చేస్తున్నాడు. చేలో విద్యుత్తు మోటారు కోసం విద్యుత్తు తీగ (సర్వీస్ వైర్)ను ట్రాన్స్ఫార్మర్ నుంచి చేలో ఉన్న ఫెన్సింగ్ తీగల మీదుగా విద్యుత్తు మోటరుకు కనెక్షన్ ఇచ్చారు.విద్యుత్తు తీగ మరమ్మతులకు గురై ఫెన్సింగ్ తీగలకు ఆనుకొని ఫెన్సింగ్ తీగలకు విద్యుత్తు సరఫరా జరిగింది. రైతు సోమ్లా ఫెన్షింగ్ తీగలను పట్టుకోగా విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. ఆయనకు భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు.

సత్తుపల్లి మున్సిపల్ కమిషనర్ సుజాత బదిలీ

- కామారెడ్డికి బదిలీ చేస్తూ ఆ శాఖ ఉత్తర్వులు

నవతెలంగాణ-సత్తుపల్లి

సత్తుపల్లి మున్సిపల్ కమిషనర్ కోడూరు సుజాత కామారెడ్డికి బదిలీ అయ్యారు. గ్రూప్-2 నియామకాల్లో భాగంగా ఉత్తీర్ణత సాధించిన సుజాతకు మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ శాఖలో ప్రభుత్వం సత్తుపల్లి మున్సిపల్ కమిషనర్‌గా ఫిబ్రవరి 20, 2020లో మొదటి పోస్టింగ్ ఇచ్చింది. సుమారు నాలుగేండ్ల పాటు కమిషనర్‌గా సుజాత సత్తుపల్లిలో విధులు నిర్వహించారు. కొత్తగా సత్తుపల్లి కమిషనర్‌గా మేడ్చల్ మల్కాజ్‌గిరి మెప్మా పీడీ కార్యాలయంలో అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న ఎం రవిబాబు సత్తుపల్లి మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టనున్నారు. త్వరలో జరుగనున్న పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు రాష్ట్రంలో 74 మంది కమిషనర్లను తెలంగాణ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ శాఖ బదిలీ చేసింది.

సత్తుపల్లి ఏసీపీగా బాధ్యతలు చేపట్టిన రఘు

నవతెలంగాణ-సత్తుపల్లి



సత్తుపల్లి అసిస్టెంట్ పోలీస్ కమిషనర్‌గా అనిశెట్టి రఘు బుధవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు హైదరాబాద్ సైబర్ సెక్యూరిటీ విభాగంలో విధులు నిర్వహించిన రఘు సత్తుపల్లి ఏసీపీగా నియామకపు ఉత్తర్వులను డీజీపీ కార్యాలయం నుంచి అందుకున్నారు. రఘు 2006-07లో సత్తుపల్లి సబ్ ఇన్స్పెక్టర్‌గా పనిచేశారు. అనంతంగా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో ఎస్సైగా, సీఐగా, డీఎస్పీగా రఘు ఉద్యోగ బాధ్యతలు నిర్వహించారు. ఏసీపీగా బాధ్యతలు చేపట్టేందుకు సత్తుపల్లి వచ్చిన రఘుకు ఇక్కడ ఇంతకాలం ఏసీపీగా విధులు నిర్వహించిన బొజ్జా రామానుజం బాధ్యతలు అప్పగిస్తూ అభినందనలు తెలిపారు. రామానుజం సత్తుపల్లిగా ఏసీపీగా 368 రోజుల పాటు సేవలందించారు. ఏసీపీగా బాధ్యతలు చేపట్టిన రఘును సీఐ తెల్లబోయిన కిరణ్, ఎస్సైలు కరుణాకర్, కుశ్‌కుమార్, ఏసీపీ కార్యాలయ సిబ్బంది మర్యాద పూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు.

స్మార్ట్ కిడ్జ్‌లో వేడుకగా వసంత పంచమి

నవతెలంగాణ-ఖమ్మం



నగరంలోని స్మార్ట్ కిడ్జ్ పాఠశాలలో బుధవారం వసంత పంచమి వేడుకలు సంప్రదాయ సిద్ధంగా నిర్వహించారు. పాఠశాలలో విద్యార్థులు సరస్వతి పూజలో పాల్గొన్నారు. వేద పండితులు ప్రత్యేకంగా అమ్మవారికి సంప్రదాయ సిద్ధంగా వేదమంత్రోచ్చారణతో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అమ్మవారికి ధూప దీప నైవేద్యాలతో నివేదన సమర్పించిన అనంతరం చిన్నారులకు అక్షరాభ్యాస కార్యక్రమాన్ని జరిపారు. పాఠశాల విద్యార్థులందరూ సరస్వతీ మాతకు మొక్కులు చెల్లించి తమకు విద్యాబుద్ధులతో అగ్రభాగాన నిలిచేలా దీవెనలు ఇవ్వాలని ప్రార్థించారు. విద్యార్థులకు పాఠశాల కరస్పాండెంట్ చింతనిప్పు కృష్ణచైతన్య, పాఠశాల డైరెక్టర్ చింతనిప్పు సుకన్యలు పుస్తకాలు, పెన్నులను అందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఖమ్మం డిటివోగా అఫ్రీన్ సిద్ధిఖి

నవతెలంగాణ- ఖమ్మం

ఖమ్మం జిల్లా రవాణా శాఖ అధికారిగా అఫ్రీన్ సిద్ధిఖి నియమిస్తూ రవాణా శాఖ జాయింట్ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. పెద్దపల్లి జిల్లా డిటివో పనిచేస్తున్న ఆమె ఖమ్మం రానున్నారు. ఇప్పటివరకు ఇన్చార్జిగా డిటివో గౌస్ పాషాను మహబూబాబాద్ ఎంవిఐగా బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

శతాధిక వృద్ధురాలు మృతి

నవతెలంగాణ-కల్లూరు

పెద్దకోరుకొండి గ్రామానికి చెందిన తైదల సుబ్బమ్మ (105)బుధవారం మధ్యాహ్నం సమయంలో మృతిచెందింది. ఆమె భర్త పది సంవత్సరాల క్రితం మరణించారు. ఆమె మరణం పట్ల మాజీ సర్పంచ్ వేము రత్తమ్మ, మండల కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ జిల్లా చేపల సొసైటీ మాజీ చైర్మన్ మర్సకట్ల బాలరాజు(శౌరి,), ప్రముఖ వైద్యులు వేము గంగరాజు, కాంగ్రెస్ నాయకులు మాదిరాజు అన్నమరాజు, దేవరపు అభిలాష్, మచ్చ వెంకటేశ్వరరావు, గ్రామ ప్రముఖులు గ్రామస్తులు ఆమె భౌతికగాయాన్ని సందర్శించి నివాళులర్పించారు.

జిల్లా వాసికి పిజిటిలో తెలంగాణ స్టేట్ ర్యాంక్

నవతెలంగాణ-ఖమ్మం

పోస్టు గ్రాడ్యుయేట్ టీచర్స్ (పిజిటి) ఫలితాల్లో ఖమ్మం రోటరీనగర్‌కు చెందిన రాచర్ల భార్గవరామ్ రాష్ట్రస్థాయిలో 26వ ర్యాంకు సాధించి పోస్ట్ గ్రాడ్యుయేట్ టీచర్స్ ఇంగ్లీష్ పోస్టుకు ఎంపికయ్యారు. రాష్ట్రస్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన రాచర్ల భార్గవరామ్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో పీజీటీ ఇంగ్లీష్ ఉద్యోగం సాధించారు. భార్గవరామ్ ఎం.ఎ, బి.ఎడ్, పీ.జీ.సి.టి (ఈఎఫ్ఎల్‌యు) బిఎల్ఐఎస్‌సి చదివారు.

నగర ఏసీపీగా రమణమూర్తి, రూరల్ ఏసీపీగా తిరుపతిరెడ్డి

నవతెలంగాణ- ఖమ్మం





ఖమ్మం నగర ఏసిపిగా ఎస్‌వి.రమణమూర్తి, ఖమ్మంరూరల్ ఏసిపిగా తిరుపతి రెడ్డిని నియమిస్తూ డిజిపి రవి గుప్తా ఉత్తర్వులు జారీ చేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెం డిఎస్పీ గా పనిచేస్తున్న రమణమూర్తిని ఖమ్మం ఏసిపిగా నియమించారు. ఖమ్మం ఏసిపిగా పనిచేస్తున్న హరికృష్ణ హైదరాబాద్ సైబర్ సెక్యూరిటీ బ్యూరోగా, మంచిర్యాల ఏసీపీగా పనిచేస్తున్న బి.తిరుపతిరెడ్డిని ఖమ్మంరూరల్ ఏసీపీగా నియమించారు. ఖమ్మం రూరల్ ఏసీపీగా పనిచేస్తున్న బస్వారెడ్డిని నిజామాబాద్ జిల్లా ఆర్మూరు ఏసీపీగా బదిలీ చేస్తూ డిజిపి రవి గుప్తా ఉత్తర్వులు జారీచేశారు .

పెద్దల సభకు 'ఫైర్‌బ్రాండ్'

మరోసారి అవకాశం దక్కించుకున్న రేణుకాచౌదరి

- కాంగ్రెస్ నుంచి రాజ్యసభ అభ్యర్థిగా పేరు ఖరారు
- లోక్‌సభ సామాజిక సమీకరణాలపై దృష్టితో ఎంపిక
- రేణుకకు కలిసివచ్చిన సీనియార్టీ...సిన్సియార్టీ

నవతెలంగాణ- ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

రాజ్యసభ కాంగ్రెస్ అభ్యర్థిగా కేంద్ర మాజీ మంత్రి రేణుకాచౌదరి పేరు ఖరారైంది. ఆమెతో పాటు కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ మంత్రి అంజన్‌కుమార్ యాదవ్ కుమారుడు అనిల్‌కుమార్ యాదవ్‌ను తెలంగాణ నుంచి రాజ్యసభ అభ్యర్థులుగా ఏఐసీసీ బుధవారం ప్రకటించింది. రాష్ట్రం నుంచి మూడు రాజ్యసభ సీట్లు ఖాళీ అయ్యాయి. గతంలో ఈ మూడింటికీ బీఆర్ఎస్ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, జోగినపల్లి సంతోష్, బడుగుల లింగయ్యయాదవ్ ప్రాతినిధ్యం వహించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో శాసనసభలో ఎమ్మెల్యేల సంఖ్య ఆధారంగా ఈ మూడు స్థానాలకు ఎన్నికలు జరుగుతాయి. అసెంబ్లీలో సంఖ్యాబలం దృష్ట్యా కాంగ్రెస్ నుంచి ఇద్దరు, బీఆర్ఎస్ నుంచి ఒక్కరు రాజ్యసభ సభ్యులుగా ఎన్నికయ్యే అవకాశం ఉంది. గులాబీ పార్టీ నుంచి వద్దిరాజు రవిచంద్రకు మరోసారి అవకాశం దక్కవచ్చని తెలుస్తోంది. రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రంలోని 17 స్థానాలకు గాను 16 సీట్లను దక్కించుకోవాలని కాంగ్రెస్ పార్టీ కృతనిశ్చయంతో ఉంది. దీనిలో ఖమ్మం కీలకమైన సీటు కావడంతో ఇక్కడున్న సామాజిక సమీకరణాలను దృష్టిలో పెట్టుకుని కాంగ్రెస్ అధిష్టానం రాజ్యసభకు రేణుకాచౌదరిని అభ్యర్థిగా ఎంపిక చేసినట్లు తెలుస్తోంది.

సీనియార్టీ...సిన్సియార్టీ...

రేణుకాచౌదరితో పాటు రాజ్యసభ అభ్యర్థిత్వం కోసం పలువురు సీనియర్లు పోటీ పడ్డారు. ఒక దశలో కాంగ్రెస్ జాతీయ నాయకురాలు సోనియాగాంధీ సైతం తెలంగాణ నుంచి రాజ్యసభ లేదా లోక్‌సభకు పోటీ చేయాలనే డిమాండ్ ముందుకొచ్చింది. పార్టీ పొలిటికల్ ఎఫైర్స్ కమిటీ ఈ మేరకు నిర్ణయం కూడా చేసింది. కానీ ఆమె



రాజస్థాన్ నుంచి రాజ్యసభ అభ్యర్థిగా ఖరారు అయ్యారు. ఈ నేపథ్యంలో తెలంగాణ నుంచి ఇద్దరు సీనియర్లను అభ్యర్థులుగా ఎంపిక చేస్తారని ప్రచారం నడిచింది. సీనియర్ నేతలు రేణుకాచౌదరి, మాజీ మంత్రులు జానారెడ్డి, చిన్నారెడ్డి, మాజీ రాజ్యసభ సభ్యులు వి.హనుమంతరావు పేర్లు ప్రముఖంగా వినిపించాయి. కాంగ్రెస్ అధిష్టానం మాత్రం సీనియార్టీతో పాటు పార్టీకి విధేయురాలిగా ఉంటూ అసెంబ్లీ ఎన్నికల్లో ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి పదికి తొమ్మిది స్థానాలు దక్కేందుకు తోడ్పడిన రేణుకాపై విశ్వాసం ఉంచింది. జిల్లాకు చెందిన సీనియర్ కాంగ్రెస్ నేతలు సంభాని చంద్రశేఖర్, ఎడవల్లి కృష్ణ, మానవతారాయ్ తదితరులు అసెంబ్లీ ఎన్నికల సమయంలో టిక్కెట్లు దక్కకపోవడంతో కాంగ్రెస్‌ను వీడి గులాబీ పార్టీలో చేరారు. కానీ రేణుక మాత్రం పార్టీని అంటిపెట్టుకుని, మాజీ మంత్రి అజయ్‌కు సవాల్ విసిరారు. తన తెగువతో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల్లో మనోధైర్యం నింపారు. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో సామాజిక సమీకరణాల నేపథ్యంలో ఆమెకు ఖమ్మం నుంచి టిక్కెట్ కేటాయించడం ఒకింత ఇబ్బందికరం కావచ్చు. కాబట్టి ఏదో ఒకరకంగా రేణుకాచౌదరి సామాజిక తరగతికి న్యాయం చేయాలనే యోచన కాంగ్రెస్ అధిష్టానం చేసినట్లు సమాచారం.

గతంలోనే ఉభయసభలకు ప్రాతినిధ్యం...

రేణుకాచౌదరి గతంలోనే ఉభయ సభలకు ప్రాతినిధ్యం వహించారు. కేంద్ర మంత్రిగానూ పనిచేసిన అనుభవం ఆమెకు ఉంది. 1954లో విశాఖపట్టణంలో జన్మించిన రేణుకకు 1973లో శ్రీధర్‌చౌదరితో వివాహం అయింది. ఆమెకు పూజిత, తేజస్వినీ అనే ఇద్దరు కూతుళ్లు. మాస్టర్స్ డిగ్రీ పూర్తి చేసిన రేణుకా 2012 నుంచి 2018 వరకు రాజ్యసభకు ప్రాతినిధ్యం వహించారు. 2004-06 వరకు కేంద్ర పర్యాటకశాఖ మంత్రిగా, 2006-09 వరకు కేంద్ర స్త్రీ, శిశుసంక్షేమశాఖ మంత్రిగానూ పనిచేశారు. ఆమె పర్యాటకశాఖ మంత్రిగా ఉన్న సమయంలోనే పాలేరు రిజర్వాయర్‌ను పర్యాటకంగా అభివృద్ధి చేశారు. పార్కు, బోటింగ్ తదితర వసతులు కల్పించారు. నేలకొండపల్లి మండలం ముజ్జుగూడెం భౌద్ధస్థూపాన్ని సైతం ఓ దర్శనీయ స్థలంగా తీర్చిదిద్దారు. 1999లో తొలిసారి ఖమ్మం లోక్‌సభ స్థానానికి పోటీ చేసి గెలిచారు. 2004లో టీడీపీ అభ్యర్థి నామ నాగేశ్వరరావుపై 1.8 లక్షల ఓట్ల భారీ మెజార్టీతో గెలిచారు. ఆ సమయంలోనే కేంద్రమంత్రిగానూ కొనసాగారు. 2009 ఎన్నికల్లో నామ చేతిలోనే ఓడిపోయారు. 2014 ఎన్నికల్లో పొత్తులో భాగంగా సీపీఐకి ఖమ్మం పార్లమెంట్ సీటును కేటాయించడంతో ఆమె పోటీ చేయలేకపోయారు. 2018లో తిరిగి నామ చేతిలోనే ఓటమి పాలయ్యారు. రాజకీయంగా అనేక ఒడిదుడుకులు ఎదురైనా రేణుకాచౌదరి మాత్రం 'ఫైర్‌బ్రాండ్'గా తన ప్రత్యేకతను నిలుపుకుంటున్నారు.



రవిచంద్రకు మళ్లీ 'రాజ్య'యోగం

నేడు నామినేషన్ దాఖలు

నవతెలంగాణ - ఖమ్మం

బీఆర్ఎస్ రాజ్యసభ అభ్యర్థిగా వద్దిరాజు రవిచంద్రను పార్టీ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు ఖరారు చేశారు. ఈ మేరకు పార్టీ పెద్దలు, ముఖ్యులతో బుధవారం చర్చించి నిర్ణయం తీసుకున్నారు. అధినేత ఆదేశాలతో వద్దిరాజు రవిచంద్ర గురువారం రాజ్యసభ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేస్తారు. కాగా వద్దిరాజుకు వరుసగా రెండోసారి రాజ్యసభ అవకాశం కల్పించారు. మొదటి దఫాలో రవిచంద్ర రెండేళ్ల పాటు రాజ్యసభ సభ్యుడిగా కొనసాగారు. తెలంగాణ శాసనసభలో ఆ పార్టీకి ఉన్న బలం ప్రకారం ఒక రాజ్యసభ సీటు దక్కనుంది. క్రితం సారి 20 నెలలు మాత్రమే పదవిలో కొనసాగిన నేపథ్యంలో మరోమారు వద్దిరాజుకు అవకాశం కల్పించాలని పార్టీ పెద్దలు నిర్ణయిం చారు. పార్టీ తీసుకున్న నిర్ణయంపై వద్దిరాజు అభిమానులు హర్షం వెలిబుచ్చారు. ఫిబ్రవరి 27న రాజ్యసభ ఎన్నికలు జరగనున్నాయి. సంఖ్యాబలం దృష్ట్యా వద్దిరాజు ఎన్నిక లాంఛనమే. ఈ దఫా ఆయన ఆరేళ్లపాటు పదవిలో కొనసాగే అవకాశం ఉంది.

'మహాలక్ష్మి'లో పొరపాట్లకు తావు లేకుండా చూడాలి

కలెక్టర్ విపి.గౌతమ్

నవతెలంగాణ-ఖమ్మం



అర్హులైన లబ్ధిదారులకు మహాలక్ష్మి పథకంలో భాగంగా గ్యాస్ సిలిండర్ అందించేందుకు లబ్ధిదారుల దరఖాస్తుల సర్వే ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లు తావు లేకుండా చూడాలని సంబంధిత శాఖ అధికారులను జిల్లా కలెక్టర్ వి.పి. గౌతమ్ ఆదేశించారు. బుధవారం నూతన కలెక్టరేట్ సమావేశ మందిరంలో పంచాయతీ, పౌర సరఫరాల అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సర్వే ప్రక్రియను ఎలాంటి పొరపాట్లు లేకుండా డేటా ప్రకారం రేషన్ కార్డు, ఆధార్, గ్యాస్ ఏజెన్సీ, గ్యాస్ నెంబర్ నమోదు చేసి సరి చూడాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా పంచాయతీ అధికారి హరికిషన్, జిల్లా పౌర సరఫరాల అధికారి చందన కుమార్, మండల పంచాయతీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మాక్ పోలింగ్ ప్రక్రియ తనిఖీ చేసిన కలెక్టర్

నూతన కలెక్టరేట్ ఆవరణలోని ఇవిఎం గోడౌన్‌లో చేపడుతున్న మాక్ పోలింగ్ ప్రక్రియను జిల్లా కలెక్టర్ వి.పి. గౌతమ్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే పార్లమెంట్ ఎన్నికల నిర్వహణకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఇవిఎంల ఫస్ట్ లెవల్ చెకప్ పూర్తి చేసినట్లు ఆయన అన్నారు. ఫస్ట్ లెవల్ చెకప్ తదుపరి, ఇవిఎంల పనితీరు పరిశీలనకు మాక్ పోల్ నిర్వహించినట్లు తెలిపారు. మాక్ పోల్‌కు రాజకీయ పార్టీల ప్రతినిధులచే ర్యాండంగా 5 శాతం ఇవిఎం యంత్రాలను ఎంపిక చేసి, అందులో ఒక శాతం ఇవిఎం యంత్రాలను 1200 ఓట్ల చొప్పున, 2 శాతం ఇవిఎం యంత్రాలను 1000 ఓట్ల చొప్పున, మరో 2 శాతం యంత్రాలను 500 ఓట్ల చొప్పున మాక్ పోలింగ్ నిర్వహించినట్లు ఆయన అన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ డి.మధుసూదన్ నాయక్, కలెక్టరేట్ సూపరింటెండెంట్ మదన్ గోపాల్, ఎన్నికల సూపరింటెండెంట్ రాంబాబు, రాజకీయ పార్టీల ప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఓటు నమోదు గడువు మార్చి 14 వరకు పొడిగింపు

వరంగల్, ఖమ్మం, నల్గొండ జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానానికి ఓటరు జాబితాలో ఓటరుగా నమోదు చేసుకు నేందుకు మార్చి 14 వరకు గడువు ఉందని జిల్లా కలెక్టర్ విపి. గౌతమ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఓటరు దరఖాస్తు సమర్పించే సమయంలో ఫారం-18తో పాటు డిగ్రీ, డిప్లమా, గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్ జిరాక్స్ ప్రతులు గెజిటెడ్ అధికారులతో దవీకరించి దరఖాస్తు నమోదు చేయాలని, బల్క్ దరఖాస్తులు పోస్టు ద్వారా గాని ఒక వ్యక్తి గాని సమర్పిస్తే వాటిని ఆమోదించడం జరగదని, వివిధ సంస్థలు వాటిలో పని చేసే అర్హులైన స్టాఫ్ దరఖాస్తులు ఒకేసారి సమర్పించవచ్చని, ఒక కుటుంబానికి చెందిన దరఖాస్తుల సైతం ఒకరు సమర్పించవచ్చని తెలిపారు.



దేశవ్యాప్త గ్రామీణ బంద్‌ను జయప్రదం చేద్దాం

నవతెలంగాణ-సత్తుపల్లి

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈనెల 16న దేశవ్యాప్తంగా తలపెట్టిన గ్రామీణ బంద్‌ను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు కొలికపోగు సర్వేశ్వరరావు కోరారు. బుధవారం హమాలీ కార్మికులతో సర్వేశ్వరరావు సమావేశమయ్యారు. దేశవ్యాప్త సమ్మెలో హమాలీ కార్మికులు పాల్గొనాలన్నారు. ఈ సందర్భంగా సర్వేశ్వరరావు మాట్లాడుతూ హమాలీలకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలన్నారు. కార్మికుల పిల్లలకు స్కాలర్‌షిప్స్ ఇవ్వడం లేదన్నారు. కార్మిక చట్టాలను నిర్వీర్యం చేస్తున్నారన్నారు. పెరుగుతున్న నిత్యావసర ధరలను అదుపు చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలం చెందాయన్నారు. దేశంలో అన్ని రంగాల్లో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోరుతూ అన్ని కార్మిక సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన దేశవ్యాప్త గ్రామీణ బంద్ కార్యక్రమంలో కార్మిక, కర్షక, ఉద్యోగ వర్గాలు, ప్రజలు అత్యధిక సంఖ్యలో పాల్గొని ప్రభుత్వాల కళ్ళు తెరిపించాలని సర్వేశ్వరరావు కోరారు. ఈ కార్యక్రమంలో హమాలీ వర్కర్స్ యూనియన్ నాయకులు సైదా, వలీ, వెంకటేశ్వరరావు, బాజీ, రాము, రమేశ్, చంద్రం, నబీ, నరేశ్, కోటయ్య పాల్గొన్నారు.

కారేపల్లి : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ కార్మిక, కర్షక, రైతు వ్యతిరేక విధానాలతో గ్రామీణ భారతం దివాళా పరిస్థితికి వచ్చిందని అఖిల పక్షనాయకులు విమర్శించారు. బుధవారం కారేపల్లిలో భాగం రామనర్సయ్య భవన్‌లో సీపీఎం మండల కార్యదర్శి కే.నరేంద్ర, ప్రజాపంథా నాయకులు గుగులోత్ తేజ అధ్యక్షతన బీజేపీయేతర పార్టీల సమావేశంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు కొండెబోయిన నాగేశ్వరరావు, న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు వై.ప్రకాశ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు తలారి చంద్రప్రకాశ్, సీపీఐ మండల కార్యదర్శి బోళ్ల రామస్వామి, మాట్లాడారు. కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు వజ్జా రామారావు, ఎస్వీ రాకేష్, రావుల నాగేశ్వరరావు, పులకాని సత్తిరెడ్డి, తాటి రామారావు తదితరులు పాల్గొన్నారు.

ఖమ్మం : కార్మిక, రైతుల హక్కులను కాలరాస్తున్న మోడీ ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ ఈ నెల 16న జరిగే గ్రామీణ భారత బంద్ ను కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం సంపూర్ణ మద్దతు తెలియజేస్తుందని కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి నందిపాటి మనోహర్ ఒక ప్రకటనలో తెలిపారు.

కొణిజర్ల : మండల కేంద్రంలో అఖిలపక్షం ఆధ్వర్యంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ దిష్టిబొమ్మ దగ్ధం చేశారు. ఈ సందర్భంగా సీపీఐ కార్యాలయం ఎదుట ఏర్పాటు చేసిన అఖిలపక్షం సమావేశంలో వారు మాట్లాడుతూ రైతులపై మోడీ ప్రభుత్వం పెట్టిన అక్రమ కేసులను వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం ఖమ్మం జిల్లా అధ్యక్షుడు దొండపాటి రమేష్, జిల్లా ఉపాధ్యక్షుడు తమ్మిశెట్టి వెంకటేశ్వర్లు, సీపీఎం మండల కార్యదర్శి చెరుకుమల్లి కుటుంబరావు, రైతుకూలీసంఘం జిల్లా సహాయ కార్యదర్శి షేక్ ఖాసీం, పివైఎల్ జిల్లా సహాయ కార్యదర్శి పాశం అప్పారావు పాల్గొన్నారు.

బోనకల్ : ఈనెల16న దేశవ్యాప్త కార్మికుల సమ్మె, గ్రామీణ బంద్ ను జయప్రదం చేయాలని మండల కేంద్రంలో అఖిల పక్ష రాజకీయ, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు బుధవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు మండల కన్వీనర్ బోయినపల్లి వీరబాబు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గాలి దుర్గారావు టిడిపి మండల అధ్యక్షుడు రావుట్ల సత్యనారాయణలు మాట్లాడారు. కార్యక్రమంలో అఖిల పక్ష రాజకీయ రైతు వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు బంధం శ్రీనివాసరావు, గూడ నరసయ్య శాస్త్రి, మండేపూడి గోర్కి, గవీదు సైదులు, బూర్గుల అప్పారావు, ఉదారపు నాగేశ్వరావు, గారపాటి వెంకటేశ్వరరావు, ఆకెన పవన్ తదితరులు పాల్గొన్నారు.

తపాలా పోస్ట్ బాక్స్ సేవలు ప్రారంభం

నవతెలంగాణ- ఖమ్మం

తపాలాశాఖ సేవలు విస్తృతమయ్యాయని తపాలాశాఖ ఉమ్మడి ఖమ్మం జిల్లా సూపరింటెండెంట్ రవికుమార్ అన్నారు. బుధవారం ఖమ్మంలోని గొల్లగూడ రోడ్డులోని మమత మెడికల్ కాలేజీ సమీపంలోగల పులిపాటి నగర్2లో డాక్టర్ పులిపాటి ప్రసాద్ ఆధ్వర్యంలో తపాలశాఖ నూతన పోస్ట్ బాక్స్ సేవలను ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. గత 30 సంవత్సరాల క్రితం గూగుల్, ఈ-మెయిల్, కంప్యూటర్ యుగం ఉండేది కాదని, ఆ రోజుల్లో పోస్ట్ కార్డు ఉత్తరాలు, ఎంప్లాయిమెంట్ కార్డు కవర్లతో ప్రారంభమైన తపాలాశాఖ నేడు బ్యాంకింగ్ రంగంలో మరియు సేవింగ్స్‌లో కూడా బ్యాంకింగ్ సెక్టార్‌కు తీసిపోనీ విధంగా సేవలందిస్తూ వినియోదారుల మన్ననలు పొందుతూ వస్తున్న విషయం విదితమేనన్నారు. ఈప్రాంత వాసులకు పోస్టల్ సేవలు విస్తృత పరిచేందుకు సామాజిక సేవకులు, పౌర సమితి అధ్యక్షులు, మహాత్మాగాంధీ ఫౌండేషన్ చైర్మన్, డాక్టర్ పులిపాటి ప్రసాద్ ఆధ్వర్యంలో నూతన పోస్ట్ బాక్స్ సేవలు ప్రారంభించడం హర్షనీయమన్నారు. కార్యక్రమంలో వాసిరెడ్డి నాగేశ్వరరావు, గుమ్మడివల్లి శ్రీనివాస్, గోల్ల రాధాకృష్ణమూర్తి, సిద్ధంశెట్టి శ్రీకాంత్, కోదుమూరి భద్రయ్య, మాసేటి వర ప్రసాద్‌రావు, వెల్లంపల్లి వెంకటసుబ్బయ్య, వైఎస్.రామకృష్ణమూర్తి, వంశీ, శ్రీనివాస్, ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.

మోడీని మూడోసారి ప్రధానిని చేయడమే లక్ష్యం

డాక్టర్ గోంగూర వెంకటేశ్వర్లు

నవతెలంగాణ-ఖమ్మం

మోడీని మూడోసారి ప్రధానిని చేయడమే లక్ష్యమని బిజేపి నాయకులు, డాక్టర్ గోంగూర వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం ఖమ్మంలోని ప్రముఖ వైద్యులు గోంగూర వెంకటేశ్వర్లు మద్దతు దారులు, అభిమానులు, నూట యాభై మంది బుధవారం బీజేపీ పార్టీ జాతీయ నాయకులు పొంగులేటి సుధాకర్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. ఈ సందర్భంగా డాక్టర్ జీవీ మాట్లాడుతూ వచ్చే పార్లమెంట్ ఎన్నికలలో లక్ష మంది యువత నా సమక్షంలో మోడీని మూడోసారి ప్రధానిని చేయడమే లక్ష్యంమని, ఖమ్మం జిల్లాలో కాషాయ జెండా ఎగుర వేయడానికి సిద్ధంగా ఉన్నారని తెలిపారు. అనంతరం మూడో సారి మోడీ, ఖమ్మంలో డాక్టర్ జీవీతో జోడి అనే పోస్టర్‌ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో బీజేపీ పార్టీ జాతీయ నాయకులు పొంగులేటి సుధాకర్‌రెడ్డి, వరంగల్ మాజీ మేయర్ రాజేశ్వర్‌రావు, బిజెపి పార్టీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ, పార్లమెంటరీ నియోజకవర్గ కన్వీనర్ నంబూరి రామలింగేశ్వరరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దొంగల సత్యనారాయణ, సన్నే ఉదయ్ ప్రతాప్ పాల్గొన్నారు.

18న 'పొంగులేటి' ఇంట అంగరంగ వైభవంగా రిసెప్షన్ వేడుకలు

- భారీ సెట్టింగ్‌లు...ముమ్మురంగా ఏర్పాట్లు
- హాజరుకానున్న 2 లక్షల మంది జనం

నవతెలంగాణ-కల్లూరు



తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ శాఖ, సమాచార శాఖ, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సోదరుడు ప్రసాద్ రెడ్డి కుమారుడి వివాహం 14న బుధవారం దుబాయ్‌లో జరిగింది. నెల 18వ తేదీన కల్లూరులో రిసెప్షన్ వేడుకలు నిర్వహించాలని నిర్ణయించారు. దీనికి సంబంధించి మండల పరిధిలోని నారాయణపురం సమీపంలో తిరువూరు క్రాస్ రోడ్ వద్ద సుమారు 80 ఎకరాల్లో రిసెప్షన్ వేడుకలకు జరిపేందుకు గత 40 రోజుల నుండి ఎంకే వీవెంట్ (సినిమా సెట్టింగ్) వారి ఆధ్వర్యంలో పీఎస్ఆర్ ప్యాలస్ నారాయణపురం ప్రాంగణంగా నామకరణం చేసి ఏర్పాట్లు ప్రారంభించారు. 30 ఎకరాల్లో రిసెప్షన్ కోసం పిఆర్ఎస్ ప్యాలెస్ నిర్మాణం, సుమారు రెండు లక్షల మందికి భోజనం ఏర్పాట్లు, 50 ఎకరాల్లో వచ్చే వాహనాలకు పార్కింగ్ కోసం ఏర్పాట్లు చేశారు. కల్లూరులో ఇంత పెద్దఎత్తున భారీ సెట్టింగ్‌తో రిసెప్షన్ వేడుకలు ఏర్పాటు చేయటం ఇదే ప్రథమం. దీంతో రోడ్డుపై వెళ్లే ప్రతి ఒక్కరిని ఈ సెట్టింగ్ ఆకర్షిస్తుంది. నిర్మాణ ఏర్పాటు చేస్తుంటేనే చూడాలని కోరికతో ప్రజలు ఇప్పటి నుండే సందర్శించడం ప్రారంభించారు. సినిమాల్లో చేసిన విధంగా భారీగా కటౌట్‌లు ఏర్పాటు చేయడం విశేషం. ప్రాంగణంలోకి వచ్చేందుకు ప్రత్యేక ద్వారం ఏర్పాటు చేశారు. మధ్యలో పిఆర్ఎస్ రిసెప్షన్ వేడుకలు ఏర్పాటు, వెనుక దేవాలయం కటౌట్ ఏర్పాటు చేశారు. ప్యాలెస్‌కి రెండు వైపులా రాతి లాంటి గృహ ఏర్పాటు చేశారు. ప్యాలస్‌కి రెండు వైపులా భోజనాలకు 11 కౌంటర్లు ఏర్పాటు చేశారు. ఒక్కో కౌంటర్లో పదివేల మంది భోజనాలు చేసేందుకు ఏర్పాట్లు చేశారు. వివిఐపిల కోసం ప్యాలెస్ వెనకవైపున భోజన కౌంటర్లు ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. సింహద్వారం వెనక వాటర్ ఫౌంటెన్ ఏర్పాటు చేశారు. వధూవరులను ఆశీర్వదించేందుకు ప్రత్యేక మందిరం...వచ్చిన వారు ఎలాంటి ఇబ్బంది పడకుండా వధూవరులను ఆశీర్వదించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నారు. దాదాపు 80 శాతం ఏర్పాట్లు పూర్తికాగా మరో రెండు రోజుల్లో ఏర్పాట్లు పూర్తి చేయనున్నారు. మొత్తం మీద పొంగులేటి వారి వివాహ వేడుకలు కల్లూరు ప్రాంతంలో చిరస్థాయిగా గుర్తుండే విధంగా ఏర్పాట్లు చేయటం విశేషం. ట్రాఫిక్ నియంత్రించడం కోసం వచ్చే విఐపిలకు రక్షణ కల్పించడం కోసం 500 మంది పోలీసులను ఏర్పాటు చేశారు. వీరు కాకుండా ప్రైవేట్‌గా 150 మంది సెక్యూరిటీగార్డులను నియమించారు. వంటలు తయారు చేయడం కోసం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కృష్ణా జిల్లా చిట్యాల నుండి ఖమ్మం, కొత్తగూడెం జిల్లాలకు చెందిన వారిని వంటల చేయటం కోసం నియమించారు. గత 40 రోజుల నుండి దేవరపల్లి శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తుండగా పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి క్యాంప్ కార్యాలయం ఇన్చార్జి దయాకర్‌రెడ్డి పరిశీలిస్తూ తగు సూచనలు చేస్తున్నారు. ఇటీవలే రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఏర్పాట్లను పరిశీలించి పలు సూచనలు చేశారు.



వైరా ఎస్ఐగా వంశీ కృష్ణ భాగ్యరాజ్



నవతెలంగాణ-వైరా

రానున్న సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా రాష్ట్ర వ్యాపితంగా జరుగుతున్న అధికారుల బదిలీల్లో భాగంగా పోలీస్ అధికారుల బదిలీలు కొనసాగుతున్నవి. అందులో భాగంగా వైరా నూతన సబ్ ఇన్‌స్పెక్టర్‌గా ఖమ్మం రెండవ టౌన్ లో బాధ్యతలు నిర్వహించిన ఎ.వంశీ కృష్ణ భాగ్యరాజ్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. వైరాలో పని చేసిన ఎస్ఐ మేడా ప్రసాద్ వేకెన్సీ రిజర్వ్‌లో ఉంచినట్లు తెలిసింది. బాధ్యతలు చేపట్టిన వంశీ కృష్ణకు స్టేషన్ లో పోలీస్ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

కొణిజర్ల ఎంపీడీవోగా బాధ్యతలు చేపట్టిన రోజారాణి



నవతెలంగాణ-కొణిజర్ల

మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా ఏ.రోజారాణి మంగళవారం బాధ్యతలు చేపట్టారు. మహబూబాబాద్ జిల్లా నుంచి బదిలీ పై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ పనిచేసిన ఎంపిడివో మహాలక్ష్మి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అన్నపురెడ్డిపల్లి మండలానికి బదిలీ పై వెళ్లారు. ఈసందర్భంగా ఆమెకు మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మండల పరిషత్ సిబ్బంది ప్రజాప్రతినిధులు రాజకీయ పార్టీల నాయకుల సహకరంతో మండల అభివృద్ధికి కృషిచేస్తానన్నారు.

రెండు మోటారు సైకిళ్ళు ఢీ.. ఇద్దరికి తీవ్ర గాయాలు



నవతెలంగాణ -బోనకల్

మండల పరిధిలోని రావినూతల వైపు ఆర్ఓబి బ్రిడ్జి ముందు బుధవారం రెండు మోటార్ సైకిల్ ఢీకొన్న ప్రమాదంలో ఇరువురు తీవ్రంగా గాయపడ్డారు. ఇందులో చిన్న బీరవల్లి ఫీల్డ్ అసిస్టెంట్ కోటపర్తి సులేమాన్ ఉన్నారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మండల పరిధిలోని చిన్న బీరవల్లి ఫీల్డ్ అసిస్టెంట్ కోటపర్తి సులేమాన్ మండల పరిషత్తు కార్యాలయంలో విధులు నిర్వహించుకొని తన మోటార్ సైకిల్ పై చిన్న బీరవల్లి వెళ్తున్నాడు. అదే సమయంలో వైరా నుంచి రాజస్థాన్ కు చెందిన సెల్ పాయింట్ యజమాని కిషన్ తన మోటార్ సైకిల్ పై బోనకల్ వస్తున్నాడు. ఇద్దరూ రావినూతల వైపు గల ఆర్ఓబి బ్రిడ్జి సమీపంలో ఎదురెదురుగా అతివేగంగా వస్తూ ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో సులేమాన్, కిషన్ కు తీవ్ర గాయాలయ్యాయి. వీరిని 108 సిబ్బంది ఇరువురికి ప్రాథమిక చికిత్స చేశారు. మెరుగైన వైద్యం కోసం ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

మధిర పట్టణ, రూరల్ ఎస్సైలుగా నూతన బాధ్యతలు చేపట్టిన సంధ్య, భార్గవి



నవతెలంగాణ-మధిర

మధిర పట్టణ సబ్ ఇన్‌స్పెక్టర్‌గా సంధ్య రూరల్ సబ్ ఇన్స్పెక్టర్ లక్ష్మి భార్గవిలు బుధవారం నూతన బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా మధిర సర్కిల్ ఇన్స్పెక్టర్ జే. వసంత్ కుమార్ ను మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలతో మమేకమై పెండ్లి పోలీస్ విధానాన్ని అమలు చేస్తామని, చట్టం ఎవరికి చుట్టం కాదని, ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాలు పడితే కఠిన చర్యలు తప్పవని ఈ సందర్భంగా తెలిపారు.

బోనకల్ ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన 'మధుబాబు'



నవతెలంగాణ - బోనకల్

బోనకల్ నూతన ఎస్సైగా కడగండ్ల మధుబాబు బోనకల్ పోలీస్ స్టేషన్‌లో బుధవారం అధికార బాధ్యతలు స్వీకరించారు. ఎస్సై సాయి కుమార్ నుంచి నూతన ఎస్సై మధుబాబు అధికార బాధ్యతలను స్వీకరించారు. మహబూబాబాద్ సిసిఎస్ నుంచి బదిలీపై బోనకల్ ఎస్సైగా నియమితులయ్యారు. బోనకల్ ఎస్ఐ బొల్లెద్దు సాయికుమార్ ఖమ్మం విఆర్ కు బదిలీ అయ్యారు. అధికార బాధ్యతల స్వీకరించిన అనంతరం ఎస్సై మధుబాబు మాట్లాడుతూ శాంతిభద్రతల విషయంలో రాజీ పడేది లేదని స్పష్టం చేశారు. ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యం లేకుండా ఫిర్యాదుదారులకు న్యాయం జరిగే విధంగా వెంటనే చర్యలు చేపడతానని తెలిపారు. రాత్రి సమయంలో పెట్రోలింగ్ నిర్వహిస్తూ దొంగతనాలకు అడ్డుకట్టు వేస్తామన్నారు. అన్ని రాజకీయ పక్షాలు ప్రజలు శాంతిభద్రతలను కాపాడే విషయంలో సహకరించాలని ఆయన కోరారు. నూతన ఎస్ఐకి సాయి కుమార్ ఏఎస్ఐ దారెల్లి బాలస్వామి, హెడ్ కానిస్టేబుల్ అద్దంకి ఆనంద్ కుమార్ కానిస్టేబుల్ సత్యంబాబు, రమేష్, సైదా, శేఖర్ తదితరులు స్వాగతం పలికి అభినందనలు తెలిపారు.



రేణుక చౌదరి రాజ్యసభ సభ్యురాలిగా ఎంపిక పట్ల హర్షం

- టీపిసిసి కార్యదర్శి కట్ల రంగారావు ఆధ్వర్యంలో మిఠాయిలు పంపిణీ

నవతెలంగాణ-వైరాటౌన్

కేంద్ర మాజీ మంత్రివర్యులు రేణుక చౌదరిని రాజ్యసభ సభ్యురాలుగా కాంగ్రెస్ పార్టీ అధిష్టానం ఎంపిక చేయటం పట్ల టీపిసిసి కార్యదర్శి, టిపిసిసి క్యాంపెయిన్ కమిటీ కో కన్వీనర్ కట్ల రంగారావు హర్షం వ్యక్తం చేశారు. కట్ల రంగారావు ఆధ్వర్యంలో వైరా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కార్యకర్తలకు మిఠాయిలు పంపిణీ చేసి ఘనంగా సంబురాలు చేసుకున్నారు. గురువారం మధ్యాహ్నం ఒంటిగంటకు హైదరాబాదులో అసెంబ్లీ ప్రాంగణంలో రాజ్యసభ సభ్యురాలుగా నామినేషన్ వేస్తున్న సందర్భంగా వైరా నుండి భారీ స్థాయిలో కార్యకర్తలు బయలుదేరి వెళ్లాలని నిర్ణయించుకున్నారు. రేణుక చౌదరిని రాజ్యసభ సభ్యురాలుగా ఎంపిక చేసిన సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, మల్లికార్జున్ కర్గే, తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి తదితరులకు కార్యకర్తలు కృతజ్ఞతల తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కట్ల సంతోష్, కట్ల నాగరాజు, రేచర్ల పుల్లయ్య, నంద్రు నాగరాజు, గుత్తికొండ వీరబాబు, యామాల భాస్కర్, కంభంపాటి సత్యనారాయణ పాల్గొన్నారు.

చిన్నారులకు విటమిన్ ఏ ద్రావణం ఇప్పించాలి

నవతెలంగాణ-ఎర్రుపాలెం

చిన్నారులకు విటమిన్ 'ఏ' లోపం వలన పిల్లలకు రే చీకటి, అందత్వం వంటివి వచ్చే అవకాశం ఉన్నందున 9 నెలల నుండి 5 సంవత్సరాలలోపు వయసు గల పిల్లలందరికీ విటమిన్ ఏ ద్రావణం ఇప్పించాలని వైద్యురాలు శశి పూర్ణ తల్లిదండ్రులకు సూచించారు. బనిగండ్లపాడు గ్రామంలో గల అంగన్‌వాడి కేంద్రంలో బుధవారం విటమిన్ ఏ ద్రావణం పంపిణీ కార్యక్రమాన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యురాలు డాక్టర్ శశి పూర్ణ పరిశీలించారు. కార్యక్రమంలో సిహెచ్ఓ కాంతమ్మ, ఏఎన్ఎం భవాని, అంగన్‌వాడి టీచర్ మహాలక్ష్మి, ఆశా కార్యకర్తలు ధన లక్ష్మి, సుజాత, వెంకటనర్సమ్మ చిన్నారులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

ఢిల్లీ రైతాంగ పోరాటంపై మోడీ నిరంకుశ అణచివేతను ఖండించండి

సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ (ప్రజాపంథా) రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు

నవతెలంగాణ-వైరాటౌన్

హర్యానా, ఢిల్లీ రైతులు దేశ రైతుల కోసం, రైతాంగానికి మద్దతు ధర ప్రకటించాలని డిమాండ్ చేస్తూ, దేశ రాజధానిలో ధర్నా చేయడానికి వస్తున్న రైతాంగం పైన మోడీ ప్రభుత్వం భారీకేడ్లు, రబ్బరు తూటాలు, లాఠీ చార్జీలతో రైతాంగాన్ని హింసకు గురి చేయటాన్ని దేశ ప్రజలు నిరసించాలని సిపిఐ ఎంఎల్ ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు పిలుపునిచ్చారు. బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో పోటు రంగారావు మాట్లాడుతూ ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన తెలిపే హక్కును కూడా లేకుండా చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఆరుగాలం కష్టపడ్డ పంటలకు గిట్టుబాటు ధర అడగటం ఎలా నేరం అవుతుందని ప్రశ్నించారు. రైతులు పండించిన పంటలకు కనీస మద్దతు ధర ఇవ్వాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వానిది కాదా అన్నారు. రైతాంగాన్ని, కార్మికులను ఆదుకోవాల్సిన కేంద్రమే విస్మరించడం అన్యాయమని విమర్శించారు. అదాని, అంబానీ మీద ఉన్న ప్రేమ దేశానికి అన్నం పెడుతున్న రైతుల మీద ఎందుకు లేదని ప్రశ్నించారు. దేశంలో ప్రజలు, రైతులు, కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 16న అఖిల పక్షాల ఆధ్వర్యంలో జరగనున్న గ్రామీణ బంద్ ను జయప్రదం చేయాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి గోకినేపల్లి వెంకటేశ్వరరావు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు సివై పుల్లయ్య, కే అర్జున్ రావు, జి రామయ్య, ఆవుల అశోక్, రాయల రవికుమార్ పాల్గొన్నారు.

తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలి

- కలెక్టర్ వి.పి గౌతమ్



నవతెలంగాణ-ఖమ్మం

వేసవిలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని కలెక్టర్ విపి గౌతమ్ తెలిపారు. బుధవారం నూతన కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో మిషన్ భగీరథ, పంచాయతీ రాజ్, మునిసిపల్, నీటిపారుదల శాఖల అధికారులతో తాగునీటి సరఫరాపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాగునీటి సమస్యలు వచ్చే ప్రాంతాలను గుర్తించి, సమస్యల పరిష్కారానికి ముందస్తు చర్యలు తీసుకోవాలని అన్నారు. నాగార్జున సాగర్ పై సాగు, త్రాగునీటికి ఆధారపడి ఉన్నామని, నాగార్జున సాగర్ నుండి పాలేరుకు నీరు వస్తే సమస్యలు తీరుతాయని, ప్రస్తుతం కష్ణా బేసిన్ లో నీరు లేదని, నీటి సమస్య ఎదురయ్యే అవకాశం ఉందని ఆయన అన్నారు. నీటి కొరత దృష్టిలో పెట్టుకొని ఈసారి యాసంగికి క్రాప్ హాలిడే ప్రకటించినట్లు ఆయన తెలిపారు. నీటిపారుదల శాఖ అధికారులు నిత్యం ఆర్డబ్ల్యుఎస్, పంచాయతీరాజ్ అధికారులతో టచ్ లో ఉండాలన్నారు. లష్కర్ లను నీటి వనరుల వద్ద ఉంచాలన్నారు. రొటీన్ నిర్వహణ పంచాయతీల నుండి చేపట్టి, తాగునీటి సరఫరా లైన్లు లేనిచోట, ఇతర పెద్ద పనులకు ప్రతిపాదనలు సమర్పించాలన్నారు. మిషన్ భగీరథ కవర్ కానిచోట, పైప్ లైన్ వేయాలా, ఏ విధంగా సమస్య పరిష్కరించాలో ఆలోచన చేయాలన్నారు. నీటి సరఫరా కు సంబంధించి, చిన్న చిన్న మరమ్మత్తులు 15వ గ్రాంట్ కమీషన్ తో పూర్తి చేయాలని ఆయన అన్నారు. నీటి సరఫరా ఇబ్బందులు ఉన్నచోట ఓపెన్ వెల్, బోర్లు లీజుకు తీసుకునే చర్యలు తీసుకోవాలని అన్నారు. జిల్లాలో ప్రగతిలో ఉన్న నీటి ట్యాంకుల నిర్మాణం త్వరితగతిన పూర్తిచేసి, సమయానికి అందుబాటులో తెచ్చే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. నీటి ట్యాంకుల క్లోరినేషన్ ప్రక్రియ చేయాలన్నారు. తాగునీటి సమస్య తలెత్తకుండా అన్ని ముందస్తు చర్యలతో అధికారులు సిద్ధంగా ఉండాలని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. సత్యప్రసాద్, మిషన్ భగీరథ ఎస్ఇ సదాశివ కుమార్, పంచాయతీ రాజ్ ఎస్ఇ చంద్రమౌళి, జిల్లా పంచాయతీ అధికారి హరికిషన్, మునిసిపల్ కమిషనర్లు, ఎంపిడివో లు, ఎంపిఓ లు, నీటిపారుదల, త్రాగునీటి సరఫరా శాఖల ఇంజనీర్లు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఎరువులు పురుగు మందుల దుకాణాలను, వ్యవసాయ క్షేత్రాలను తనిఖీ చేసిన మయాంక్ సింగ్



నవతెలంగాణ-వైరా

జిల్లా వ్యసాయాధికారి ఎం.విజయ నిర్మల, అసిస్టెంట్ కలెక్టర్ మాయాంక్ సింగ్ ఐఎఎస్‌లు ఇతర వ్యవసాయాధికారులతో కలిసి మండల కేంద్రం, గొల్లపూడి, గరికపాడు, పూసల పాడు గ్రామాలలో ఎరువులు పురుగు మందుల దుకాణాలను బుధవారం తనిఖీ చేశారు. అంతే గాక మొక్క జొన్న,వరి వ్యవసాయ క్షేత్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ కలెక్టర్ మాట్లాడుతూ రైతులు యూరియా వాడకం తగ్గించాలని, దుకాణాలలో కొన్న ప్రతి సరుకుకు బిల్స్ తీసుకొని భద్రపరచుకోవాలన్నారు. గ్రామాలలో వ్యవసాయ క్షేత్రాలను పరిశీలించి మొక్క జొన్న,వరి, పామాయిల్ రైతులకు తగు సూచనలు చేశారు. జిల్లా వ్యవసాయాధికారి విజయనిర్మల వైరా లోని ఆగ్రో రైతు సేవా కేంద్రాన్ని, శ్రీ సత్యసాయి ఫర్టిలైజర్స్, పిఏసిఎస్ పూసల పాడు, శ్రీనివాసా ట్రేడర్స్ గొల్లపూడి, పిఏసిఎస్ గరికపాడు దుకాణాలలో ఫర్టిలైజర్ ఇన్వెంటరీ వెరిఫికేషన్ సిస్టం, అప్లికేషన్ ద్వారా స్టాక్ వివరాలను తనిఖీ చేసి వాటి వివరాలను ఆన్‌లైన్ లో పొందు పరిచారు. వారితో పాటు ఏడిఏ బాబురావు, మండల వ్యవసాయాధికారి ఎస్.పవన్ కుమార్, ఏఈఓలు, వ్యవసాయ క్షేత్రాల లో రైతులు పాల్గొన్నారు.

తలసీమియాను అరికట్టేందుకు కృషి చేద్దాం

- ఏఆర్ ఏసీపీ సుశీల్ సింగ్ చౌహాన్, ఐఎంఏ అధ్యక్షుడు కె.నారాయణరావు
- నగరంలో సంకల్ప ఆధ్వర్యంలో తలసీమియా వ్యాధిపై అవగాహన ర్యాలీ



నవతెలంగాణ-ఖమ్మం

సమాజంలో ప్రమాదకరంగా మారుతున్న జన్యుపరమైన వ్యాధి తలసేమియాను అరికట్టేందుకు కృషి చేద్దామని, ప్రజల్లో ఈ వ్యాధిపై అవగాహన కల్పించాలని ఏఆర్ ఏసీపీ సుశీల్ సింగ్ చౌహాన్, ఐఎంఏ అధ్యక్షుడు, డాక్టర్ కంభంపాటి నారాయణరావులు అన్నారు. సంకల్ప స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక పెవిలియన్ మైదానం నుండి మయూరిసెంటర్, వైరా రోడ్డు, జడ్పీసెంటర్ మీదుగా జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి(మెడికల్ కళాశాల) వరకు తలసీమియా వ్యాధిపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని ఏఆర్ ఏసీపీ సుశీల్ సింగ్ చౌహాన్, ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ కంభంపాటి నారాయణరావులు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అనేక సంవత్సరాలుగా జిల్లాలో తలసీమియా చిన్నారుల కోసం సంకల్ప స్వచ్ఛంద సేవా సంస్థ చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు. సంస్థతో పాటు దాతలు అందిస్తున్న సహకారాన్ని కొనియాడారు. వైద్యులు తలసేమియా చిన్నారులకు అండగా నిలుస్తున్నారన్నారు. ఆసుపత్రి సూపరింటెడెంట్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ చిన్నారుల కోసం రక్తం దానం చేస్తున్న దాతలను ఆయన అభినందించారు. చిన్నారులకు, సంస్థకు అండగా ఉండి వ్యాధి పట్ల ప్రజల్లో అవగాహన కల్పించేందుకు కృషి చేస్తామని అన్నారు. తలసీమియా అవగాహన ర్యాలీలో చిన్నారులు, వారి తల్లిదండ్రులు, ఎంజిల్స్ కళాశాల, పులిపాటి నర్సింగ్ కళాశాల విద్యార్థులు పాల్గొని తలసీమియా రహిత సమాజం నిర్మించాలని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో హెూంగార్డ్ ఆర్ఐ ఎం.సురేష్, ఆరోగ్యశ్రీ జిల్లా కోఆర్డినేటర్ రావూరి మాధవరావు, డీఎం శ్రీనివాస్, వైద్యులు డి.నారాయణమూర్తి, డాక్టర్ జితేందర్, డాక్టర్ లక్ష్మీదీప, చైల్డ్‌లైన్ కోఆరిడనేటర్ శ్రీనివాస్, విఆర్ విత్ యూ ఫౌండేషన్ బాధ్యులు బోస్‌యాదవ్, అనురాధ, సంకల్ప స్వచ్ఛంద సేవా సంస్థ ఉపాధ్యక్షురాలు పి.పావని, కోశాధికారి పి.రవి, పాల్గొన్నారు.

సంచార ముస్లింలకు గుర్తింపు ఏది...!!

సంచార ముస్లిం తెగల సంఘం వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షులు సైదా ఖాన్

నవతెలంగాణ - ఖమ్మం కార్పొరేషన్

కార్పొరేషన్‌లో ప్రత్యేక బడ్జెట్ ద్వారా మా సంచార ముస్లింలకు న్యాయం జరుగుతుందని అనుకున్నాము.. కానీ ఇక్కడ మాత్రం మైనార్టీ కార్పొరేషన్‌లో ముస్లింలు అని బిసి కార్పొరేషన్ లో వెనుకబడ్డ ముస్లింలు అని చెబుతున్నారు.. కార్పొరేషన్‌కి వెళ్తే మీరు బీసీ ఈ లో ఉన్న ముస్లింలు అని అంటున్నారు. బీసీ కార్పొరేషన్ వద్దకు వెళ్తే మీరు మైనార్టీలుగా మైనార్టీ కార్పొరేషన్ వద్దకు వెళ్ళండి అని అంటున్నారని తెలంగాణ సంచార ముస్లిం తెగల సంఘం వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షులు సైదా ఖాన్ అన్నారు. సామాజికంగా ఆర్థికంగా విద్య ఉపాధికి అభివృద్ధికి నోచుకోలేని వెనుకబడ్డ ముస్లిం కులాలకు ఏ నాయకులు కన్నెత్తి చూసిన పాపాన పోలేదన్నారు. ఎన్నో కులాలు అభివృద్ధి వైపు దూసుకుపోతుంటే సంచార జీవనం చేసే ముస్లిం కులాలు మాత్రం అట్టడుగులో మగ్గిపోతున్నారన్నారు. వీరి అభివృద్ధి రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలపై లేదా..? తెలంగాణ టిఆర్ఎస్ ప్రభుత్వం ఉన్నప్పుడు మంత్రులని ఎమ్మెల్యేని అధికారులని కలిసి మా గోడు విన్నపించుకున్న కానీ ఏ..మాత్రం పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. రాబోయే మా తరాల భవిష్యత్ అభివృద్ధికి మాకు ప్రత్యేక కార్పొరేషన్ ప్రత్యేక బడ్జెట్ ఆత్మగౌరవ భవనం కేటాయించాలని కోరారు.

గంజాయి మత్తులో యువకుల హల్‌చల్

వెంటపడ్డ స్థానికులు....

పారిపోయిన మందుబాబులు



నవతెలంగాణ - బోనకల్

మద్యం మత్తులో ఓ ముగ్గురు గుర్తుతెలియని యువకులు బుధవారం ఆళ్ళపాడు గ్రామంలో ఓ అర్ధగంట పాటు ఆటోను ఇష్టానుసారంగా నడుపుతూ హల్‌చల్ సృష్టించారు. దీంతో గ్రామస్తులు భయభ్రాంతులకు గురయ్యారు. ఆటోలో డ్రైవర్‌తో పాటు మరో ఇద్దరు యువకులు మద్యం మత్తులో ఆటో నడుపుతూ ఆటోకి ఇరువైపుల ఒక్కొక్కరు నిలబడి కేకల వేస్తూ ఆటోని ప్రమాదకరంగా నడిపారు. రోడ్డుమీద అటు ఇటు ఆటోను తిప్పుతూ కేకలు వేస్తూ గ్రామస్తులను భయభ్రాంతులకు గురి చేశారు. ఆటోను నిలువరించటానికి వెళ్ళిన స్థానికులపై కేకలు వేస్తూ వారిని ఢీకొనే విధంగా ఆటోను తీసుకెళ్తూ మరల అటు ఇటు తిప్పుతూ ఓ అర్ధగంట పాటు బీభత్సం సృష్టించారు. అదే సమయంలో ఆలపాడు వెళుతున్న ఓ రాజకీయ పార్టీ నాయకుల వాహనానికి అడ్డుగా పెట్టి వారి పట్ల దురుసుగా ప్రవర్తించారు. ఈ సమయంలో స్థానికులు వారిని పట్టుకునేందుకు ప్రయత్నించగా వారిపై దురుసుగా ప్రవర్తిస్తూ వారిపై దాడి చేసేందుకు ప్రయత్నాలు చేశారు. దీంతో స్థానికులు భయంతో వారి దగ్గరకు వెళ్లకుండా నిమ్మకుండిపోయారు. స్థానికులు ఎక్కువమంది రావటంతో గమనించిన మందుబాబులు ఆటోలు అక్కడ నుంచి అతివేగంగా రాయన్నపేట వైపు పారిపోయారు. స్థానికులు మాత్రం ఆ యువకులు గంజాయి సేవించినట్లు తెలిపారు. గంజాయి మత్తులోనే వీరంగం వేశారని స్థానికులు తెలిపారు. ఇటువంటి వారి పట్ల స్థానికులు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు కోరుతున్నారు.



శ్రీచైతన్యతో ఫ్రాన్స్ అయివాన్‌సిటీ యూనివర్సిటీతో అవగాహన ఒప్పందం

నవతెలంగాణ-ఖమ్మం కార్పొరేషన్

స్థానిక శ్రీచైతన్య ఇంజనీరింగ్ కళాశాలలో ఫ్రాన్స్ దేశానికి చెందిన అయివాన్ సిటీ యూనివర్సిటీతో " కెరియర్ అపర్చునిటీ" ఫ్యాకల్టీ ఎక్స్ఛేంజ్ పై అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నామని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి.జ్ఞాన ప్రకాష్ తెలిపారు. ఈ అవగాహన ఒప్పందంతో విద్యార్థులకు ఫ్రాన్స్ దేశంలో ఉద్యోగాలు కలుగుతాయని, అయివాన్ సిటీ అధ్యాపకులు ఇక్కడ బోధిస్తారని చెప్పారు. కళాశాల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సాయిగీతిక మాట్లాడుతూ.. ఈ అవగాహన ఒప్పందతో విద్యార్థులకు చివర సంవత్సరంలోనే ఫ్రాన్స్ దేశంలో ఉద్యోగ అవకాశాలతో పాటు పరిశోధన ఉన్నత విద్య చదివే అవకాశం, అధ్యాపకులు మా విద్యార్థులకు బోధించే అంశాలపై అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నామని చెప్పారు. కళాశాల చైర్మెన్ మల్లెంపాటి శ్రీదర్ మాట్లాడుతూ.. శ్రీచైతన్య విద్యార్థులకు నాణ్యమైన విద్య, ఉద్యోగ అవకాశాలు కల్పించడమే మా ధ్యేయం అన్నారు. కళాశాల డైరెక్టర్ శ్రీవిద్య మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఎస్ఐ వెంకటేష్ బాధ్యతల స్వీకరణ

నవతెలంగాణ-ఎర్రుపాలెం

తెలంగాణ రాష్ట్ర స్థాయి పోలీస్ శాఖ బదిలీలలో భాగంగా ఖమ్మంరూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న పరిశిక వెంకటేష్‌ను ఎర్రుపాలెం ఎస్సైగా ఉన్నత అధికారులు నియమించారు. బుధవారం ఎర్రుపాలెం ఎస్సైగా పదవి బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం ఎర్రుపాలెం ఎస్సైగా పని చేస్తున్న మాలోతు సురేష్‌ని ఖమ్మం విఆర్‌కు బదిలీ చేశారు.

ముగిసిన రవాణా వారోత్సవాలు : డీటీవో



నవతెలంగాణ-ఖమ్మం

జిల్లాలో వివిధ రూపాల్లో నెలరోజుల పాటు ప్రజలకు ప్రయాణికులకు, హెల్మెట్ల గురించి, సీటు బెల్టు, ఓవర్ స్పీడ్, ఓవర్లోడుల గురించి జీపు ద్వారా అవగాహన కల్పించి బుధవారం ముగింపు సందర్భంగా ఖమ్మంలోని జిల్లా ప్రధాన కార్యాలయంలో సమావేశం నిర్వహించారు.కార్యక్రమంలో మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ అచ్చుంట వరప్రసాద్, సీనియర్ ఏవోలు జాహిద్ అలీ, సుధాకర్, సీనియర్ అసిస్టెంట్, సంతోష్, రత్నరాజు, నదీమ్, రవీందర్ రెడ్డి, కానిస్టేబుల్ సరిత, హెూంగార్డులు పాల్గొన్నారు.

జాఫర్ బావి అభివృద్ధి పనుల పరిశీలన

నవ తెలంగాణ - ఖమ్మం కార్పొరేషన్

ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని స్థానిక 38వ డివిజన్ ఖిల్లా ప్రాంతంలోని జాఫర్ బావి అభివృద్ధి పనులను బుధవారం మున్సిపల్ కమిషనర్ ఆదర్శ్ సురభి పరిశీలించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ ఆదర్శ్ సురభి మాట్లాడుతూ..ఎంతో పురాతనమైన ఈ బావి కాకతీయుల హయాంలో ఈ నిర్మాణం జరిగినప్పటికీ కాలక్రమమైన భూగర్భంలో కలిసిపోవడం జరిగిందన్నారు. ఇలాంటి అద్భుతమైన జాఫర్ బావి ని మెట్ల బావిగా నిర్మాణమును బయటికి తీసి భావితరాలకు మన ఖమ్మం చరిత్ర తెలియాలని, ఖమ్మం నగర ప్రజలందరికీ ఇది ఒక పర్యటక ప్రాంతంగా చేయాలనే ఉద్దేశంతో దీన్ని అభివృద్ధి చేయడం జరుగుతుందని, త్వరలోనే ఖమ్మం ప్రజలకు అందుబాటులో తీసుకొస్తామని అన్నారు. అనంతరం అధికారులతో మిగిలినటువంటి పనులను కూడా త్వర త్వరగా పూర్తిచేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఈఈ కృష్ణాలాల్, ఏఈ నవ్య జ్యోతి, ఎస్ఈ రంజిత్, శోభన్ బాబు, కాంట్రాక్టర్ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

కల్లూరు డిటిగా మురళీధర్‌రావు బాధ్యతల స్వీకరణ



నవతెలంగాణ-కల్లూరు

స్థానిక తహసిల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహశీల్దార్‌గా మురళీధర్ రావు బుధవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ డీటీగా పనిచేసిన జంగా బాబ్జి ప్రసాద్ బదిలీ కావడంతో ఆయన స్థానంలో మురళీధర్‌రావు వచ్చారు.

విద్యలో అభివృద్ధిని సాధించి ఉన్నత శిఖరాలకు ఎదగాలి



నవతెలంగాణ-ముదిగొండ

విద్యలో విద్యార్థిని, విద్యార్థులు అభివృద్ధి సాధించి ఉన్నత శిఖరాలకు ఎదగాలని జిసిడిఓ భూలక్ష్మి అన్నారు.మండల పరిధిలో న్యూలక్ష్మీపురం కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం, ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం విద్యార్థిని,విద్యార్థుల వీడ్కోలు సభ బుధవారం జరిగింది.ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ అన్ని రంగాల్లో విద్యార్థులు రాణించాలని కోరారు.ఎంఈఓ బివి రామాచారి మాట్లాడుతూ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించి పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో కెజిబివి ఎస్ఓ బండారు ఇందిరా, ఎంపిటిసి సభ్యురాలు నానబాల మాధవి,గ్రామ మాజి సర్పంచ్ వాగదాని కన్నయ్య,ప్రాథమిక పాఠశాల హెచ్ఎం సాంబశివరావు,పాఠశాల కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

భక్త రామదాసు చరిత్రను భావితరాలకు చాటి చెప్పాలి

బిజెపి జాతీయ నాయకుడు పొంగులేటి సుధాకర్ రెడ్డి

నవతెలంగాణ- నేలకొండపల్లి

శ్రీరాముని అపరభక్త గ్రేసురుడు ప్రముఖ వాగ్గేయకారుడు భక్త రామదాసు చరిత్రను భావితరాలకు చాటి చెప్పాలని బిజెపి జాతీయ నాయకులు ఖమ్మం పార్లమెంటు నియోజకవర్గ ఇంచార్జ్ పొంగులేటి సుధాకర్‌రెడ్డి అన్నారు. నేలకొండపల్లి మండల కేంద్రంలోని భక్త రామదాసు ధ్యాన మందిరంలో మూడు రోజులపాటు జరుగుతున్న భక్త రామదాసు జయంతి ఉత్సవాలలో భాగంగా బుధవారం ముగింపు రోజు ఆయన ధ్యాన మందిరాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా మందిరంలో శ్రీ సీతారామ చంద్ర స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్త రామదాసు చరిత్ర గురించి అక్కడి అర్చకులు సామూహితీ రమేష్ ను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి నున్న రవికుమార్, ఎస్కే షర్ఫుద్దీన్ సయ్యద్ మోహినుద్దీన్, జిల్లా మహిళా నాయకురాలు దొడ్డ అరుణ నాగలక్ష్మి తదితరులు ఉన్నారు.

కారేపల్లి మండల ఎంపీడీవోగా సురేందర్



నవతెలంగాణ-కారేపల్లి

కారేపల్లి మండల ఎంపీడీవోగా జీ.సురేందర్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన కు ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది స్వాగతం ఫలికారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో జరిగిన బదిలీలలో భూపాలపల్లి జిల్లా రేగొండ మండల ఎంపీడీవోగా పని చేస్తున్న జీ.సురేందర్ కారేపల్లికి వచ్చారు. కారేపల్లి లో పనిచేసిన ఎంపీడీవో ఎం.చంద్రశేఖర్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలానికి బదిలీపై వెళ్లారు. కారేపల్లి ఎంపీడీవోగా బాధ్యతలు చేపట్టిన జీ.సురేందర్ విలేకరులతో మాట్లాడుతూ అందరి సహకారంతో ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి పనులు అమలు చేస్తానన్నారు.

ప్రజల భాగస్వామ్యంతో శాంతి భద్రతలు పరిరక్షణ

నవతెలంగాణ-అశ్వారావుపేట



శాంతిభద్రతలను ప్రజల భాగస్వామ్యంతో పరిరక్షిస్తా మని ఎస్‌హెచ్‌ఓ ఎస్సై ఎస్.శ్రీను అన్నారు. స్థానిక పోలీస్ స్టేషన్లో బుధవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. మణుగూరు నుండి బదిలీపై వచ్చిన ఆయన అనంతరం విలేకరులతో మాట్లాడుతూ నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి పెడతానని, చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడే వ్యక్తులను ఉపేక్షించేది లేదని, అసాంఘీక కార్యక్రమాలకు పాల్పడే వ్యక్తుల సమాచారం అందించాలని కోరారు. 2014 బ్యాచ్‌కు చెందిన ఈయన భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో అన్నపురెడ్డిపల్లి, కొత్తగూడెం త్రీ టౌన్, బోడ్, చుంచుపల్లి, మణుగూరుల్లో ఎస్ఐ విధులు నిర్వహించి అశ్వారావుపేట వచ్చారు. ఈ సందర్భంగా ఆయనకు ఎస్ఐ శివరామ్ క్రిష్ణ, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

నవతెలంగాణ-పినపాక



పినపాక మండలం గోపాలరావుపేట గ్రామం వద్ద బుధవారం రోడ్డు ప్రమాదం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం బుధవారం సాయంత్రం గోపాలరావు పేట గ్రామం వద్ద ద్విచక్ర వాహనం టాటా మ్యాజిక్ ఢీకొన్నాయి. తూర్పాక గ్రామం నుండి మేడారం వెళుతున్న మ్యాజిక్, కరకగూడెం నుండి మణుగూరు వెళుతున్న ద్విచక్ర వాహనం ఢీకొనడంతో ద్విచక్ర వాహనంపై వస్తున్న ఇద్దరు యువకులకు, మ్యాజిక్‌లో ఒక బాబుకు ముగ్గురుకు గాయాలు అయ్యాయి. ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న టాటా మ్యాజిక్ పక్కనే ఉన్న ఇంటిని సైతం ఢీకొన్నది. ఇంటి ముందు ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. వెంటనే గమనించిన స్థానికులు గాయపడిన వారిని 108 సహాయంతో పినపాక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం మణుగూరు 100 పడకల ఆసుపత్రికి తరలించారు. అనంతరం పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సంఘటన స్థలానికి పోలీసులు చేరుకొని ప్రమాదంపై విచారణ చేపట్టారు. రోడ్డు కొలతలో కంచెలు నిర్మించడం వల్ల ఈ ప్రమాదం జరిగినట్లుగా పలువురు మాట్లాడుకుంటున్నారు. స్థానిక ఎంపీఓ చొరవ తీసుకొని సమస్యను పరిష్కరించాలని పలువురు కోరుకుంటున్నారు. ఈ బయ్యారం క్రాస్ రోడ్ లో ప్రతి సంవత్సరం ప్రమాదాలు జరిగేవని ఎంపీఓ చొరవతో అక్కడ సైతం చాలా వరకు ప్రమాదాలు తగ్గాయని గోపాలరావుపేట గ్రామస్తులు మాట్లాడుకుంటున్నారు.

బస్సును ఢీ కొట్టిన కారు దగ్ధం

నవతెలంగాణ-ఇల్లందు



మండలంలోని నిజాంపేట గ్రామ పరిధిలో ఇల్లందు-మహబూబాబాద్ రహదారిపై ఆర్టీసీ బస్సు వెనుక భాగాన్ని కారు ఢీ కొట్టినట్లు తెలిసింది. ఆకస్మాత్తుగా కారులో నుండి మంటలు భారీగా ఎగిసిపడ్డాయి. అప్రమత్తమైన స్థానికులు డ్రైవర్‌ను సురక్షితంగా బయటకు తీశారు. డ్రైవర్ సెల్ సైతం కార్‌లోనే దగ్ధమైనట్లు తెలిసింది. ఆర్టీసీ బస్సు వెనుక భాగంలో డ్యామేజ్ అయినట్టు తెలిసింది. ఫైర్ ఇంజన్ వచ్చేసరికి కారు ఖాలిపోయి బూడిద అయిపోయింది. పోలీసు ఫైర్ అధికారులు సంఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. డ్రైవర్ పరారైనట్లు సమాచారం. సిఐ కరుణాకర్ మాట్లాడుతూ కార్ డ్రైవర్ కుర్ర రాంబాబు ముకుందాపురానికి చెందినట్లుగా తాగిన మైకంలో కారు నడుపుతున్నట్లు తెలిసిందన్నారు. విచారణ చేస్తున్నామని అదుపులోకి తీసుకొని వివరాలు రాబడతామన్నారు.

సమ్మెకు దూరంగా ఉండండి

- సింగరేణి సంస్థ ఛైర్మెన్, ఎండీ ఎన్.బలరామ్ విజ్ఞప్తి

నవతెలంగాణ-ఇల్లందు



కొన్ని కార్మిక సంఘాలు వివిధ డిమాండ్లతో ఈనెల 16వ తేదీన దేశ వ్యాప్తంగా ఒకరోజు సార్వత్రిక సమ్మెకు పిలుపునిచ్చాయని, ఈ సమ్మె డిమాండ్లలో అత్యధికం సింగరేణి కార్మికులకు సంబంధించినవి కావుఅని, అటువంటప్పుడు మన కార్మికులు ఈ సమ్మెలో పాల్గొనవలసిన అవసరం లేదని సంస్థ ఛైర్మెన్, ఎండీ ఎన్.బలరామ్ బుధవారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. సింగరేణి యజమాన్యం తీర్చగలిగినవి కూడా కావు అని, మన సింగరేణి సంస్థ పరిధిలోని సమస్యలు చర్చల ద్వారా పరిష్కరించుకునే అవకాశం ఉందని, ఒకసారి ఆలోచించాలని తెలిపారు. ఇప్పటికే వివిధ కారణాల వలన ఈ ఆర్థిక సంవత్సరం లో నిర్దేశించిన బొగ్గు ఉత్పత్తి, ఓవర్ బర్డెన్ తొలగింపు లలో కొంత వెనకబడి ఉన్నామని, ఈ సమయంలో లక్ష్యసాధనకు ప్రతిరోజు సాధించే ఉత్పత్తికూడా ఎంతో తోడ్పాటునందిస్తుందని అదే విధముగా నిరంతరాయముగా విద్యుత్ సరఫరా జరగడానికి మనం నిర్దేశించిన ఉత్పత్తి సాధిస్తూ సహకరించాల్సిన అవసరం ఎంతైనా ఉందని పేర్కొన్నారు. మనం ఒక్కరోజు సమ్మె చేస్తే సంస్థ నష్ట పోయే ఉత్పత్తి విలువ సుమారు రూ.85 కోట్లు ఉంటుందని, అలాగే కార్మికులు సుమారు రూ.18 కోట్ల వేతనాలు కోల్పోతారని తెలిపారు.

తహశీల్దార్, ఎంపీడీవోల బాధ్యతల స్వీకరణ

నవతెలంగాణ -బూర్గంపాడు





బూర్గంపాడు మండలంలో అధికారులు నూతనంగా పదవీబాధ్యతలను బుధవారం చేపట్టారు. తహశీల్దార్ ఇక్కడ పనిచేసిన తిరుమలాచారి కలెక్టరేట్లో సూపరింటెండెంట్‌గా బదిలీ కావడంతో ఆయన స్థానంలో ముజాహిద్ నూతనంగా బాధ్యతలు చేపట్టారు. ఆయన దమ్మపేట తహశీల్దార్‌గా పనిచేస్తూ ఇక్కడకు వచ్చారు. అదేవిధంగా మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవోగా ఇక్కడ పనిచేసిన నంబూరి వివేక్ రామ్ మహబూబాబాద్ లోని దంతెలబోరుకు బదిలీ అయ్యారు.ఈమేరకు ఆయన స్థానంలో నేలకొండపల్లి ఎంపీడీవోగా పనిచేస్తున్న జమలా రెడ్డి ఇక్కడకు వచ్చి నూతన బాధ్యతలు స్వీకరిం చారు. ఈ సందర్భంగా ఆయా కార్యాలయాల ఉద్యోగులు, సిబ్బంది నూతన తహశీల్దార్, ఎంపీ డీవోలకు పుష్పగుచ్చాలు ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు.

నేడు జూలూరుపాడులో ఎమ్మెల్యే పర్యటన

నవతెలంగాణ-జూలూరుపాడు

వైరా నియోజకవర్గ శాసనసభ్యులు మాలోత్ రాందాస్ నాయక్ గురువారం జూలూరుపాడు మండలంలో పర్యటించనున్నట్లు జిల్లా కాంగ్రెస్ నాయకులు, ఫ్యాక్స్ ఛైర్మెన్ లేళ్ల వెంకట్‌రెడ్డి, జూలూరుపాడు మండల కాంగ్రెస్ అధ్యక్షులు మాలోత్ మంగీలాల్ నాయక్‌లు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం పడమటి నర్సాపురం గ్రామపంచాయతీలో వేంచేసి ఉన్న శ్రీ సమ్మక్క సారక్క జాతర కార్యక్రమంలో పాల్గొని దర్శనం అనంతరం 10-30 గంటలకు ఉదయం పడమటి నర్సాపురం గ్రామపంచాయతీ లో శ్రీ శ్రీ సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ 285 జయంతి ఉత్సవాల కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం సభ కార్యక్రమంలో పాల్గొని ప్రసంగిస్తారని, కావున మండలంలో ఉన్న ప్రజాప్రతినిధులు, ఎంపీటీసీలు, సర్పంచులు, మాజీ ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తలు, అనుబంధ సంఘాల అధ్యక్షులు, నాయకులు, అభిమానులు పాల్గొనాలని వారు కోరారు.

యువత మత్తుకి బానిస కావద్దు

- తహశీల్దార్ స్వర్ణ

నవతెలంగాణ-అశ్వాపురం



యువత మత్తు, గంజాయి లాంటి వాటికి బానిసలు కావద్దని సమాజానికి ఆదర్శంగా నిలవాలని తహశీల్దార్ స్వర్ణ అన్నారు. తెలంగాణ ప్రభుత్వం నిర్వహిస్తున్నపారిశుధ్య స్పెషల్ డ్రైవ్ కార్యక్రమం లో భాగం బుధవారం మొండికుంట క్రీడా ప్రాంగణంలో యువకులకు వాలీబాల్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసంతో పాటు స్నేహ సంబంధాలను పెంపొందిస్తాయన్నారు. ఈ కార్యక్రమం లో స్థానిక ఎంపీటీసీ కమటం నరేష్, మల్లెలమడుగు ఎంపిటిసి బేతం రామకృష్ణ, సెక్రటరీ ప్రవీణ్ క్రీడా అభిమానులు పాల్గొన్నారు.

మండల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తా

-నూతన ఎంపీడీఓగా రామకృష్ణ బాధ్యతలు స్వీకరణ

నవతెలంగాణ-పినపాక



మండల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని నూతన ఎంపీడీఓ రామకృష్ణ అన్నారు. పినపాక మండల అభివృద్ధి అధికారిగా బుధవారం రాఘవరపు రామకృష్ణ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎంపీవో వెంకటేశ్వరరావు, ఏపీఓ వీరభద్రస్వామి, మండలంలోని వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్చాన్ని అందజేసి ఘన స్వాగతం పలికారు. ముందుగా ఎంపీడీఓ, ఎంపీపీ గుమ్మడి గాంధీని కలిశారు. అనంతరం ఎంపీడీవో మాట్లాడుతూ మండల ప్రజలకు శక్తి వంచన లేకుండా తన సేవలు అందచేస్తానని తెలిపారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ సీనియర్ నాయకులు గంగిరెడ్డి వెంకటరెడ్డి, సొసైటీ డైరెక్టర్ కొండేరు రాము, మండల సెక్రటరీలు, తదితరులు కలిసి ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు.

కమల దళంపై కార్మిక, కర్షక పోరు

- కార్మిక రైతాంగ హక్కుల కోసం 16న సార్వత్రిక సమ్మె, గ్రామీణ బంధు
- కార్మిక, కర్షకులకు అండగా కదలి వస్తున్న రాజకీయ పక్షాలు

నవతెలంగాణ-భద్రాచలం రూరల్



కనీస వేతన చట్టాన్ని కాలరాస్తూ ఎనిమిది గంటల పని విధానాన్ని రద్దు చేస్తూ కార్మిక హక్కులను ఖూనీ చేస్తూ మరోపక్క నల్ల చట్టాలను దొడ్డి దారిన తీసుకువస్తూ రైతు వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ ప్రజల మధ్య మతాల చిచ్చు చిచ్చు రేపుతూ పాలన సాగిస్తున్న నిరంకుశ కమల దళంపై కార్మిక కర్షకులు పోరు బాట పట్టాయి. కార్మికులు, రైతులు ఐక్యంగా కదిలి రేపు సార్వత్రిక సమ్మె గ్రామీణ బంధుకి పిలుపునిచ్చిన నేపథ్యంలో నిరంకుశ కమల దళంపై పోరు సాగిస్తున్న కార్మిక కర్షకులకు అండగా వివిధ రాజకీయ పక్షాలు మేము సైతం అంటూ భారత్ బంద్ పిలుపుతో సంఘీభావంగా నిలబడుతున్నాయి. ఇప్పటికే సిఐటియు, ఏఐటీయూసీ తో కలుపుకొని అన్ని కార్మిక సంఘాలు ఒక తాటిపైకి వచ్చి కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా తలపెట్టిన సార్వత్రిక సమ్మె విజయవంతానికి అన్ని రంగాల కార్మికులను ఐక్యం చేయడంలో విజయం సాధించాయి. సంఘటిత అసంఘటిత కార్మికులతో పాటు అన్ని రంగాల శ్రామికులు, శ్రమజీవులు నరేంద్ర మోడీ తీసుకొస్తున్న కార్మిక కోడ్‌లను వ్యతిరేకిస్తూ ఐక్యంగా సార్వత్రిక సమ్మెకు సిద్ధమైనవి. గత 20 రోజుల నుండి సార్వత్రిక సమ్మె సందర్భంగా కార్మికులు పనిచేసే ప్రధాన కూడలి వద్ద సభలు సమావేశాలు నిర్వహిస్తూ మోడీ సర్కార్ అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను వివరిస్తూ కోడ్‌ల వల్ల జరిగే నష్టాన్ని కులంకుశంగా తెలియజేస్తూ సమ్మెకు కార్మికులను, కార్మిక సంఘ నేతలు సిద్ధం చేస్తున్నారు. ప్రధానంగా స్కీం వర్కర్లు కాంట్రాక్ట్ కార్మికులు ఔట్సోర్సింగ్ ఉద్యోగులు ఇప్పటికే యాజమాన్యాలకు సమ్మె నోటీసులు అందించి సమ్మె యొక్క ప్రాధాన్యతను యాజమాన్యానికి తెలిసే విధంగా కృషి చేశారు. మోడీ సర్కార్ అధికారంలోకి వచ్చాక రైతుల నడ్డి విరిచే నల్ల చట్టాలను తీసుకొచ్చే ప్రయత్నం చేయగా ఆ ప్రయత్నాన్ని రైతులు ఐక్యంగా ఉద్యమించి తరిమికొట్టినప్పటికీ దొడ్డి దారిలో నల్ల చట్టాలను మరో మారు తీసుకొచ్చే ప్రయత్నం చేస్తున్న బిజెపి సర్కార్‌కి బుద్ధి వచ్చే విధంగా గ్రామీణ బంధుకి రైతులు వ్యవసాయ కార్మికులు పిలుపునిచ్చారు. గ్రామ గ్రామాన సదస్సులు సమావేశాలతో గ్రామీణ బంధు ప్రాధాన్యతను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో రైతు సంఘాలు వ్యవసాయ కార్మిక సంఘాలు విజయాన్ని సాధించాయి. కార్మికులు రైతులు రైతు కూలీలు ఐక్యంగా కలిసి కేంద్ర ప్రభుత్వంపై చేస్తున్న పోరుకి రాజకీయ పక్షాలు సైతం సంఘీభావంగా కదిలి వస్తున్నాయి. ఒక్క బిజెపి మినహా అన్ని రాజకీయ పక్షాలు సమ్మెకు సంఘీభావం తెలుపుతూనే రాజకీయ పార్టీల ఆధ్వర్యంలో ఈనెల 16న భారత్ బంద్‌కి పిలుపునిచ్చాయి. కార్పొరేట్ సంస్థలు బడా పెట్టుబడుదారుల కోసం మోడీ సర్కార్ అవలంబిస్తున్న కార్మిక కర్షక వ్యతిరేక విధానాలను చరమగీతం పాడేందుకు రేపు జరిగే సార్వత్రిక సమ్మె గ్రామీణ బంధుతో కార్మిక కర్షక ఐక్యతను చాటేందుకు సిద్ధమైనాయి.

సార్వత్రిక సమ్మెకు కార్మిక సంఘాల ఆధ్వర్యంలో విస్తృత ప్రచారం

కొలగాని బ్రహ్మాచారి సిఐటియు జిల్లా అధ్యక్షులు



మోడీ సర్కార్ అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాల నిరసిస్తూ రేపు తలపెట్టిన సార్వత్రిక సమ్మె విజయవంతానికి ఇప్పటికే కార్మిక సంఘాల ఆధ్వర్యంలో విస్తృతంగా ప్రచారాన్ని నిర్వహించి కార్మికులను సమ్మెకు సిద్ధం చేశామని సిఐటియు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షుడు కొలగని బ్రహ్మాచారి తెలియజేశారు. భద్రాచల నియోజకవర్గ వ్యాప్తంగా 500 గ్రామాలలో విస్తృతంగా గ్రూప్ మీటింగులు జనరల్ బాడీ సమావేశాలు నిర్వహించడమే కాక ప్రతి కార్మికుడికి సమ్మె ప్రాధాన్యతను తెలియజేస్తూ కరపత్రాలను అందించామన్నారు. స్కీం వర్కర్లు ఔట్సోర్సింగ్ ఉద్యోగస్తులు కాంట్రాక్టు కార్మికులు ఆయా యాజమాన్యాలకు సమ్మె నోటీసులు అందించి సమ్మె ప్రాధాన్యతను వివరించగలిగామని స్పష్టం చేశారు. గ్రామ గ్రామాన సంతకాల సేకరణ నిర్వహించి ప్రధానమంత్రికి వినతి పత్రాలు పంపించేందుకు సిద్ధం చేశామని ఈ సార్వత్రిక సమ్మెతో కేంద్ర ప్రభుత్వం పతనం ప్రారంభం అవుతుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. మోడీ సర్కార్ ను గద్దె దింపేందుకు కార్మిక సంఘాలు ఐక్యంగా ముందుకు వెళ్తున్నాయని బ్రహ్మాచారి స్పష్టం చేశారు.

కార్మిక కర్షకులకు సంఘీభావంగా రాజకీయ పక్షాలు

మచ్చ వెంకటేశ్వర్లు సీపీఐ(ఎం) నియోజకవర్గ కన్వీనర్



కార్మికులు రైతులు వ్యవసాయ కార్మికులు ఐక్యంగా కేంద్ర ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ చేస్తున్న ఉద్యమానికి రాజకీయ పక్షాలు అండగా నిలుస్తున్నాయని సీపీఐ(ఎం) నియోజకవర్గ కన్వీనర్ మచ్చ వెంకటేశ్వర్లు అన్నారు. ఇప్పటికే అఖిలపక్ష పార్టీల ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశాలు నిర్వహించి సార్వత్రిక సమ్మె గ్రామీణ బంద్‌కి మద్దతుగా భారత్ బంద్‌కి పిలుపునిచ్చామని ఆయన స్పష్టం చేశారు. దేశంలో ఉన్న అన్ని రాజకీయ పార్టీలు ఒక బిజెపి దాని అనుబంధ పార్టీలు మినహాయించి ఈ సమ్మెకు సంపూర్ణ మద్దతును తెలియజేశారని ఇదో శుభపరిణామం అని మచ్చ అభిప్రాయపడ్డారు. రాష్ట్రంలో అధికారులు ఉన్న కాంగ్రెస్ పార్టీ సైతం కేంద్ర ప్రభుత్వ విధానాలను వ్యతిరేకిస్తూ అన్ని రాజకీయ పక్షాలతో కలిసి వస్తుందని అన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు ఇప్పటికే సమ్మె గ్రామీణ బంద్‌కి విస్తృత ప్రచారం నిర్వహించి కార్మికులను రైతులను వ్యవసాయ కార్మికులను సిద్ధం చేశారని మచ్చ వెంకటేశ్వర్లు నవతెలంగాణకు తెలియజేశారు.

ఎస్ఎఫ్ఐ టాలెంట్ టెస్ట్ అభినందనీయం

- జిల్లా విద్యాశాఖ అధికారి ఎం. వెంకటేశ్వరచారి
- టాలెంట్ టెస్ట్ కరపత్రం విడుదల

నవతెలంగాణ-పాల్వంచ



ఎస్ఎఫ్ఐ టాలెంట్ టెస్ట్ అభినందనీయమని జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.వెంకటేశ్వరచారి అన్నారు. బుధవారం స్థానిక జిల్లా ఇంటిగ్రేటెడ్ కలెక్టర్ కార్యాలయంలో జిల్లా విద్యాశాఖాధికారి ఎమ్ వెంకటేశ్వర చారి టాలెంట్ టెస్ట్ కరపత్రం ఆవిష్కరించారు. డిఈఓ ఎస్ఎఫ్ఐ నాయకులతో మాట్లాడారు. భారత ఎస్ఎఫ్ఐ, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 24న జిల్లా స్థాయి, 19, 20న మండలస్థాయిలో విద్యార్థులలో ప్రతిభను వెలికి తీసేందుకు, విద్యార్థులలో పోటీతత్వాన్ని నెలకొల్పేందుకు, రానున్న పరీక్షలకు సన్నద్ధం చేసేందుకు, టాలెంట్ టెస్ట్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి, టాలెంట్ టెస్ట్ జిల్లా కన్వీనర్ బుర్ర వీరభద్రం మాట్లాడుతూ మండల స్థాయిలో నిర్వహించే పరీక్షలో మొదటి 5 గురిని ఎంపిక చేసి జిల్లా స్థాయిలో పోటీ పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. విద్యార్థులు పరీక్ష ఎంట్రీ ఫీజు రూ.30 చెల్లించి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు. వివరాల కోసం 9492930835,9014304293 నెంబర్లను సంప్రదించాలని కోరారు. అనంతరం ఎస్ఎఫ్ఐ టాలెంట్ టెస్టు కరపత్రం విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు బయ్యా అభిమన్యు, జిల్లా సహాయ కార్యదర్శి మందా నాగకృష్ణ, కొత్తగూడెం డివిజన్ ఉపాధ్యక్షులు రామ్ చరణ్ తదితరులు పాల్గొన్నారు.

16న జరిగే భారత్ బంద్‌కు విద్యార్థి సంఘాల మద్దతు

నవతెలంగాణ-కొత్తగూడెం

ఈనెల16 న జరిగే భారత్ బంద్ కు విద్యార్థి సంఘాలు పూర్తి మద్దతు ఇస్తున్నట్లు విద్యార్థి సంఘాల నాయకులు ప్రకటించారు. బుధవారం కొత్తగూడెంలోని ఏఐఎస్ఎఫ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విద్యార్థి సంఘాల రౌండ్ టేబుల్ సమావేశంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఫహీమ్ దాదా, పిడిఎస్‌యు రాష్ట్ర నాయకురాలు మంజుల, ఎస్ఎఫ్ఐ రామ్ చరణ్, పిడిఎస్‌యు సంధ్య పాల్గొని మాట్లాడారు. రైతుల హక్కులను కాలరాస్తూ కార్మికుల హక్కులను కాలరాస్తూ ప్రభుత్వ సంస్థలన్నీ ప్రైవేటు యాజమాన్యాలకు కట్టబెడుతున్న మోడీ నిరంకుశత్వాన్ని వ్యతిరేకిస్తూ విద్యా వ్యవస్థలో కాషాయకరణను, ప్రైవేటీకరణను, కార్పొరేట్ కరణను, నూతన విద్యా విధానం 20-20 ఎన్ఈపి వ్యతిరేకిస్తూ ఫిబ్రవరి16 నిర్వహించే బంద్‌లో విద్యార్థి సంఘాలు పూర్తి మద్దతు తెలుపుతున్నాయని, శుక్రవారం జరగబోయే బంద్‌లో పూర్తిస్థాయిలో విద్యా సంస్థలు బంద్ నిర్వహించి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీను, రణదీర్, శివ, విజయ్ కాంత్, రోహిత్, సన్నీ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన పారిశుధ్యం వారోత్సవాలు

- పేరాయిగూడెంలో క్రీడా పోటీలు
- హాజరైన డిఎల్పీఓ, తహశీల్దార్, ఎంపీపీ, ఎంపీడీఓ

నవతెలంగాణ-అశ్వారావుపేట



తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమం బుధవారంతో ముగిసింది. ఈ సందర్భంగా మండలంలో రెండో మేజర్ పంచాయితీ అయిన పేరాయిగూడెంలో కార్యదర్శి కోటమర్తి శ్రీరామ మూర్తి పర్యవేక్షణలో క్రీడా పోటీలు నిర్వహించారు. వాలీబాల్ పోటీలో విజయం సాధించిన టీంకు బహుమతులు అందించారు. ముఖ్య అతిథిగా హాజరు అయిన ఎంపీపీ జల్లిపల్లి శ్రీరామమూర్తి మాట్లాడుతూ ప్రత్యేక అధికారులు గ్రామాల్లోని సమస్యలను తెలుసుకుని, వెంటనే పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో డిఎల్పీఓ రాజీవ్ కుమార్, ప్రత్యేక అధికారి, తహశీల్దార్ కృష్ణా ప్రసాద్, ఎంపిడివో శ్రీనివాసారావు, ఎంపీఈఓ సీతారామరాజు, ఈఓ హరిక్రిష్ణ, కార్యదర్శి శ్రీరామమూర్తి, చిప్పనపల్లి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతా నియమాలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

రోడ్డు ప్రమాదాలను అరికట్టడానికి జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక చర్యలు : ఎస్పీ రోహిత్ రాజు

నవతెలంగాణ-కొత్తగూడెం

వాహనదారులు రోడ్డు భద్రతా నియమాలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని, రోడ్డు సేఫ్టీ మాసోత్సవాల సందర్భంగా రోడ్డు ప్రమాదాలను అరికట్టడానికి జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు తెలిపారు. బుధవారం ప్రకటన విడుదల చేశారు. రోడ్డు భద్రతా మాసోత్సవాలలో భాగంగా జనవరి 15వ తేదీ నుండి ఫిబ్రవరి 14వ తేదీ వరకు నెల రోజుల పాటు జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలోని పోలీసు అధికారులు రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. ఈ నెల రోజుల పాటు ఏర్పాటు చేసిన వాహన తనిఖీలలో రోడ్డు భద్రతా నియమాలను పాటించని వాహనదారులపై కేసులు నమోదు చేయడం, జరిమానాలు విధించడం, వాహనాలను సీజ్ చేయడం లాంటి చర్యలు చేపట్టడం జరిగిందని వెల్లడించారు. జిల్లా వ్యాప్తంగా మద్యం సేవించి వాహనాలు నడిపిన వారిపై 1355 కేసులు నమోదు చేయడం జరిగిందన్నారు. రోడ్డు భద్రతా నియమాలను ఉల్లంఘించిన వ్యక్తులకు సంబంధించిన 2922 వాహనాలను సీజ్ చేయడం జరిగిందని తెలిపారు. సీజ్ చేయబడిన వాహనాలలో కొన్నింటికి జరిమానా విధించి తిరిగి యజమానులకు అప్పగించడం జరిగిందన్నారు. మొత్తం రూ.40,915 ఈ-చలాన్ కేసులలో రూ.80,78,385లు జరిమానా విధించామన్నారు. జిల్లాలో 80 అవగాహనా కార్యక్రమాలను నిర్వహించామన్నారు. రోడ్డు ప్రమాదాలను అరికట్టడంలో భాగంగా ప్రతి ఒక్క వాహనదారుడు రోడ్డు భద్రతా నియమాలను పాటించాలని హెచ్చరించారు. మైనర్లకు వాహనాలు ఇవ్వడం ద్వారా రోడ్డు ప్రమాదాలకు గురై వారి అమూల్యమైన ప్రాణాలను కోల్పోయే ప్రమాదం ఉందన్నారు.

చెత్త కనపడితే ఉలిక్కి పడుతున్న ఈఓ

- ఉదయాన్నే విధుల్లోకి డీఎల్పీఓ

నవతెలంగాణ-అశ్వారావుపేట



నియోజక వర్గం కేంద్రం అయిన మేజర్ పంచాయితీలో స్థానిక పాలక వర్గం లేని లోటును ప్రత్యేక అధికారిగా డిఎల్పీఓ రాజీవ్ కుమార్ తీరుస్తున్నాను. ఈ నెల రెండో తేదీన ప్రత్యేక అధికారిగా బాధ్యతలు స్వీకరించిన ఆయన పంచాయితీ పరిధిలో ప్రతీ వీధిని, పార్క్‌ను, డంపింగ్ యార్డ్ ను కలియ తిరుగుతూ పారిశుధ్యం పై దృష్టి సారించారు. తెల్లవారు జామున 5 గంటలకే కార్మికులతో పాటు తిరుగుతూ ఏ చిన్న చెత్త కుప్ప కనిపించినా కార్మికుల చేత తొలగించేలా చర్యలు చేపడుతున్నారు. దీంతో ఎక్కడ చెత్త కనిపించినా ఈఓ హరిక్రిష్ణ ఉలిక్కిపడుతున్నారు. రోడ్డు పై వ్యర్ధ పదార్థాలు వేసే దుకాణదారులును గుర్తించి నోటీసులు ఇవ్వాల్సిందిగా డిఎల్పీఓ రాజీవ్ కుమార్ ఈఓ హరిక్రిష్ణకు ఆదేశాలు జారీ చేస్తున్నారు. బుధవారం ఆయన పాల్గొన్న కార్యక్రమంలో ఎంపీఈఓ సీతారామరాజు, ఈఓ హరిక్రిష్ణ పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్ కథనాలపై ఇంటిలిజెన్సీ ఆరా..!

- మండలంలో విస్తృతంగా చర్చ

నవతెలంగాణ-బూర్గంపాడు

అమ్మో ...బూర్గంపాడు పోలీస్ స్టేషన్..!?.. ఇక్కడ ఎస్ఐలు గా పని చేస్తే... అటాచ్మెంటే..కొత్త ఎస్ఐకు ..సరికొత్త సవాళ్లు..?! అనే వేర్వేరు కథనాలు నవతెలంగాణలో బుధవారం ప్రచురితమైన విషయం విధితమే. ఈ మేరకు ఈ కథనాలపై మండలంలో జోరుగా చర్చ సాగింది. అదేవిధంగా నవతెలంగాణ కథనాలపై ఇంటిలి జెన్సీ పోలీసులు ఆరా తీశారు. మండ లంలో పోలీసు వ్యవస్థ తీరు తెన్నులపై విశ్లేషణాత్మక కథనం నవతెలంగాణలో ప్రచురణ కావడంతో ఇంటిలిజెన్సీ పోలీసులు పూర్తిస్థాయిలో విచారణ నిర్వహించినట్లు తెలుస్తోంది. ఈమేరకు సారపాక, బూర్గంపాడు ప్రాంతాల్లో ఇంటె లిజెన్స్ పోలీసులు పలువురు వద్ద సమాచారాన్ని సేకరించినట్లు తెలిసింది. అదేవిధంగా బూర్గంపాడులో ఎస్సైలుగా పని చేసే అధికారులు ఐటీసీలో మకాం పెడుతున్నారనే విషయంపై పలువురు వద్ద కీలక సమాచారాన్ని సేకరించినట్లు విశ్వసనీయంగా తెలిసింది. ఇదిలా ఉండగా జిల్లా పోలీసు బాస్ నవతెలంగాణలో వెలువడిన కథనాలపై ఆరా తీసినట్లు తెలిసింది.

లిటిల్ ఫ్లవర్స్ విద్యాసంస్థలలో వికసిస్తున్న గిరిజన ఆణిముత్యాలు

- 10 ఇంటర్‌తో పాటు పోటీ పరీక్షలోనూ రాణిస్తున్న గిరిజన బిడ్డలు

నవతెలంగాణ-భద్రాచలం రూరల్



గిరిజన బిడ్డలు ఉన్నత శిఖరాలను అవరోధించాలంటే ఉన్న ఏకైక మార్గం చదువు అటువంటి చదువు అంగట్లో సరుకులా మారి గిరిజన బిడ్డలకు అందని ద్రాక్షాల మారకూడదన్న లక్ష్యంతో గిరిజన కేంద్రమైన భద్రాచలం పట్టణంలో కీర్తిశేషులు మాగంటి సూర్యం 45 సంవత్సరాల క్రితం ప్రారంభించిన లిటిల్ ఫ్లవర్స్ విద్యాసంస్థలలో విద్యను అభ్యసించిన గిరిజన బిడ్డలు ఆణిముత్యాలలాగా ఉన్నత శిఖరాలను అవరోధించారనటంలో ఎటువంటి అతిశక్తి లేదు. లిటిల్ ఫ్లవర్స్ విద్యా సంస్థలు ప్రారంభించిన నాటి నుండి 10వ తరగతి ఫలితాల్లోనైనా ఇంటర్ ఫలితాలలోనైనా రాష్ట్రంలోనే అగ్రస్థానంలో ఉత్తమ ఫలితాలు సాధిస్తూ విజయాలను సాధిస్తున్న లిటిల్ ఫ్లవర్స్ విద్యా సంస్థల విద్యార్థులు ఇటు పోటి పరీక్షలలో కూడా తమదైన మార్కు నీ చూపిస్తున్నారు. ప్రత్యేకించి ఇంజనీరింగ్ మెడిసిన్ చదవాలంటే లక్షల్లో ఫీజులు కట్టి కోచింగ్ లు తీసుకుంటే తప్ప హరత పరీక్షల్లో విజయాలు సాధించలేరు అన్న ప్రచారానికి చెక్కు పెడుతూ లిటిల్ ఫ్లవర్స్ విద్యా సంస్థలో విద్యను అభ్యసిస్తున్న గిరిజన బిడ్డలు జేఈ మెయిన్స్‌లో ఉత్తమ ర్యాంకులు సాధించి మాకు చాటి ఎవరూ లేరని తేల్చి చెప్పారు. గత సంవత్సరంలో కూడా ఎంసెట్లో అత్యధిక ర్యాంకులు సాధించిన విద్యా సంస్థగా లిటిల్ ఫ్లవర్స్ విద్యా సంస్థ ఉందంటే ఇక్కడ అభ్యసిస్తున్న విద్యార్థుల ప్రతిభ గురించి ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. ఇటు ఆదివాసి విద్యార్థులు తోపాటు మైదాన ప్రాంత గిరిజన విద్యార్థులకు అత్యుత్తమ కార్పొరేటర్ విద్యను అందిస్తూ గిరి బిడ్డలను ఉన్నత శిఖరాలు అవరోదించేలాగా ప్రత్యేక విద్యను అందిస్తున్న లిటిల్ ఫ్లవర్స్ విద్యాసంస్థల విజయం పరంపర కొనసాగుతుంది. ఇటీవల విడుదల చేసిన జేఈఈ పరీక్ష ఫలితాలలో లిటిల్ ఫ్లవర్స్ విద్యా సంస్థల విద్యార్థినులు అయిన సాహితీ, నిహారిక,లు ఉత్తమ పర్సెంటేజీతో ర్యాంకులు సాధించి మరోసారి లిటిల్ ఫ్లవర్స్ విద్యాసంస్థల విజయ పతాకాన్ని ఎగురేశారు. కార్పొరేట్ విద్యాసంస్థలలో సాధ్యం కానీ ర్యాంకులను ఏజెన్సీ కేంద్రమైన భద్రాచలంలో ఉన్నటువంటి లిటిల్ ఫ్లవర్స్ విద్యా సంస్థలు సాధించడం పట్ల పట్టణంలోని విద్యావేత్తలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నాడు ఉమ్మడి మండలం... నేడు ప్రత్యేక మండలానికి ఎంపీడీఓగా మహాలక్ష్మి

నవతెలంగాణ-అన్నపురెడ్డిపల్లి



ఉమ్మడి చంద్రుగొండ మండలంలో యంపిడిఓగా పని చేసిన మహాలక్ష్మి ఉమ్మడి మండలం నుండి విడిపోయి నూతన మండలంగా అవతరించిన అన్నపురెడ్డిపల్లి మండలానికి తిరిగి వచ్చి బుధవారం యంపిడిఓగా బుధవారం బాధ్యతలు స్వీకరించారు. నాడు అక్కడ నేడు ఇక్కడ బాధ్యతలు స్వీకరించిన మొదటి మహిళా అధికారిగా మండలంలో సరి కొత్త రికార్డు సృష్టించారు. కొణిజర్ల మండలంలో యంపిడిఓగా విధులు నిర్వహిస్తూ సాధారణ బదిలీల్లో భాగంగా ఆమె అన్నపురెడ్డిపల్లి మండలానికి రావడం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో అందరి అధికారులు, ప్రజలు సహకారంతో మండల అబివృద్ధికి కృషి చేస్తానని అన్నారు.మండలంలో ప్రజా ప్రతినిధులు ప్రజలు అందరి సహకారం ఉండాలని కోరారు. బాధ్యతలు చేపట్టిన మహాలక్ష్మికి పలువురు అధికారులు, ప్రజా ప్రతినిధులు అభినందనలు తెలియజేశారు.

చిన్నతనం నుండే దేశభక్తిని అలవర్చుకోవాలి

- సీఐ అలం రాజు వర్మ

నవతెలంగాణ-చర్ల



ప్రతి ఒక్క విద్యార్థి విద్యార్థి దశ నుండే దేశభక్తిని అలవర్చుకొని క్రమశిక్షణతో ఎదగాలని నూతన చర్ల సిఐ అలం రాజు వర్మ సూచించారు. బుధవారం స్థానిక గురుదేవ్ విద్యాలయం విద్యార్థులు పుల్వామ దాడిలో అమరులైన జవానులకు స్థానిక పోలీస్ స్టేషన్లో 2019 ఫిబ్రవరి 14 న అమరులైన 40 మంది జవాన్లకు ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో గురుదేవ్ చిన్నారులు ప్రదర్శించిన కార్యక్రమాలు అందరినీ అలరించాయి. ఆ నాటి సంఘటనను కళ్ళకు కట్టినట్టు చూపిన లఘు (స్కిట్) నాటిక, క్లాసికల్ డాన్స్, దేశభక్తి పాటలకు విద్యార్థినులు చేసిన కోలాటం, మ్యూజిక్ అందరినీ ఆకట్టుకున్నాయి. దేశ భక్తిని పెంపొందించే లా ఉన్నాయని పలువురు ప్రశంసించారు. చర్ల సిఐ రాజు వర్మ మాట్లాడుతూ పిల్లలు బాల్యం నుండే దేశభక్తి అలవాటు చేసుకోవాలి అని, దేశాభివృద్ధికి కృషి చేయాలన్నారు. చర్ల సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ టివిఆర్ సూరి మాట్లాడుతూ పిల్లలు ఎంతో క్రమశిక్షణ, శ్రద్ధతో కళారూపాలు చేశారని అంతేకాకుండా స్కూల్ లో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు వారి వివాహ వార్షికోత్సవం పురస్కరించుకొని స్టేషనరీ బహుమానంగా ఇవ్వడం జరిగింది. సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ నర్సి రెడ్డి మాట్లాడుతూ పిల్లలు చిన్ననాటి నుండే జాతీయ భావాలు, దేశభక్తి అలవరచుకోవాలి అని అన్నారు.ఈ కార్యక్రమం లో గురుదేవ్ విద్యాలయం ప్రిన్సిపాల్ జీవి ప్రసాద్, ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

బదిలీపై వెళ్తున్న ఎంపీడీఓకు సన్మానం

నవతెలంగాణ-జూలూరుపాడు



జూలూరుపాడు ఎంపీడీవో వెంకటేశ్వరరావు బదిలీపై కరకగూడెం మండలం వెళ్తున్న సందర్భంగా మాచినేని పేట తండా గ్రామపంచాయతీ లో చిరు సన్మానం కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ లాకావత్ గిరిబాబు, పంచాయతీ కార్యదర్శి బి.జ్యోతి, ఫీల్డ్ అసిస్టెంట్, మూడు రమేష్, గ్రామ పెద్దలు బానోత్ చిన్నా మూడు జామ్లా తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌గా సూర్య నారాయణ బాధ్యతలు స్వీకరణ

నవతెలంగాణ-పినపాక



పినపాక మండల తహసీల్దార్‌గా సూర్య నారాయణ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల బదిలీల భాగంగా అయన పినపాక కు బదిలీ పై వచ్చారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటామని తెలియజేశారు. భూ సమస్యలు ఉంటే నేరుగా తనను కలవాలని మధ్య దళారులను సంప్రదించవద్దని తెలియజేశారు. నూతన తాసిల్దార్ ను కార్యాలయం సిబ్బంది కలిసి పుష్పగుచ్చం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.

ప్రజల శ్రేయస్సే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం

నవ తెలంగాణ-జూలూరుపాడు

ప్రజల శ్రేయస్సే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని జూలూరుపాడు మండల కాంగ్రెస్ సీనియర్ నాయకులు యల్లంకి చిన్న నాగేశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆర్ఎక్స్ 100 కోసమే కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో ఇప్పటికే రెండు గ్యారెంటీలను నెరవేర్చి మరో రెండు గ్యారంటీలను వచ్చే నెల ప్రారంభించనుండటం హర్షణీయమని తెలిపారు. ప్రజల శ్రేయస్సు కోసమే కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందనటానికి ఈ గ్యారెంటీలే నిదర్శనమని పేర్కొన్నారు. తెలంగాణ ప్రజలకు ఇచ్చిన హామీల మేరకు ఆరు గ్యారెంటీల అమలుకై ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ తెలంగాణ ప్రజల సంక్షేమానికి పెద్దపీట వేసిందని పేర్కొన్నారు.

సేవాలాల్ మహారాజ్ జయంతి పనుల పరిశీలన

నవతెలంగాణ-జూలూరుపాడు

శ్రీశ్రీశ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ 285 జయంతి వేడుకలు సందర్భంగా నేడు జరగబోయే కార్యక్రమ పనులను బుధవారం కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు, జూలూరుపాడు మండల పిఏసిఎస్ చైర్మెన్ లేళ్ల వెంకటరెడ్డి, వెంగన్నపాలెం ఎంపిటిసి దుద్దుకురి మధుసూదన్‌రావు, మండల పార్టీ అధ్యక్షులు మాలోత్ మంగీలాల్ నాయక్ పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో వేల్పుల నరసింహారావు, పోతురాజు నాగరాజ్, లేళ్ల గోపాల రెడ్డి, బాదావత్ వెంకట్రావు, చందర్, మిరియాల కిరణ్ కుమార్, పోతురాజు రాములు, సేవాలాల్ నిర్వహణ కమిటీ, స్థానిక గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

చర్ల సీఐగా బాధ్యతులు స్వీకరించిన ఏ.రాజు వర్మ

నవతెలంగాణ-చర్ల



చర్ల నూతన సర్కిల్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్‌గా అలం రాజు వర్మ బుధవారం విధుల్లో చేరారు. ఇంతకాలం విధులు నిర్వహించిన బి. రాజగోపాల్ బదిలీపై హనుమకొండకు వెళ్లగా ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు స్పెషల్ బ్రాంచ్ -2 లో విధులు నిర్వహిస్తున్న రాజు వర్మ సిఐగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హద్దు మీరు ప్రవర్తిస్తే ఎంతటి వారిపైనైనా చర్యలు తప్పవని ఆయన తెలిపారు. చర్ల పోలీస్ స్టేషన్లో సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ గా విధులు నిర్వహిస్తున్న కాలంలో ఏజెన్సీలో ఎంతోమంది విద్యార్థుల భవిష్యత్తును సక్రమమైన మార్గంలో పెట్టేందుకు తనదైన శైలిలో కృషి చేశారని ఆయనను పలువురు ప్రశంసిస్తున్నారు. ఈ కార్యక్రమంలో చర్ల ఎస్ఐలు టివిఆర్ సూరి, నర్సిరెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.

మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు

నవతెలంగాణ-భద్రాచలం రూరల్

భద్రాచలం మద్యం సేవించి వాహనాలు నడిపినా, ట్రాఫిక్ నియమాలు పాటించకుండా ప్రమాదాలకు కారణమైతే కఠిన చర్యలు ఉంటాయని భద్రాచలం ట్రాఫిక్ ఎస్ఐ శ్రీనివాస్ హెచ్చరించారు. ఇటీవల కాలంలో మద్యం సేవించి వాహనాలు నడిపి పోలీసులకు పట్టుబడి,ట్రాఫిక్ నియమాలు పాటించని వాహనాదారులకు వారి కుటుంబ సభ్యుల సమక్షంలో బుధవారం భద్రాచలం ట్రాఫిక్ ఎస్ఐ శ్రీనివాస్ స్థానిక ట్రాఫిక్ పోలీస్ స్టేషన్లో కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఎస్ఐ శ్రీనివాస్ మాట్లాడారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే జరిగే ప్రమాదాలు తదితర అంశాల గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం ట్రాఫిక్ ఏఎస్ఐ శ్రీనివాస్, వేంకటేశ్వర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అటవీ జంతువులను వేటాడితే చర్యలు

నవతెలంగాణ-పినపాక

విద్యుత్ తీగలతో అడవి జంతువులను వేటాడితే వారిపై క్రిమినల్ చర్యలు తీసుకుంటామని ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ తేజస్విని హెచ్చరించారు. బుధవారం పినపాక మండల పరిధిలో గల వలస ఆదివాసి గ్రామాలలో అటవీశాఖ అధికారులతో కలిసి ఆమె అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. విద్యుత్ తీగలతో జంతవులును వేటాడిన వారికి పడే శిక్షలను వివరించారు. ఇటీవల కాలంలో చాలామంది వ్యక్తులు విద్యుత్ తీగలను అమర్చి జంతువులను వేటడుతున్నారని, అది తీవ్రమైన నేరమన్నారు. వన్యప్రాణి సంరక్షణ చట్టం-1972 ప్రకారం మూగజీవాలను వేటాడటం నేరమని, విచారణలో నేరం రుజువైతే జరిమానాతో పాటు జైలు శిక్షసైతం ఉంటోందన్నారు. సెర్చ్ లైట్లు ఉన్న, వేటాడే వస్తువులు ఉన్న అందజేయాలని కోరారు. అటవీ జంతువులను వేటాడే వారి సమాచారం తెలిస్తే అందజేయాలని కోరారు. వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో అరుణ, అటవీ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీ

పాల్వంచ: గుడిపాడు అంగన్వాడి కేంద్రాన్ని బుధవారం జిల్లా సంక్షేమాధికారిణి వేల్పుల విజేత ఆకస్మికంగా తనిఖీ చేశారు. కేంద్రంలోని స్టాక్‌ని తనిఖీ చేశారు. పిల్లల హాజరు, గర్భిణులు, బాలింతల హాజరు నమోదు మొదలగు వివరాలు పరిశీలించారు. దానిని స్టాక్ రిజిస్టర్‌తో సరి పోల్చుకున్నారు. కేంద్రాలకు ఎన్ని గుడ్లు వేస్తే అన్నింటికే సంతకం చేయాలని, తక్కువ వేసుకుని ఎక్కువకు సంతకం చేస్తే క్రమశిక్షణా చర్యలు తీసుకుంటామని చెప్పారు. పిల్లల పోషణకు ఎటువంటి ఆటంకం లేకుండా చూడాలని, గుడ్ల నాణ్యతలో లోపం ఉంటే తిరస్కరించాలని సిబ్బందిని ఆదేశించారు. ఎవరైనా బెదిరింపులకు పాల్పడితే తక్షణమే తన దృష్టికి తీసుకు రావాలని సూచించారు. సంబంధిత సిడిపివోలు, సూపర్ వైజర్లు కేంద్రాలను విస్తృత తనిఖీలు చేయాలని ఆదేశించారు.

బాధ్యతలు స్వీకరించిన తహసీల్దార్, ఎంపీడీఓ

నవతెలంగాణ-చంద్రుగొండ





చంద్రుగొండ నూతన తహసీల్దార్గా గర్రం జగదీశ్వరావు, ఎంపిడిఓగా బయ్యవరపు అశోక్ బుధవారం వారివారి కార్యాలయాల్లో బాధ్యతలు చేపట్టారు. నూతన తహసీల్దార్ జగదీశ్వరరావు వరంగల్ కలెక్టరేట్ నుండి బదిలీపై ఇక్కడికి రాగ, బోనకల్లు ఎంపిడిఓగా విధులు నిర్వరిస్తూ అశోక్ బదిలీపై చంద్రుగొండకు వచ్చాడు. ఈ సందర్భంగా ఎంపిడిఓ అశోక్ మాట్లాడుతూ గ్రామాల్లో సమస్యలుంటే తనదృష్టికి తీసుకురావాలన్నారు. భూ సంబంధిత సమస్యలతో పాటు, విద్యార్థులకు సర్టిఫికెట్లు జారీలో జాప్యం లేకుండా చూస్తామని, సమస్యలుంటే నేరుగా తనను కలవాలని తహసీల్దార్ జగదీశ్వరారవు మండల ప్రజలకు సూచించారు. పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు నూతన ఎంపిడిఓ, తహసీల్దార్లను అభినందించారు.

రైతులపై లాఠీచార్జీకి నిరసనగా బీజేపీ ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం

- 16న దేశవ్యాప్త గ్రామీణ భారత్ బంద్ జయప్రదం చేయండి
- ఏఐకేఎంఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కందగట్ల సురేందర్

నవతెలంగాణ-కొత్తగూడెం



రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరల కోసం వారి హక్కుల కోసం ఢిల్లీలో ఆందోళన చేస్తున్న రైతులపై నరేంద్ర మోడీ ప్రభుత్వం భాష్పవాయువును ప్రయోగిస్తూ కిరాతకంగా లాఠీ చార్జి చేయడాన్ని అఖిలభారత రైతు కూలీ సంఘం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యవర్గం తీవ్రంగా ఖండిస్తూ జిల్లా కేంద్రంలో మోడీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన తెలియజేస్తూ ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. బుధవారం భద్రాద్రి కొత్తగూడెం బస్టాండ్ సెంటర్‌లో ఇఫ్టూ జిల్లా కోశాధికారి మోత్కూరి మల్లికార్జున్ రావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో అఖిలభారత రైతు కూలీ సంఘం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రధాన కార్యదర్శి కందగట్ల సురేందర్, జిల్లా సహాయ కార్యదర్శి కుంజా కృష్ణలు పాల్గొని మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఢిల్లీ రైతులపై లాఠీచార్జీ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. మోడీ రైతు కార్మికుల పట్ల అనుసరిస్తున్న, ప్రజా వ్యతిరేక విధానాలను ప్రతిఘటించాలని పిలుపు నిచ్చారు. మోడీ అనుసరిస్తున్న నియంత నిరంకుశ వైఖరికి నిరసనగా ఫిబ్రవరి 16న సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్కేయం), రైతు కార్మిక సంఘాలు తలపెట్టిన దేశవ్యాప్త సమ్మె, గ్రామీణ భారత్ బంద్‌ను జయప్రదం చేయాలని కోరారు. కేంద్రంలో మతోన్మాద బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రైతాంగ, కార్మిక, ప్రజా సమస్యలను పరిష్కరించలేదని విమర్శించారు.కార్పొరేట్లకు అనుగుణంగా తీసుకొచ్చిన కార్మిక, రైతాంగ వ్యతిరేక చట్టాలను ఉపసంహరించుకోవాలని, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరనను నిలిపివేయాలని, అధిక ధరలను నియంత్రించాలని డిమాండ్ చేశారు. ఫిబ్రవరి 16న దేశ వ్యాప్తంగా జరుగుతున్న రైతు, కార్మిక సమ్మె, గ్రామీణ భారత్ బంద్‌లో ప్రజలు కార్మిక, కర్షకులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు ఈదునూరి సంజీవరావు, భూక్య కిషన్, ఎండి.నాజర్ పాషా, రాజేష్, సవాళ్ల ఆదినారాయణ, కత్తి కృష్ణ, వి.సంధ్య, డి.వీరమ్మ, కె.గంగ, బి.లక్ష్మి, వి.కళ్యాణి, సునీత, కె.వెంకటేశ్వర్లు, ఎస్.శ్రీను, ఎం.ముఖేష్, బి.రమేష్, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎంపికైన అభ్యర్థులకు 15న నియామక ఉత్తర్వులు

- కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అలా

నవతెలంగాణ-పాల్వంచ



బీసీ, ఎస్సీ, గిరిజన సంక్షేమ, మైనార్టీ శాఖల్లో జూనియర్ లెక్చరర్లు, పిజిటిలు, లైబ్రరియన్లు, ఫిజికల్ డైరెక్టర్లుగా ఎంపికైన 61 మంది అభ్యర్థులకు 15వ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి చేతుల మీదుగా నియామక ఉత్తర్వులు అందజేయనున్నందున హైదరాబాద్ తీసుకెళ్ళుటకు ఉచిత బస్సులు ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అలా అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టర్ చాంబర్‌లో ఎంపికైన జూనియర్ లెక్చరర్లు, పిజిటిలు, లైబ్రేరియన్లు, పిడిలను హైదరాబాద్ తీసుకెళ్లే అంశంపై బీసీ, ఎస్సి, ఎస్టీ, మైనార్టీ సంక్షేమ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆయా శాఖల్లో జూనియర్ లెక్చరర్లు, పిజిటీలు, లైబ్రేరియన్లు మరియు పీడీలుగా ఎంపికైన అభ్యర్థులు ఉద్యోగ నియాక మంత్రాలను ముఖ్యమంత్రి అందచేయనున్నందున హైదరాబాద్ తీసుకెళ్లాల్సి ఉన్నట్లు చెప్పారు. అభ్యర్థులు తిరిగి క్షేమంగా గమ్యస్థానాలకు చేర్చాల్సిన బాధ్యత మనపై ఉందని చెప్పారు. బీసీ సంక్షేమ శాఖలో 34 మంది, ఎస్సీ సంక్షేమ శాఖలో 11 మంది, గిరిజన సంక్షేమ శాఖలో 12 మంది, మైనారిటీ సంక్షేమ శాఖలో 4గురికి గురువారం నియామక ఉత్తర్వులు అందచేయనున్నట్లు చెప్పారు. మొత్తం 61 మందిని హైదరాబాద్ తీసుకెళ్లేందుకు కొత్తగూడెం నుండి రెండు ఉచిత బస్సులు ఏర్పాటు చేయనున్నట్లు ఆమె తెలిపారు. ప్రతి బస్సుకు ఇద్దరు లైజన్ అధికారులను ఏర్పాటు చేయాలని చెప్పారు. హైదరాబాద్ వెళ్లే అభ్యర్థుల సమాచారం పోర్టల్ లో నమోదు చేయాలని చెప్పారు. ఉదయం 5.30 గంటలకు కొత్తగూడెం నుంచి రెండు బస్సులు బయలుదేరి, నిర్దేశించిన సమయంలోగా హైదరాబాద్ లోని ఎల్బీ స్టేడియానికి చేరుకోవాలని ఆమె సూచించారు. ఇందుకొరకు ఆయా శాఖల అధికారులు నియామకపు ఉత్తర్వులు అందుకోనున్న అభ్యర్థులకు ముందస్తుగా సమాచారం అందించి సమాయత్తం చేయాలని చెప్పారు. దూరపు ప్రాంతాలల్లో ఉన్న అభ్యర్థులు ముందుగానే కొత్తగూడెం చేరుకునే విధంగా చర్యలు చేపట్టాలని చెప్పారు. ఈ సమావేశంలో డిఆర్‌ఓ రవీంద్రనాథ్, బీసీ సంక్షేమ అధికారి ఇందిర, మైనార్టీ సంక్షేమ అధికారి సంజీవరావు, బిసి గురుకుల జిల్లా కన్వీనర్ బ్యూల రాణి, ఎస్సి రీజనల్ కో ఆర్డినేటర్ ప్రత్యూష, ఎస్సి అభివృద్ధి అధికారి అనసూయ తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎంల పరిశీలన

కొత్తగూడెం : పార్లమెంట్ ఎన్నికల నిర్వహణలో భాగంగా ఈవిఎం ఎన్నికల ప్రక్రియలో ఈవిఎం మొదటి దశ పరిశీలన అత్యంత ప్రధానమని జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అల తెలిపారు. బుధవారం కొత్తగూడెం ఆర్డిఓ కార్యాలయంలో బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు అలాగే వివిప్యాట్ మొదటి దశ పరిశీలన, ఈవిఎం గోదామును పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మన జిల్లాకు ఎన్నికల సంగం కేటాయించిన1,588 బ్యాలెట్ యూనిట్లు, 1,424 కంట్రోల్ యూనిట్లు అలాగే 1,683 వీవీ పాట్లు మొదటి దశ పరిశీలన చేపట్టినట్లు చెప్పారు. గురువారం వరకు పరిశీలన ప్రక్రియ మొత్తం పూర్తి అవుతుందని చెప్పారు. మొదటి దశ ప్రక్రియ పూర్తి చేసిన అనంతరం ఈవిఎం, కంట్రోల్ యూనిట్లు, వీవీ పాట్లు ఈవిఎం గోదాములో భద్రపరచనున్నట్లు చెప్పారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల నిర్వహణలో భాగంగా ఈవిఎం పరిశీలన కార్యక్రమం చేపట్టినట్లు చెప్పారు. సిసి టివి పర్యవేక్షణలో మొదటి దశ పక్రియ జరుగుతున్నట్లు చెప్పారు. అనంతరం ఈవిఎం గోదామును పరిశీలించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రాంబాబు, ఆర్ అండ్ బి ఈఈ వెంకటేశ్వర రావు, కొత్తగూడెం తహసిల్దార్ పుల్లయ్య, ఎన్నికల విభాగం నాయబ్ తహసీల్దార్, రంగా ప్రసాద్, సిబ్బంది నవీన్, తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ భారత్ బంద్‌కు సీపీఐ(ఎం) సంపూర్ణ మద్దతు

- రాష్ట్ర కమిటీ సభ్యులు మచ్చ వెంకటేశ్వర్లు

నవతెలంగాణ-దుమ్ముగూడెం

ఈ నెల 16 వ తేదీన వివిధ రాజకీయ పార్టీలు, కార్మిక సంఘాలు, రైతు సంఘాలు, కార్మిక కర్షకుల ఐక్యతతో తలపెట్టిన గ్రామీణ భారత్ బందుకు సిపిఐ (ఎం) సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు మచ్చా వెంకటేశ్వర్లు తెలిపారు. బుధవారం ములకపాడు యలమంచి సీతారామయ్య భవన్‌లో జరిగిన మండల కమిటీ సమావేశంలో అయన పాల్గొని మాట్లాడారు. దేశంలో బిజెపి రెండో సారి అధికారంలోకి వచ్చిన తర్వాత తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్స్, విద్యుత్ సవరణ బిల్లును రద్దు చేయాలని అన్నారు. కేంద్ర బిజెపి ప్రభుత్వం కార్పొరేట్ మతతత్వ విధానాలను మోడీ వైఫల్యాలపై చార్జిషీట్ ప్రకటిద్దామని పిలుపునిచ్చారు . ఈ కార్యక్రమంలో సిపిఐ (ఎ పార్టీ మండల కార్యదర్శి కారం పుల్లయ్య, సిపిఐ (ఎం) పార్టీ జిల్లా కమిటీ సభ్యులు యలమంచి వంశీకృష్ణ, జిల్లా కమిటీ సభ్యులు మర్మం చంద్రయ్య, వై శ్రీనివాసరెడ్డి , కాకా కృష్ణ, కొమరం చంటి, తదితరులు పాల్గొన్నారు.



'బీజేపీ ప్రభుత్వం దేశాన్ని సర్వనాశనం చేసింది'



నవతెలంగాణ -బూర్గంపాడు

పదేళ్ల పాలనలో కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం దేశాన్ని సర్వనాశనం చేసిందని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏజే. రమేష్ విమర్శించారు. బుధవారం బూర్గంపాడు మండలం సారపాక సుందరయ్య నగరంలో నిర్వహించిన జనరల్ బాడీ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. సంతకాల సేకరణ కార్యక్ర మాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 16న జరిగే సార్వత్రిక సమ్మెలో కార్మికులు పెద్ద సంఖ్యలో మండల కేంద్రంలో ప్రదర్శన చేయాలని పిలుపునిచ్చారు. అదే విధంగా దేశవ్యాప్త సమ్మెకు గ్రామీణ బంధు కార్యక్రమంలో అన్ని వర్గాల ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు బత్తుల వెంకటేశ్వర్లు, వ్యకాస మండల అధ్యక్షులు ఎస్కే. అబీద, మహిళా సంఘం నాయకులు పాపినేని సరోజన, హుస్సేన్, చంద్రావు, అక్బర్, పద్మ, రాధా, ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

చర్ల: కార్మికులు రైతుల హక్కుల కోసం ప్రజాస్వామ్యం రాజ్యాంగం పరిరక్షణ కోసం కేంద్రంలో బిజెపి ప్రభుత్వాన్ని గద్దె దించాలని, కార్మికులకు ప్రజలకు సిఐటియు విజ్ఞప్తి చేసింది కేంద్ర బీజేపీ ప్రభుత్వ కార్మిక రైతు ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఫిబ్రవరి 16వ తేదీన జరుగుతున్న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని, సమ్మెలో కార్మికులు రైతులు వ్యవసాయ కార్మికులు పాల్గొనాలని గ్రామీణ భారత్ బంద్ విజయవంతం చేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేస్తూ చర్ల మండలంలో సిఐటియు కార్యకర్తలు ఇంటింటి ప్రచారాన్ని నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా జరిగిన సభల్లో సిఐటియు మండల కమిటీ సభ్యులు గణేష్, ఆటో యూనియన్ అధ్యక్షులు బాలాజీ, కెవిపిఎస్ మండల కార్యదర్శి మచ్చ రామారావు ఆధ్వర్యంలో ఆటో యూనియన్ కమిటీ సభ్యులు ప్రైవేట్ ట్రాన్స్పోర్ట్ కార్మికుల్లో సమ్మె జయప్రదం కోసం ప్రచారం నిర్వహిస్తున్నారు. సిఐటియు మండల కన్వీనర్ పాయం రాధాకుమారి ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించి గ్రామీణ భారత్ బంద్ జయప్రదం చేయాలని ప్రచారం నిర్వహించారు. తెలంగాణ అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్టు కమిటీ అధ్యక్షురాలు పాలెం నాగమణి ప్రాజెక్టు కార్యదర్శి ఎం. విజయశీల ఆధ్వర్యంలో సిఐటియు సభ్యులు ఇంటింటి ప్రచారాన్ని నిర్వహిస్తూ నరేంద్ర మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను కరపత్రం ద్వారా ప్రజలకు వివరిస్తున్నారు. తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ సిఐటియు



ఆధ్వర్యంలో ఎంపీడీవోకి ఎంపీఓకి చర్ల మేజర్ గ్రామపంచాయతీ కార్యదర్శి వారికి సమ్మె నోటీసులు అందజేశారు. ఈ కార్యక్రమం సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు కే. బ్రహ్మాచారి మాట్లాడారు. ఈనెల 16న జరిగే సమ్మె కార్పొరేట్ అనుకూల మతోన్మాద కేంద్ర ప్రభుత్వ విధానాలకు పెద్ద తిరుగుబాటు అని దీనిలో అన్ని వర్గాల ప్రజలు శ్రామికులు పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో చర్ల మేజర్ గ్రామపంచాయతీ తాజా మాజీ వార్డు సభ్యులు దొడ్డి హరినాగ వర్మ, సిఐటి నాయకులు కృపాలు, పాండు, కల్లూరి నరసింహారావు, లక్ష్మి, చిలకమ్మ, కృష్ణవేణి, శమంతకమణి తదితరులు పాల్గొన్నారు.

పెరిగిన వాహనాల రద్దీ.. వాహనదారులు జర భద్రం

నవతెలంగాణ-పినపాక



మేడారం జాతర ప్రారంభమైన నేపథ్యంలో పినపాక మండలంలో వాహనాల రద్దీ విపరీతంగా పెరిగింది. ఈ నేపథ్యంలో మండలంలోని ప్రజలు, వాహనదారులు జాతర ముగిసే వరకు ప్రయాణాలు చేసేటప్పుడు జర జాగ్రత్తలు తీసుకోవడం వలన ప్రమాదాలు నివారించవచ్చు. మండలంలోని ప్రధాన రహదారులైన మణుగూరు - ఏటూరునాగారం, బయ్యారం- తాడ్వాయి రహదారుల గుండా భక్తులు మేడారం జాతరకు వెల్తుండటంతో ఆయా రహదారులపై వాహనాల రద్దీ పెరిగింది. గతంలో సాధారణంగా ఉండే రద్దీ ప్రస్తుతం విపరీతంగా పెరిగింది. జాతర సందర్భంగా బుధ, గురు, శని ఆదివారాల్లో ఈ రద్దీ మరింత ఎక్కువగా ఉంది. ఇప్పటికే మణుగూరు - ఏటూరునాగారం ప్రధాన రహదారిపై గుంతలు ఏర్పడిన చోట్ల రహదారికి మరమత్తులు చేయాలని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అధికారులను ఆదేశించగా, అధికారులు మరమ్మత్తు పనులు చేపట్టారు. మరోవైపు బయ్యారం - తాడ్వాయి రహదారిపై పినపాక, తోగ్గూడెం గ్రామాల వద్ద, మణుగూరు - ఏటూరునాగారం ప్రధాన రహదారిపై మూల మల్లారం వద్ద మూల మలుపులు ప్రమాదకరంగా ఉండటంతో ఏడూళ్ళ బయ్యారం సిఐ శివప్రసాద్, ఎస్సై వెంకటప్పయ్య ఆధ్వర్యంలో ప్రమాద సూచికలు, వేగ నియంత్రణ కోసం డ్రమ్ములు ఏర్పాటు చేశారు. రానున్న రోజుల్లో వాహనాల రద్దీ మరింత పెరిగే అవకాశం ఉండటంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. ప్రదానంగా బయ్యారం - తాడ్వాయి రహదారిపై భూపాలపట్నం, సీతంపేట, పినపాక, గోపాలరావుపెట, తోగ్గూడెం గ్రామాలలో అక్కడక్కడా రహదారి ఇరుకుగా ఉండటంతో పాటు సాయంత్రం సమయంలో ప్రజలు ఎక్కువగా రహదారిపైకి చేరుకోవడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. కావున జాతర ముగిసే వరకు పోలీసులు, అధికారులు రక్షణ చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

హోమియోపతి వైద్య శిబిరం

నవతెలంగాణ-దుమ్ముగూడెం

పర్ణశాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని సీతానగరం గ్రామంలో బుధవారం హెూమియోపతి వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. వైద్య శిబిరంలో హెూమియోపతి వైద్యాధికారి రాజేష్ బాబు ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్య శిబిరంలో హెూమియోపతి వైద్యం పట్ల అవగాహన కల్పించారు. హెూమియోపతి వైద్యం అన్ని రకాల వ్యాధులను నయం చేస్తుందన్నారు. వైద్య శిబిరంలో ఎస్ఎస్ ఓ మహబూబ్, ఆశ వర్కర్ స్వరూప తదితరులు పాల్గొన్నారు.

రేషన్ కార్డులు సత్వరమే విడుదల చేయాలి

నవతెలంగాణ-జూలూరుపాడు

రేషన్ కార్డులు లేకపోవడం వల్ల ఎందరో నిరుపేదలు సంక్షేమ పథకాలకు దూరం అవుతున్నారని, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సత్వరమే స్పందించి పెండింగ్‌లో ఉన్న రేషన్ కార్డులు, నూతన రేషన్ కార్డుల అన్‌లైన్ ప్రక్రియను చేపట్టాలని బీఎస్పీ మండల సీనియర్ నాయకులు తంబర్ల నరసింహారావు ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు బుధవారం జూలూరుపాడు మండల తహశీల్దార్ ను కలిసి, జూలూరుపాడు మండల వ్యాప్తంగా పెండింగ్లో ఉన్న రేషన్ కార్డులను విడుదల చేయాలని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అదే విధంగా ప్రతి రేషన్ కార్డుకు 14 రకాల నిత్యవసర వస్తువులను అందించాలని ఆయన తహశీల్దార్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో దేవరకొండ మనోహర్, పి. కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

కేటీపీఎస్ ఏడవదశలో కనకదుర్గ దేవాలయానికి భూమి పూజ

నవతెలంగాణ-పాల్వంచ



కొత్తగూడెం ధర్మ పవర్స్ స్టేషన్‌లోని కాల్ ప్లాంట్‌లో బుధవారం కనకదుర్గ దేవాలయం నిర్మాణానికి జెన్కో డైరెక్టర్ ధర్మల్ బి. లక్ష్మయ్య దంపతులచే భూమి పూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చీఫ్ ఇంజనీర్ పి. వెంకటేశ్వరరావు, ఎస్సీ గుర్రం రాజకుమార్, డిప్యూటీ సిసి ఏకె. నాగరాజు, అసిస్టెంట్ కమాండెంట్ పి. అప్పాజీ, డిఇఎస్ శేఖర్, బి. హరిలాల్, సిహెచ్. శ్రీనివాస్, ఎన్. రాంబాబు, ఎం. బలరాం, ఎం. అంగీలాల్ తదితరులు పాల్గొన్నారు.

బ్రిలియంట్ స్కూల్‌లో వసంత పంచమి వేడుకలు

నవతెలంగాణ-బూర్గంపాడు



మండలంలోని సారపాకలో గల బ్రిలియంట్ విద్యాసంస్థలలో బుధవారం సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం ఘనంగా నిర్వ హించారు. ముందుగా బ్రిలియంట్ విద్యాసంస్థల చైర్మెన్ బిఎస్ఆర్ దంపతులు వసంత పంచమి కార్యక్రమంలో భాగంగా సరస్వతీ అమ్మ వారి పుట్టినరోజు సందర్భంగా పాఠశాల ఆవరణలో ఉన్న సరస్వతి అమ్మవారికి పట్టు వస్త్రాలను మంగళ వాయిద్యములతో వేద పండితుల సమక్షంలో తీసుకొని వచ్చి అమ్మవారిని అలంకరించారు. ఈ అక్షరాభ్యాస కార్యక్రమంలో దాదా పు 30 మంది దంపతులు తమ చిన్నారులతో పాల్గొని పూజలు నిర్వహించారు. బ్రిలియంట్ విద్యాసం స్థల చైర్మెన్ బిఎస్ ఆర్, స్వర్ణకుమారి దంపతులచే అక్షరాభ్యాసాన్ని గావించారు. అక్షరా భ్యాసం చేయించుకున్న మహిళలకు బ్రిలియంట్ యాజమాన్యం తాంబూలం ఇచ్చి సత్కరించారు. ఈ కార్యక్రమంలో 200 మంది కిపైగా పాల్గొని తీర్థప్రసాదాలను స్వీకరించారు. పూజలో పాల్గొన్న భక్తులకు బ్రిలియంట్ యాజ మాన్యం వారు బాసర నుంచి తీసుకొని వచ్చిన కుంకుమను అందించారు. ఈ సందర్భంగావిద్యాసంస్థల చైర్మెన్ బిఎస్ ఆర్ మాట్లాడుతూ సరస్వతి అమ్మవారి పుట్టి నరోజును నిర్వహించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మెన్ బిఎస్ఆర్ దంపతులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఖమ్మం-భద్రాద్రి కొత్తగూడెం
గురువారం | ఫిబ్రవరి 15, 2024 | www.navatelangana.com

దుమ్ముగూడెం ఎంపీడీవోగా ఎం.చంద్రశేఖర్

నవతెలంగాణ- దుమ్ముగూడెం



దుమ్ముగూడెం మండల అభివృద్ధి అధికారిగా ఎం.చంద్రశేఖర్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. సాధారణ బదిలీల్లో భాగంగా కారేపల్లి మండల ఎంపీడీవో విధులు నిర్వహిస్తున్న చంద్రశేఖర్ బదిలీపై ఇక్కడికి వచ్చారు. పూర్తిస్థాయి బాధ్యతలు స్వీకరించిన ఎంపీడీవోను మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది సాదరంగా ఆహ్వానం పలికారు.

రహదారి పనులు ప్రారంభించిన ఎమ్మెల్యే తెల్లం

నవతెలంగాణ-దుమ్ముగూడెం

మండలంలోని ఎన్ఆర్ఈజీఎస్ నిధులు ద్వారా చేపట్టే గ్రావెల్ రహదారుల పనులను భద్రాచలం ఎమ్మెల్యే తెల్ల వెంకట్రావు బుధవారం ప్రారంభించారు. మారాయిగూడెం గ్రామపంచాయతీలో పత్తిపాక గ్రామంలో రూ.4 లక్షలతో నిర్మించే గ్రావెల్ రహదారితో పాటు, మారాయిగూడెం గ్రామంలో సమ్మక్క సారక్క గుడి అభివృద్ధికి రహదారి నిర్మాణ పనులను ఆయన కొబ్బరికాయకొట్టి ప్రారంభించారు. కొత్తపల్లి ఆశ్రమ పాఠశాల విద్యార్థుల విద్యా సామర్థ్యాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాలలో మొక్కలు నాటారు. అనంతరం కొత్తపల్లి గ్రామంలో ఎల్ఐసి మరియు దాతల ఆర్థికసాయంతో నిర్మించిన కమ్యూనిటీ హాలును ప్రారంభించారు. ఈకార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి కణితి రాముడు, ఎంపీటీసీ పూసం ధర్మరాజు, మాజీ సర్పంచ్ రేసు వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షులు అప్పకా వీర్రాజు పాల్గొన్నారు.

గొలుసు లాక్కెళ్లిన దొంగ

నవతెలంగాణ-లక్ష్మీదేవి పల్లి

మండలంలోని శ్రీనగర్ కాలనీ 5వ లైన్‌లో నివాసం ఉంటున్న శారద బుధవారం ఉదయం 6 గంటలకు ఇంటిముందు వాకిళ్లను శుభ్రం చేస్తుండగా... గుర్తుతెలియని ఓ దొంగ మహిళ మెడలో ఉన్న మూడు తులాల బంగార గొలుసును లాకెళ్లి పరారయ్యాడు. ఈ సంఘటనను చూసి మరో వ్యక్తి ఆ దొంగను పట్టుకునేందుకు ప్రయత్నించినా దొంగ దొరకలేదు. ముర్రేడు వాగు వైపుగా పరాడయ్యాడని బాధితురాలు తెలిపారు. ఈ విషయమై లక్ష్మీదేవి పల్లి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

3 నుంచి పోలియో చుక్కలు : జిల్లా వైద్యధికారి శిరీష

నవతెలంగాణ-పాల్వంచ

మార్చ్ 3 నుంచి అప్పుడే ఐదు సంవత్సరాలలోపు పిల్లలకి పోలియో చుక్కలు వేయనున్నట్లు జిల్లా వైద్యధికారి డాక్టర్ శిరీష తెలిపారు. బుధవారం పాల్వంచ గ్రాండ్ వజ్రా జిల్లా వైద్యధికారి డాక్టర్ జి వి ఎల్ శిరీష అధ్యక్షతన డాక్టర్ ప్రశాంత్ డబ్ల్యూహెచ్ఓ సర్వేలన్స్ వైద్యాధికారి, డాక్టర్ బాలాజీ డాక్టర్ వీరబాబు పిల్లల వైద్య నిపుణులు పాల్గొన్నారు. బస్సు స్టాండ్, రైల్వే స్టేషన్ లలో మార్చి 3 పోలియో కేంద్రాలు ప్రారంభిస్తామనిచెప్పారు. పోలియో కార్యక్రమానికి తగినంత వ్యాక్సిన్, ఇతర సామాగ్రి సిద్ధం చేసుకోవలసిందిగా చెప్పినారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కళ్ళజోళ్ళు పంపిణీ



మణుగూరు : లయన్స్ క్లబ్ ఆఫ్ మణుగూరు ఆధ్వర్యంలో బుధవారం ప్రెసిడెంట్ గాజుల పూర్ణ చందర్ రావు పుట్టినరోజు సందర్భంగా చార్టర్ ప్రెసిడెంట్ పిల్లర్ శెట్టి హరిబాబు చేతుల మీదుగా ఉచిత కళ్ళజోళ్ల పంపిణీ చేశామని అధ్యక్షుడు తెలిపారు. గత నెలలో పగిడేరు గ్రామంలో మాజీ సర్పంచ్ తాటి భిక్షం సూచన మేరకు కంటి పరీక్షలు నిర్వహించారు. డా.సంజీవ రావు మొత్తం 92 మందికి పరీక్షలు నిర్వహించగా వారిలో 25 మందికి కళ్ళజోడు అవసరం ఉందని చెప్పడం వలన హైదరాబాద్ నుండి టెస్ట్ చేసిన కళ్ళ జోళ్ళు తెప్పించి మాజీ సర్పంచ్ సమక్షంలో లబ్ధి దారులకు, చాటర్ ప్రెసిడెంట్ హరిబాబు ద్వారా ఇచ్చారు. ఈకార్యక్రమంలో ప్రెసిడెంట్ గాజుల పూర్ణ చందర్ రావు, పిల్లారి శెట్టిహరిబాబు, సెక్రటరీ మీరాహుస్సన్, పిఆర్సి గాజుల రమేష్ కుమార్, చింతపల్లి రాంబాబు, అడబాల నాగేశ్వరావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నూతన ఎంపీడీవోగా ధన్ సింగ్ బాధ్యతల స్వీకరణ

నవతెలంగాణ-ఇల్లందు



ఇల్లందు ఎంపీడీవోగా కె.ధన్ సింగ్ బుధవారం కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. మరిపెడ బంగ్లా మహబాద్ జిల్లా నుండి ఇక్కడికి బదిలీపై వచ్చారు. 8నెలల క్రితం ఎంపీడీఓగా విధులు నిర్వహించిన బాలరాజు నెల్లికుదురు మండల పరిషత్తుకు బదిలీపై వెళ్ళారు.

కార్యదర్శులు విధులు సక్రమంగా నిర్వహించాలి

- ప్రత్యేక సమావేశంలో యంపీడీఓ ధన్ సింగ్

నవతెలంగాణ-ఇల్లందు

బాధ్యతల స్వీకరణ అనంతరం ఎంపీడీవో ధన్ సింగ్ బుధవారం పంచాయతీ కార్యదర్శులు, మండల పరిషత్ అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. పరిచయ కార్యక్రమాన్ని నిర్వహించారు. మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులు, ప్రభుత్వ పథకాలు, ఆరు గ్యారెంటీలు, పంచాయతీలలో ప్రత్యేక అధికారులతో కలిసి నిర్వహిస్తున్న వివిధ కార్యక్రమాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ విధి నిర్వహణలో పంచాయతీ కార్యదర్శులు అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. హలో సత్యం గ్రహించిన నిర్లక్ష్యం చేసిన బాధ్యులవుతారని అన్నారు. ఈ సమావేశంలో మండల పంచాయతీ అధికారి చిరంజీవి, సూపరిండెంట్ శ్రీకాంత్, సిబ్బంది పాల్గొన్నారు.

పీఏసీఎస్ వైస్ చైర్మన్ పదవికి బండారి శ్రీనివాస్ రాజీనామా

- అవిశ్వాస తీర్మానం ఎదుర్కొనలేక...?

నవతెలంగాణ-ఇల్లందు



ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార సంఘం (పీఏసీఎస్) వైస్ చైర్మన్, బీఆర్ఎస్ నేత బండారి శ్రీనివాస్ తన పదవికి బుధవారం రాజీనామా చేశారు. రాజీనామా పత్రాన్ని జిల్లా సహకార సంఘం అధికారులకు, ఇల్లందు పిఏసిఎస్ చైర్మన్, సీఈవో కు అందజేశారు. వ్యక్తి గత కారణాలతోనే తను వైస్ చైర్మన్ పదవికి రాజీనామా చేసినట్లు శ్రీనివాస్ ప్రకటించారు. పిఏసిఎస్ డైరెక్టర్ గా రైతులకు అందుబాటులో ఉంటూ సేవలు అందిస్తానని ఆయన తెలిపారు. ఇది ఇలా ఉండగా గత రెండు రోజుల క్రితం పిఏసిఎస్ వైస్ వైస్ చైర్మన్ బండారి శ్రీనివాస్ పై కాంగ్రెస్ చెందిన పిఏసిఎస్ వైస్ చైర్మన్, డైరెక్టర్లు, అవిశ్వాసం నోటీస్ ఇవ్వడంతో, అవిశ్వాసంకు ముందే రాజీనామా చేయడం తో రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్ గా మారింది

ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్‌ని కలిసిన వైరా మున్సిపాలిటీ కమిషనర్ వేణు

నవతెలంగాణ-వైరా



వైరా మున్సిపాలిటీ నూతన కమిషనర్ గా బుధవారం బాధ్యతలు చేపట్టిన సీహెచ్ వేణు ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ ను ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మర్యాద పూర్వకముగా కలిసి పుష్పగుచ్చం అందిచారు. గత మూడు నెలలు గా వైరా మునిసిపాలిటీ కి కమీషనర్ లేక పరిపాలన లో పురోగతి లేకుండా పోయింది. గతం లో కమీషనర్ గా ఉన్న పతాని వెంకటేశ్వర్లు అసెంబ్లీ ఎన్నికల నిర్వహణ లో నిర్లక్ష్యంగా వ్యవహరించారని జిల్లా కలెక్టర్ విపీ గౌతం సెలవు పెట్టి వెళ్లాలని ఆదేశించడం అప్పటి నుండి కమీషనర్ పోస్ట్ ఖాళీగా ఉన్నది.

రూ.175తో ఒకరోజు గడపటం గౌరవ మోడీకి సాధ్యమేనా..?



- **ప్రధానమంత్రికి సీఐటీయూ జిల్లా కార్యదర్శి సూటి ప్రశ్న**

నవతెలంగాణ-భద్రాచలం రూరల్

గత పది సంవత్సరాలుగా కేంద్రంలో అధికారంలో ఉన్న నరేంద్ర మోడీ ప్రభుత్వం కష్టపడి పని చేస్తూ, సంపద సృష్టిస్తున్న కార్మికుడికి రోజుకీ రూ. 175/- ఉంటే చాలని పార్లమెంట్ సాక్షిగా చెప్పారని, వీటితో బతకడం ఎలా సాధ్యమని ప్రధాని మోడీని సూటిగా సిఐటియు జిల్లా కార్యదర్శి ఎ.జె.రమేష్ ప్రశ్నించారు. భద్రాచలం పట్టణంలో గ్రామ పంచాయతీ, హమాలీ కార్మికులతో ఫిబ్రవరి 16 సమ్మె స్ట్రీట్ కార్నర్ మీటింగ్ జరిగింది. ఈ సందర్భంగా ఎ.జె.రమేష్ మాట్లాడుతూ. మోడీ అధికారంలోకి రాక ముందు వంద రోజుల్లో ధరలు తగ్గిస్తామని, సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని, విదేశాల్లో స్విస్ బ్యాంకుల్లో ఉన్న నల్లధనాన్ని వెనక్కి తెచ్చి ఒక్కొక్కరి అకౌంట్ లో పదిహేను లక్షల రూపాయలను వేస్తామని తదితర హామీలను నరేంద్ర మోడీ ఇచ్చారని అన్నారు. ఈ హామీలకు దిక్కే లేదని అన్నారు. అనేక పోరాటాల,కార్మికుల అమరత్వం వల్ల వచ్చిన 29 కార్మిక చట్టాలను రద్దు చేసి, ఆ స్థానంలో నాలుగు లేబర్ కోడ్ లను తెచ్చి, కార్మికుల భవిష్యత్ యాజమా న్యాలకు, పెట్టుబడిదారులకు తాకట్టు పెట్టి వెట్టి చాకిరీ చేసే బానిసలుగా మారుస్తున్నారని విమర్శించారు. ఈ సందర్భంగా సమస్యలతో ప్రధానమంత్రి కి ఇచ్చే వినతిపత్రంపై కార్మికులు సంతకాలు చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి యం.బి.నర్సారెడ్డి, సీనియర్ నాయకులు యర్రంశెట్టి వెంకట రామారావు, అర్జున్, నరసింహారావు, శ్రీనివాస్, సాయి, సర్వేశ్వర రావు, వరదరాజు తదితరులు పాల్గొన్నారు.

టేకులపల్లి : ఢిల్లీలో రైతుల జరిగిన దాడిని ఖండించాలని ఎస్‌కేఎం జిల్లా కన్వీనర్లు బానోత్ ఊక్ల, రేపాకుల శ్రీనివాస్‌లు పిలుపునిచ్చారు. బుధవారం టేకులపల్లి ఎంపీడీవో కార్యాలయం వద్ద ఎస్‌కేఎం ఆద్వర్యంలో నిరసన తెలిపారు. కార్మికులు,యావత్తు దేశం అంతటా ఫిబ్రవరి16న జరిగే గ్రామీణ భారత బంద్ జయప్రదం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు ధర్మపురి వీరబ్రహ్మాచారి, కల్తీ వెంకటేశ్వర్లు, ఈసం నర్సింహారావు, గుగులోత్ రాంచందర్, జర్పుల సుందర్, ఎర్రయ్య, పాల్గొన్నారు.

సుజాతనగర్ : ఈనెల 16న జరిగే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సిపిఎం, సిపిఐ మండల కార్యదర్శులు వీర్ల రమేష్, భూక్య దసురు పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక సిపిఎం పార్టీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) మండల కమిటీ సభ్యులు ఐచ్చలి కూర శ్రీను, గండమల భాస్కర్, చప్పిడి వెంకటేశ్వర్లు, సిపిఐ జిల్లా సమితి సభ్యులు జక్కుల రాములు, కోమారి హనుమంతరావు, వేల్పుల భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఇల్లందు : కేంద్ర బిజెపి ప్రభుత్వం కార్మిక కర్షక ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న నేపథ్యంలో దేశవ్యాప్తంగా ఫిబ్రవరి 16న గ్రామీణ బంధు,కార్మిక సమ్మె సందర్భంగా ఇల్లందులోనూ బంద్ జయప్రదం చేయాలని సిపిఎం మండల కార్యదర్శి అబ్దుల్ నబీ ప్రజలను వ్యాపారులను కోరారు. స్థానిక ఏలూరి భవన్ కార్యాలయంలో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తాళ్లూరి కృష్ణ, ఆలేటి కిరణ్, మన్యం మోహన్ రావు పాల్గొన్నారు.

బంద్ కు వామపక్ష, విప్లవ విద్యార్థి సంఘాల మద్దతు

16 నిర్వహించే బందులో విద్యార్థి సంఘాలు పూర్తి మద్దతు తెలుపుతున్నాయని వామపక్ష, విప్లవ విద్యార్థి సంఘాల నేతలు పేర్కొన్నారు. స్థానిక ఏఐఎస్ఎఫ్ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విద్యార్థి సంఘాల రౌండ్ టేబుల్ సమావేశంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు అభిమన్యు, ఏఐఎస్ఎఫ్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ హరీష్ గౌడ్, పిడిఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు సాంబ, డివిజన్ నాయకులు నరేందర్ పాల్గొన్నారు.

కుంజా కృష్ణకుమారి కుటుంబాన్ని పరామర్శించిన పోతినేని

- **ప్రజా సేవకు తన జీవితాన్ని అంకితం చేసిన గొప్ప నాయకురాలు కృష్ణకుమారి**

నవతెలంగాణ-మణుగూరు



ప్రజాసేవకు తన జీవితాన్ని అంకితం చేసిన కామ్రేడ్ కుంజా కృష్ణకుమారి గొప్ప నాయకురాలని భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్ట్) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్ రావు కొనియాడారు. బుధవారం కుంజా కృష్ణకుమారి కుటుంబాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు సంతాప సానుభూతి తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత శనివారం అనారోగ్యంతో మృతి చెందిన కృష్ణకుమారి కుటుంబాన్ని గొప్ప ఉద్యమ నాయకురాలు ఉన్నారు. మాజీ సర్పంచ్ గా రెండుసార్లు ఎంపీటీసీగా గెలిసి ప్రజా సమస్యలను పరిష్కరించడంలో ముందుండేవారని అన్నారు. ఎంపీటీసీ సర్పంచ్‌గా ప్రజాసేవకి అంకితమై గొప్ప నాయకురాలు అని సిపిఎం పినపాక డివిజన్ కార్యదర్శి వర్గ సభ్యురాలుగా ఐద్వా జిల్లా నాయకురాలుగా ప్రజా సేవలో సిపిఎం ఇచ్చే పిలుపులో క్రియాశీలక ఉద్యమాల్లో ప్రజా పోరాటాలకు నాంది పలికిందన్నారు. చిన్న వయసులో కృష్ణ కుమారి చనిపోవడం వారి కుటుంబానికి పార్టీకి తీరని లోటని. తన చేసిన సేవ ప్రజల కోసం పడిన తపన పోరాటం మరవరానిదన్నారు. పార్టీ జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య మాట్లాడుతూ ఎర్రజెండాకి పగిడేరు గ్రామానికి విడదీయరాన్ని బంధం అని అన్నారు. ఆ ఎర్రజెండా నిలుపుట కోసం ఎన్నో త్యాగాలు చేసిన చరిత్ర ఈ కుటుంబానికి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు మచ్చ వెంకటేశ్వర్లు, సీనియర్ నాయకులు నెల్లూరి నాగేశ్వరరావు, మండల కార్యదర్శి కొడిశాల రాములు కృష్ణ కుమారి, కుటుంబ సభ్యులు. కుంజ బాబురావు రాజా, సిపిఎం మండల కార్యదర్శి వర్గ సభ్యులు సత్ర పల్లి సాంబశివరావు, కమిటీ సభ్యులు రామగిరి రవీందర్, పగిడేరు శాఖ కార్యదర్శి పర్షిక పాపారావు, శాంతినగర్ కార్యదర్శి తాళ్లపల్లి యాదగిరి గౌడ్, కుంజరాజు నరసింహారావు, పాల్గొన్నారు.

16న బంద్‌కు సహకారం అందించండి



- **నగరంలోని ఇతర రాష్ట్రాల వ్యాపారస్తులు బంద్ కు మద్దతు ఇవ్వాలి : వై.విక్రమ్**

నవతెలంగాణ-ఖమ్మం

బిజెపి ప్రభుత్వ వినాశకర విధానాలకు వ్యతిరేకంగా శుక్రవారం దేశవ్యాప్తంగా సమ్మెతో పాటు బంద్ జరగబోతుందని, బంద్ కు అన్ని వర్గాల ప్రజలు సహకారం అందించాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వై విక్రమ్ కోరారు. బుధవారం ఖమ్మంలోని రేవతి సెంటర్ రిలయన్స్ మాల్ కు బంద్ నోటీస్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడోవ సారి బిజెపి అధికారంలోకి వస్తే దేశంలో ప్రజలు భయంకరమైన పరిస్థితులు ఎదుర్కొంటారని ఆందోళన వ్యక్తం చేశారు. దేశంలో అన్ని రంగాలను ప్రయివేటీకరణ చేసి ఆదానీ, అంబానీకు దేశాన్ని అమ్ముతున్నారని ఆరోపించారు. కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వడం లేదని, నిరుద్యోగం పెరిగి దేశంలో అసమానతలు పెరిగాయని ఆరోపించారు. పెట్రోల్,డీజిల్, గ్యాస్ ధరలు తగ్గాలంటే మోడీ దిగి పోవాలని తెలిపారు. మోడీ అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా బందు కు అన్ని వర్గాల ప్రజలు, వ్యాపార రంగాలు వారు సహకారం ఇవ్వాలని కోరారు. ముఖ్యంగా ఖమ్మం నగరంలో మార్వాడీలు, రాజస్థానీలు ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి ఖమ్మం నగరంలో వ్యాపారం చేస్తున్న చిన్న, పెద్ద వ్యాపారస్తులు బంద్ కు పూర్తి సహకారం ఇవ్వాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ టూ టౌన్ కార్యదర్శి బోడపట్ల సుదర్శన్, సిహెచ్ భద్రం, నారపోగు నాగేశ్వరరావు, మల్లికార్జున్ రెడ్డి, గుమ్మడి బిక్షం తదితరులు పాల్గొన్నారు.

16 న జరిగే భారత గ్రామీణ బందును విజయవంతం చేయండి

నవతెలంగాణ - బోనకల్

ఈనెల 16న జరిగే భారత గ్రామీణ బంద్ ను జయప్రదం చేయాలని సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా నాయకులు ముత్తారపు గిరి కోరారు. మండల పరిధిలోని లక్ష్మీపురం గ్రామంలో బుధవారం ఆ పార్టీ కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ 16 న గ్రామీణ భారత బందును నిర్వహిస్తున్నట్లు తెలిపారు. హర్యానా, మధ్యప్రదేశ్, రాజస్థాన్, పంజాబ్ రాష్ట్రాల నుండి వేలాదికమంది రైతులు ఢిల్లీ కేంద్రానికి వస్తున్న సందర్భంగా కేంద్ర ప్రభుత్వం రైతులపై లాఠీచార్జి, వాటర్ క్యానలతో టియర్ గ్యాస్ తో రైతులపై పెద్ద ఎత్తున దాడి చేయటాన్ని తీవ్రంగా ఖండించారు. రైతు సంఘాలతో చర్చలు జరిపి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

తిరుమలాయపాలెం: ఫిబ్రవరి 16వ తేదీన సార్వత్రిక సమ్మెను గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయాలని కోరుతూ తిరుమలయపాలెంలో ప్రభుత్వ కార్యాలయంలో ప్రధాన వీధులలో కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు యర్రా శ్రీనివాసరావు, సిపిఎం మండల కార్యదర్శి కొమ్ము శ్రీను, వ్యవసాయ కార్మిక సంఘం తిరుమల పాలెం మండల అధ్యక్ష కార్యదర్శులు నేర్పుల వెంకటేష్, అంగిరేకుల నరసయ్య, కొమ్ము వెంకన్న, కొమ్ము నాగేశ్వరరావు, సీఐటియు కార్యదర్శి వశ పొంగు వీరన్న. తదితరులు పాల్గొన్నారు.

ఖమ్మం : ఖమ్మంలోని ఏఐటియుసి జిల్లా కార్యాలయంలో బంద్ కరపత్రం పోస్టర్ ఆవిష్కరించారు. ఏఐటియుసి యూనియన్ జిల్లా కార్యదర్శి జిల్లా పేర బోయిన మోహన్ రావు అధ్యక్షతన ట్రాన్స్పోర్ట్ యూనియన్ జెఏసి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో సిఐటియు జిల్లా కార్యదర్శి జిల్లా ఉపేందర్, ఐఎన్టియుసి జిల్లా అధ్యక్షులు విప్లవ్ కుమార్, బిఆర్‌టియు జిల్లా అధ్యక్షులు పాల్వంచ కృష్ణ, ఐఎఫ్‌టియు జిల్లా కార్యదర్శి లక్ష్మీనారాయణ, టిఎన్టిసి జిల్లా నాయకులు రవీందర్, టిఎంటిడియు గోకర నాగేశ్వరావు మాట్లాడారు. అదేవిధంగా రవాణా వారోత్సవాలు సందర్భంగా ఖమ్మం జిల్లా రవాణా శాఖ అధికారి ఎండి గౌస్ పాషా మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ ఏ వరప్రసాద్ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో యూనియన్ నాయకులు రోడ్డు భద్రత గురించి మాట్లాడారు.

వైరాటౌన్ : ఫిబ్రవరి 16న దేశవ్యాప్త కార్మికుల సమ్మె, రైతులు బంద్ సందర్భంగా వైరా పట్టణంలో అని వర్గాలు ప్రజలు స్వచ్ఛందంగా బంద్ కు సహకరించాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు కోరారు. బుధవారం వైరాలో సిఐటియు ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో బొంతు రాంబాబు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు తోట నాగేశ్వరరావు, మిషన్ భగీరథ కాంట్రాక్టు కార్మికుల సంఘం జిల్లా కార్యదర్శి పాపగంటి రాంబాబు, నూకల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఢిల్లీ రైతులపై బీజేపి ప్రభుత్వ దాడిని ఖండిస్తూ..

కాంగ్రెస్, వామపక్షాలు, విప్లవ పార్టీల ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం

నవతెలంగాణ-ఇల్లందు



ఢిల్లీలో రైతుల దాడిని ఖండిస్తూ మోడీ ప్రభుత్వ చర్యలను వ్యతిరేకిస్తూ బుధవారం కాంగ్రెస్, వామపక్షాలు, విప్లవ పార్టీలు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం మోడీ ప్రభుత్వ దిష్టిబొమ్మను బుగ్గవాగు సమీపంలోని భగత్ సింగ్ సెంటర్లో దహనం చేశారు. అనంతరం జరిగిన మీటింగ్లో ఐఎఫ్టీయు జిల్లా ప్రధాన కార్యదర్శి సారంగపాణి అధ్యక్షత వహించగా ఎన్డి న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకులు ఆవునూరి మధు, సీపీఐ(ఎం) జిల్లా నాయకులు ఎస్ఏ నబి,కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు దొడ్డ డానియల్, సిపిఐ పట్టణ కార్యదర్శి బంధం నాగయ్య, ఎన్డి చంద్రన్న వర్గం పట్టణ కార్యదర్శి బానోత్ రామ్ సింగ్,ప్రజా పంథా రైతు సంఘం జిల్లా నాయకులు బుర్ర వెంకన్న మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పార్టీలు , ప్రజా సంఘాల నాయకులు తాళ్లూరి కృష్ణ పాల్గొన్నారు.

పది పరీక్షల రికార్డుల పరిశీలన

దుమ్ముగూడెం : త్వరలో జరగనున్న పదవ తరగతి పరీక్షలకు విద్యార్థులను, ఉపాధ్యాయులను సంసిద్ధులను చేసేందుకుగాను ఉపాధ్యాయ బృందం బుధవారం అంతర్గత మూల్యాంకన రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ బృందం దుమ్ముగూడెం, పర్ణశాల జిల్లా పరిషత్ హై స్కూల్ తో పాటు, ఆర్లగుడెం, కే.రేగుబల్లి 1 ఆశ్రమ పాఠశాలలను పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించి ఉపాధ్యాయులకు తగు సూచనలు చేశారు. బృంద నాయకులుగా పీజీహెచ్ఎంలు బి.వెంకటేశ్వర్లు, మడకం మోతీరు వ్యవహరించగా ఆయా పాఠశాలల కు చెందిన ప్రధానోపాధ్యాయులు, పాల్గొన్నారు.

రెజోనెన్స్ చిన్నారులకు అక్షరాభ్యాసం

నవతెలంగాణ-ఖమ్మం

ఖమ్మం శ్రీనివాసనగర్ లో రెజోనెన్స్ పాఠశాలలో వైభంగా సరస్వతి పూజ (వసంత పంచమి) వేడుక, నూతన విద్యార్థినీ విద్యార్థులు చిన్నారులకు అక్షరాభ్యాసం చేశారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ ఆర్.వి. నాగేంద్రకుమార్, డైరెక్టర్ నీలిమా పాఠశాలకు నూతనంగా వస్తున్న చిన్నారులతో అక్షరాభ్యాస కార్యక్రమాన్ని చేయించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుల సంధ్య, పాఠశాల ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

టేకులపల్లి మండలంలో పలువురు అధికారులు జాయినింగ్

నవతెలంగాణ- టేకులపల్లి



మండలంలోని పలు కార్యాలయంలో అధికారులు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. డోర్నకల్ మండలంలో తహశీల్దార్‌గా పనిచేస్తూ బదిలీపై వచ్చి టేకులపల్లి తహసీల్దారుగా ఎన్. నాగ భవానీ, కేసముద్రం మండలంలో ఎంపీడీవోగా పని చేస్తూ బదిలీపై వచ్చి టేకులపల్లి ఎంపీడీవోగా జి రవీంద్రరావు, టేకులపల్లి సిఐగా తాటి పాముల సురేష్, టేకులపల్లి ఎస్ఐగా షేక్ సైదా రవూఫ్, బోడు ఎస్ఐగా పి.శ్రీకాంత్ లు పదవి బాధ్యతలు చేపట్టినట్లు తెలిపారు. మండల ప్రజలకు తమ కార్యాలయంలో ఏ పని ఉన్నా స్వయంగా వచ్చి కలవచ్చునని తెలిపారు.

చిన్నారి వైద్యానికి మిత్రుల చేయూత

నవతెలంగాణ-అశ్వాపురం

మండలంలోని తురుముల గూడెం తండా గ్రామానికి చెందిన తేజావత్ శంకర్ కుమార్తె హరిణి గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. నిరుపేద కుటుంబం కావడం కుమార్తె వైద్యానికి ఆర్థిక ఇబ్బందులు పడుతూ దాతల సహకారం కోరుతున్నారు. ఈ క్రమంలో తన చిన్ననాటి మిత్రుడు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ ఆఫీసు ఐటీసెల్ నందు కానిస్టేబుల్ గా విధులు నిర్వహిస్తున్న విజయ్ తన మిత్రుల సహాయంతో రూ. 27 వేల 5 వందలు సేకరించి వైద్య ఖర్చు నిమిత్తం బుధవారం అతని కుటుంబానికి అందజేశారు.

దమ్మపేట ఎంపీడీఓగా బి.రవీంద్రరెడ్డి

నవతెలంగాణ-దమ్మపేట



దమ్మపేట నూతన ఎంపీడీఓగా రవీంద్ర రెడ్డి బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. రవీంద్రరెడ్డి గతంలో ఖమ్మం రూరల్ ఎంపిడిఓగా పనిచేయగా ప్రభుత్వ బదిలీల్లో భాగంగా దమ్మపేటకు ఆయన కేటాయించబడ్డారు. ఈ మేరకు బాధ్యతలు స్వీకరించిన అనంతరం రవీంద్రరెడ్డి మాట్లాడుతూ నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని, విధుల్లో ఎటువంటి అలసత్వం లేకుండా తన పని తాను చేసుకుంటానని తెలిపారు.

కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం

నవతెలంగాణ-దమ్మపేట

ఢిల్లీ రైతులపై నరేంద్రమోడి ప్రభుత్వం లాఠీచార్జీ చేయడాన్ని నిరశిస్తూ ఎఐకెఎంఎస్ ఆధ్వర్యంలో మండల పరిధిలోని గండుగులపల్లి ప్రధాన సెంటర్‌లో నిరసన కార్యక్రమం నిర్వహించి కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు అమర్లపూడి రాము, బండి ఆదినారాయణ, బొంత కుమార్, కేసరి వెంకటేష్, తాటి బాలాజీ, మీడియం భద్రం, కొమరం రాధ, సోడే శివరామరాజు, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

భరతమాత ఒడిలో నిద్దరోతున్న అమరవీరులకు జోహార్లు

-చామర్తి గోపిశాస్త్రి

నవతెలంగాణ-దమ్మపేట

ఐదేళ్ళ క్రితే ఇదేరోజున భారతావని ఉలిక్కిపడేలా జమ్మూ శ్రీనగర్ జాతీయ రహదారిలో భారతీయ సైనికులను తీసుకువెళ్తున్న వాహనాల కాన్వాయ్ మీద కారుతో ఆత్మాహుతి బాంబు దాడి జరిగిందని ఈ దాడిలో వీరమరణం పొందిన అమవీరులకు జోహార్లు అని యువజన కాంగ్రెస్ నాయకులు చామర్తి గోపిశాస్త్రి నివాళులు అర్పించారు. ఈ దాడితో ఎందరో సైనికుల కుటుంబాల్లో రోదనలు మిన్నంటగా 40 మంది సైనికులు వీర మరణం పొందారని ఈ ఘటన జరిగిన ఐదేళ్ళు కావస్తుండగా ఆ నాటి సైనికుల ప్రాణత్యాగాలకు గుర్తుగా భారత ప్రభుత్వం ఫిబ్రవరి 14ను బ్లాక్‌డేగా ప్రకటించిందన్నారు. పుల్వామ ఉగ్రదాడిలో అమరులై భరత మాత ఒడిలో నిద్దర పోతున్న అమవీరులకు అశ్రునయనాలతో నివాళులు అర్పిస్తున్నట్లు తెలిపారు. తమ రక్తంతో భరతమాత నుదిటిన తిలకం దిద్దిన అమర వీరులకు యావత్ భారతదేశం జోహార్లు అర్పిస్తుందన్నారు.

ఆల్ ఇండియా దళిత్ యూత్ కన్వెన్షన్ పోస్టర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-మధిర

భారత ప్రజాతంత్ర యువజన సమైఖ్య (డీవైఎఫ్ఐ) ఆల్ ఇండియా దళిత్ యూత్ కన్వెన్షన్ ఫిబ్రవరి 18న చండీగఢ్ లో జరుగుతాయని, ఈ కన్వెన్షన్ కు జిల్లా అధ్యక్షులు, రాష్ట కమిటీ సభ్యులు మద్దాల ప్రభాకర్ హాజరవుతున్నారని టౌన్ అధ్యక్షుడు పల్లపు గోపి బుధవారం తెలిపారు. బుధవారం వాల్ పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు గోగుల, చైతన్య, గద్దల శివ, గద్దల కార్తీక్, సంపత్ పాల్గొన్నారు.

వైరా ఎంపీడీఓగా బాధ్యతలు స్వీకరించిన సరస్వతి

నవతెలంగాణ-వైరా



రాష్ట్ర వ్యాపితంగా ఎంపిడిఓ ల బదిలీల లో బాగంగా వైరా ఎంపిడిఓగా మహబూబాబాద్ జిల్లా కొరివి మండల ఎంపిడిఓగా పనిచేస్తున్న పి.సరస్వతి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. త్వరలో జరగనున్న పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా ప్రస్తుతం పనిచేస్తున్న అధికారులను బదిలీ చేయటం పరిపాటి. వైరా ఎంపిడిఓ / మునిసిపల్ కమీషనర్ గా ఇంకా అడిషనల్ బాధ్యతలు నిర్వహిస్తూ బదిలీ అయిన ఎంపిడిఓ డి.కరుణాకర్ రెడ్డి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలూరుపాడు ఎంపిడిఓ గా వెళ్లారు.

ముగిసిన డాక్టర్ మల్లు వెంకటేశ్వర్లు అంత్యక్రియలు

- **సోదరుడి పాడే మోసిన మల్లు భట్టి విక్రమార్క, మల్లు రవి**

నవతెలంగాణ-వైరాటౌన్



వైరా మండలం స్నానాల లక్ష్మీపురం గ్రామంలో డాక్టర్ మల్లు వెంకటేశ్వర్లు అంత్యక్రియలు గ్రామ సమీపంలోని మామిడి తోటలో మల్లు ఘాట్ నందు నిర్వహించారు. బుధవారం ముగిసాయి. తెలంగాణ రాష్ట్ర డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, తెలంగాణ రాష్ట్ర అధికార ప్రతినిధి మల్లు రవి తమ సోదరుడు డాక్టర్ మల్లు వెంకటేశ్వర్లు పార్థివ దేహం పాడేను మోశారు. మల్లు వెంకటేశ్వర్లు పార్థివ దేహానికి డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, నందిని దంపతులు, జిల్లా కలెక్టర్ గౌతం, వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్, పలు రాజకీయ పార్టీల నాయకులు, అధికారులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి సంభాని చంద్రశేఖర్, మాజీ ఎంపీలు రాజయ్య, పోరిక బలరాం నాయక్, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ పొట్ల నాగేశ్వరరావు, పలువురు రాజకీయ ప్రముఖులు, అధికారులు పాల్గొన్నారు.

హౌస్ కీపింగ్ సర్వీసెస్ వర్క్ కోసం టెండర్లు ఆహ్వానం

నవతెలంగాణ-ఖమ్మం

కలెక్టర్ కార్యాలయంలో 2024-25 సంవత్సరానికి హౌస్ కీపింగ్ సర్వీసెస్ వర్క్ కోసం టెండర్లను ఆహ్వానిస్తున్నట్లు అదనపు కలెక్టర్ డి. మధుసూదన్ నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. టెండర్లు వేయదలచినవారు. https://tender.telangana.gov.inలో లాగిన్ అయి ఇ-టెండర్ వెబ్ సైట్లో తమ టెండర్ నమోదు చేయవసినదిగా అదనపు కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

దివ్యాంగురాలకి ఆర్థిక సహాయం

నవతెలంగాణ-ఇల్లందు



పట్టణంలోని స్థానిక జగదాంబ సెంటర్ సాయిబాబా గుడి వద్ద నివాసం ఉంటున్న దివ్యాంగురాలు షాహిన్‌కు ఎన్పిఆర్డి దివ్యాంగుల సంఘం ఆధ్వర్యంలో బుధవారం రూ. 3,500 ఆర్థిక సహాయం అందించారు. ఇటీవల షాహిన్ రోడ్డు ప్రమాదానికి గురై కాలుకు ఫ్రాక్చర్ కావడంతో చికిత్స పొందుతోంది. విషయం తెలుసుకున్న కమిటీ తగు ఆర్థిక సాయం అందించింది. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్ష కార్యదర్శులు తాళ్ల ప్రతాప్, చెలిమల్ల రాజేందర్, ఉపాధ్యక్షులు రామోజీ ఈశ్వర్, శివాజీ పాల్గొన్నారు.

సమ్మిళిత అభివృద్ధి జరగాలి

(మొదటిపేజీ తరువాయి)

చెప్పారు. బుధవారం శాసనమండలిలో బడ్జెట్‌పై చర్చ సందర్భంగా ఆయన మాట్లాడారు. మేడిగడ్డను సందర్శించాననీ, ఆ బ్యారేజి వ్యవహారం గుర్తు చేసుకుంటే చాలా బాధేసిందని అన్నారు. సాంకేతిక పరిజ్ఞానం ఎంతో పెరిగిందనీ, కొండలు, గుట్టలు, సముద్రాలలోనూ డ్యాములు తదితర నిర్మాణాలు జరుగుతున్నాయని గుర్తు చేశారు. ఇన్ని వేల కోట్లు ఖర్చు పెట్టి ఇంత నాసిరకంగా ఎలా నిర్మాణం చేశారో అర్థం కావటం లేదన్నారు. మేడిగడ్డలో తీవ్ర నష్టం జరిగిందని చెప్పారు. కారకులు ఎవరైనా చర్యలు తీసుకోవాల్సిందేనని డిమాండ్ చేశారు. బడ్జెట్ పత్రంలో వివిధ అంశాలను ప్రస్తావించారని వాటిని స్వాగతిస్తున్నానని తెలిపారు. విద్యారంగంలో వృథాను అరికట్టి, సరైన పద్ధతిలో ఖర్చు చేసి, పనిచేస్తే ఫలితాలు బాగా వస్తాయన్నారు. సమాజంలోని ఆర్థిక, సామాజిక అంతరాలను తొలగించే శక్తి విద్యకు మాత్రమే ఉందని బీఆర్ అంబేద్కర్ చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు. మధ్యాహ్న భోజన నిర్వాహణ పట్ల ప్రభుత్వం శ్రద్ధ పెట్టాలన్నారు. గుడ్ల రేటు, ఇతర సరుకుల ధరలు కూడా పెరిగాయని గుర్తు చేశారు. నిర్వాహకులకు చెల్లించాల్సిన బిల్లులను సకాలంలో చెల్లించాలన్నారు. ఆ పథకాన్ని రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ జిల్లాలో స్వచ్ఛంద సంస్థలకు అప్పగించారనీ, దీంతో సగం మంది పిల్లలు భోజనం చేయటం లేదని తెలిపారు. గెస్ట్ లెక్చరర్ల నియామకాలు, మిగిలిన జూనియర్ కాలేజీలు, డిగ్రీ కాలేజీల్లోని కాంట్రాక్టు లెక్చరర్లను రెగ్యులర్ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. యూనివర్సిటీలలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలన్నారు. ప్రతి కోర్సును ప్రభుత్వ ఖర్చుతో నిర్వహించాలన్నారు. ఆర్టీసీలో ఉచిత ప్రయాణం అభినందనీయమన్నారు. కులగణన చేపట్టాలనీ, దుబారా వ్యయాన్ని తగ్గించాలని ప్రభుత్వం భావించటాన్ని స్వాగతిస్తున్నామన్నారు. సేద్యం చేసే వారికే రైతుబంధు ఇవ్వటంతోపాటు కౌలు రైతులకు కూడా ఇవ్వాలని చెప్పటాన్ని ఆయన ఈ సందర్భంగా అభినందించారు.

ఇచ్చిన హామీలు అమలు చేస్తాం.. : మంత్రి సీతక్క

ఇచ్చిన హామీలను కచ్చితంగా అమలు చేస్తామని మంత్రి సీతక్క చెప్పారు. దీనిపై ఎలాంటి అనుమానాలు అక్కరలేదన్నారు. విధివిధానాలు రూపొందిస్తున్నామన్నారు. గత ప్రభుత్వంలా వృదా ఖర్చులు చేయబోమన్నారు.

ప్రజలాశీర్వదీస్తే పదేండ్లు నేనే ముఖ్యమంత్రిని

(మొదటిపేజీ తరువాయి)

కుటుంబాన్ని శాసన సభ ఎన్నికల్లో తెలంగాణ సమాజం తిరస్కరించింది. దీంతో ఏంచేయాలో అర్థంకాక కేసీఆర్ నీళ్ల దారి పట్టిండు " అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎద్దేవా చేశారు. కొత్తగా ఎంపికైన కానిస్టేబుల్ అభ్యర్థులకు నియామక పత్రాలను బుధవారం హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీఎం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ "తెలంగాణ ఉద్యమం సాగిందే నీళ్లు, నిధులు, నియామకాల కోసం. కేసీఆర్ నీళ్లను తన చీకటి మిత్రుడు జగన్‌కు దారాదత్తం చేశారు. తెలంగాణ అభివృద్ధి పేరుతో లక్షల కోట్ల అప్పులు చేసి సొంత ఖజానా నింపుకున్నారు. ఇక నియామకాల గురించి పట్టించుకున్న పాపాన పోలేదు. యువత ఆత్మబలిదానాలతో ఏర్పడ్డ రాష్ట్రాన్ని విచ్ఛిన్నం చేసి నిరుద్యోగులకు తీరని శోకాన్ని మిగిల్చారు. ఆయన అవినీతి, అక్రమాలు, నియంతృత్వానికి విసిగి పోయిన ప్రజలు శాసన సభ ఎన్నికల్లో కేసీఆర్‌ను ఇంటికి పంపించి కాంగ్రెస్‌ను గెలిపించారు. అధికారం చేపట్టిన రెండు నెలల్లోనే 6,956 మంది స్టాఫ్ నర్సులు, 441 మంది సింగరేణి కార్మికులు, నేడు 13,445 మందికి కానిస్టేబుల్ ఉద్యోగాలు కల్పించాం. గురువారం ఇదే స్టేడియంలో ఫిజికల్ డైరెక్టర్లు, లైబ్రేరియన్లకు సంబంధించి మరో 2,090కి నియామక పత్రాలను అందజేస్తాం" అని సీఎం వివరించారు. పోలీస్ కానిస్టేబుళ్ల ఎంపికకు 2022 ఏప్రిల్‌లో నోటిఫికేషన్ జారీ చేయగా, 2023 అక్టోబర్‌లో తుది జాబితా సిద్ధమైందనీ, కోర్టు కేసుల కారణంగా నిలిచిపోయిందన్నారు. గత ప్రభుత్వం న్యాయ వివాదాలు పరిష్కరించడానికి ప్రయత్నించేందుకు గత ప్రభుత్వం చొరవ చూపెట్టక పోవడంతో ఈ నియామక ప్రక్రియ దాదాపు 22 నెలల కొనసాగిందని చెప్పారు. కల్వకుంట్ల కుటుంబంలో కవిత, వినోద్‌రావులు ఓడిపోతే నెల రోజుల్లో ఒకరికి ఎమ్మెల్సీ, మరొకరికి ప్లానింగ్ కమిషన్ చైర్మెన్‌గా అవకాశం కల్పించిన కేసీఆర్, నిరుద్యోగులకు మాత్రం మొండి చేయి చూపించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం ఉద్యోగ నియామకాల విషయంలో నిరుద్యోగులకు అన్యాయం చేసిందని వ్యాఖ్యానించారు. ప్రశ్నా పత్రాలను జిరాక్స్ సెంటర్లలో అమ్ముకున్న నేపథ్యంలో టీఎస్‌పీఎస్సీని ప్రక్షాళన చేసి కొత్త వారిని నియమించామని అన్నారు. మాపై పెట్టుకున్న ఆశలను వమ్ము చేయకుండా ఏడాదిలోగా ఇచ్చిన మాట ప్రకారం రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని ప్రకటించారు. యువత అధైర్యపడకుండా పోటీ పరీక్షలకు సిద్ధం కావాలని సూచించారు. కేఆర్ఎంబీపై కేసీఆర్, హరీష్ రావులు పెట్టిన సంతకాలే తెలంగాణ ప్రజలకు మరణ శాపనాలయ్యాయని ఆందోళదన వ్యక్తం చేశారు. చేసిదంతా చేసి ఇప్పుడు మొసలి కన్నీరు కారుస్తున్నారని ఎద్దేవా చేశారు. లక్ష కోట్లు ఖర్చు చేసి కట్టిన కాళేశ్వరంతో లక్ష ఎకరాలకు కూడా నీరివ్వని పరిస్థితి నెలకొందని అన్నారు. కాళేశ్వరం అవినీతి ఎక్కడ బయట పడుతుందోననే భయంతో మాజీ సీఎం కేఆర్ఎంబీ వివాదాన్ని భుజానెత్తుకున్నారని విమర్శలు గుప్పించారు. మరోసారి సెంటిమెంట్‌ను రెచ్చగొట్టి లబ్ధి పొందేందుకు చిల్లర ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. చావు నోట్లో తలపెట్టి తెలంగాణ తెచ్చాననీ చెప్పుకుటున్న కేసీఆర్‌ను తెలంగాణ ప్రజలెందుకు కామారెడ్డిలో ఓడించారని ప్రశ్నించారు. నల్లగొండ ప్రజలు కడిగుడ్లు, టమాటలతో స్వాగతం పలికినా తీరు మారలేదని వ్యాఖ్యానించారు. ప్రజా సమస్యలపై చిత్తశుద్ధి ఉంటే శాససభా పక్ష నేతగా అసెంబ్లీకి రాకుండా బయట ఎందుకు అడ్డగోలుగా మాట్లాడుతున్నారని విమర్శించారు. తెలంగాణ ప్రజలు కేసీఆర్ ఉచ్చులో పడకుండా అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. రాష్ట్రాన్ని డ్రగ్ ఫ్రీగా మార్చాలనే లక్ష్యంతో తమ సర్కార్ పనిచేస్తున్నదనీ, ఈ యజ్ఞంలో కొత్తగా ఎంపకైన కానిస్టేబుల్ అభ్యర్థులు నిబద్ధతతో పని చేయాలని పిలుపు నిచ్చారు. రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ కొత్తగా ఎన్నికైన తమ ప్రభుత్వం ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్నదని తెలిపారు. గత సర్కార్ చేసిన నిర్వాకాలను సరిదిద్దుకుంటూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేసేందుకు ప్రయత్నం చేస్తున్నామని పేర్కొన్నారు. ఎక్సైజ్ శాఖా మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ ధనిక రాష్ట్రాన్ని కేసీఆర్ కుటుంబం అప్పులు పాలు చేయడం వల్ల బ్యాంకులతో పాటు ఫైనాన్స్ సంస్థలు సైతం రుణాలు ఇవ్వని పరిస్థితి ఏర్పడిందని అన్నారు. బానిస భవన్‌గా మారిన ప్రగతి భవన్‌ను తాము ప్రజాభవన్‌గా మార్చామని చెప్పారు.

కోరం లేదు.. మేం వెళ్లిపోతాం : హరీశ్‌రావు

(మొదటిపేజీ తరువాయి)

సభనైనా టైం ప్రకారం నడపండి' అని హరీశ్‌రావు అంటుండగానే అసెంబ్లీలో లాంగ్‌బెల్ మోగింది. 'స్పీకర్‌గారూ..ఇదేంటండీ కోరం లేకుండా సభను ఎలా నిర్వహిస్తారు? మేం సభ నుంచి వెళ్లిపోతాం. కోరం ఉండేలా చూడటంలో మంత్రి విఫలమయ్యారు' అంటూ హరీశ్‌రావుతో పాటు బీఆర్ఎస్ సభ్యులు సభ నుంచి రెండు నిమిషాల పాటు బయటకు వెళ్లిపోయారు. వాస్తవానికి సభలో ఆ సమయంలో కాంగ్రెస్ సభ్యులు 17 మంది, బీఆర్ఎస్ సభ్యులు ఏడుగురు మొత్తంగా సభలో 24 మంది ఉన్నారు. ఏమైందో ఏమోగానీ రెండు నిమిషాల తర్వాత బీఆర్ఎస్ సభ్యులు లోనికి వచ్చారు. బడ్జెట్‌పై చర్చకు అనుమతిస్తూ మైక్‌ను బీఆర్ఎస్ సీనియర్ సభ్యులు కడియం శ్రీహరి మాట్లాడుతూ..'స్పీకర్‌గారు బెల్‌ను 10:05కి మోగించారు. సభను 10:10కి స్టార్ట్ చేస్తున్నారు. అసెంబ్లీ నిర్వహణ సమయంలోనైనా సభ్యులు సమయపాలన పాటించేలా చూడండి. సభలో కోరం ఉండేలా చూసుకోవాలి. బడ్జెట్‌పై చర్చ జరిగేటప్పుడు ఆర్థిక శాఖ మంత్రి సభలో లేకపోతే రిప్లై ఎవరు ఇస్తారు? సమయపాలన లేదు..కోరం లేదు..మంత్రి లేరు..దీనిని బట్టే ప్రభుత్వానికి సమావేశాల నిర్వహణపై ఎంత చిత్తశుద్ధి ఉందో అర్థం అవుతున్నది ' అంటూ చురకలు అంటించారు.

మాట్లాడుకోదలుచుకోలేకనే వెళ్లిపోయారు : దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

'సీనియర్ సభ్యులైన హరీశ్‌రావు అలా మాట్లాడటం సరిగాదు. కోరం కావాల్సినంత ఉంది. నూటికి నూరు శాతం కోరం ఉంది. 1/10 సభ్యులు సభలో ఉండాలి. మేం 18 మందిమి ఉన్నాం. వారూ ఉన్నారు. బడ్జెట్‌పై వారు మాట్లాడ దల్చుకోలేకనే సభ నుంచి వెళ్లిపోయారు. కావాలని బయటకు పోయారు. ఇది సరిగాదు. రేపు పొద్దుటి నుంచే సభలో మా సభ్యుల్లో కనీసం 40 మందినైనా ఉండేలా చూస్తాం' అని అన్నారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ సభ్యులు తలసాని శ్రీనివాస్‌యాదవ్ మాట్లాడుతూ..'మంత్రి 12 మంది అన్నారు. పది శాతం అంటున్నరు. 14 మందే ఉన్నారు. వారికే క్లారిటీ లేదు. పనికిమాలిన రాజకీయాలు చేయాలనీ, బయటకు పోవాలని మాకేమాత్రం లేదు' అంటూ చురకలు అంటించారు. వెంటనే శ్రీధర్‌బాబు జోక్యం చేసుకుంటూ...'హరీశ్‌రావుకు అన్నీ తెలుసు. సభను బుల్డోజ్ చేయాలని చూస్తున్నారు. ఇది సరిగాదు. కోరం ఉంది. దయచేసి ప్రజల్ని, సభను తప్పుదోవ పట్టించొద్దు' అని కోరారు.

ఈసారి మేడారానికి భారీగా విద్యుత్ వినియోగం

500 మంది సిబ్బందిపర్యవేక్షణ

- 25 మెగావాట్లు అవసరమని అధికారుల ప్రతిపాదన
- ఖర్చును భరిస్తున్న ఎన్పీడీసీఎల్



నవతెలంగాణ-వరంగల్ ప్రాంతీయ ప్రతినిధి

మేడారం జాతరకు విద్యుత్ శాఖ పరిధిలో జరిగే పనులకు రూ.16.73 కోట్లు ఖర్చు కానున్నట్టు తెలుస్తోంది. అయితే, రాష్ట్ర ప్రభుత్వం రూ.3.76 కోట్లను కేటాయించినట్టు తెలిసింది. విద్యుత్ వినియోగం గత జాతర కంటే ఈసారి పెరగనుంది. ములుగు జిల్లా సమ్మక్క, సారలమ్మ తాడ్వాయి మండలంలోని మేడారంలో కొత్తూర్, సమ్మక్క సబ్ స్టేషన్‌లలో పవర్ ట్రాన్స్‌ఫార్మర్స్ ఏర్పాటుతోపాటు ఇతర పనుల కోసం సంబంధిత శాఖ పెద్ద ఎత్తున నిధులను ఖర్చు చేస్తోంది. మరో రూ.12.97 కోట్ల నిధులను ఎన్పీడిసిఎల్ భరిస్తుంది. నిరంతరాయంగా విద్యుత్ అందించడానికి 500 మంది సిబ్బంది చర్యలు తీసుకుంటున్నారు. నెల రోజులుగా మేడారం జాతరకు ముందే ప్రజలు సందర్శించి మొక్కులు తీర్చుకుంటున్నారు. ఇందుకు గాను 25 మెగావాట్ల విద్యుత్ అవసరమవుతుందని ఎన్పీడిసిఎల్ అధికారులు ప్రతిపాదించారు. గత జాతరలో 16 మెగావాట్ల విద్యుత్‌ను జాతరకు వినియోగించారు. ఈసారి విద్యుత్ అవసరాలు పెరగనున్నాయన్న అంచనాతో ఈ నిర్ణయం తీసుకున్నట్టు సంబంధిత శాఖాధికారులు 'నవతెలంగాణ'కు తెలిపారు.

మేడారం జాతరలో ప్రజల సౌకర్యార్థం నిరంతరాయంగా విద్యుత్తు అందించడానికి రెండు నెలలుగా నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్ (ఎన్పీడిసిఎల్) అధికారులు, సిబ్బంది శ్రమిస్తున్నారు. జాతరకు రాష్ట్ర ప్రభుత్వం రూ.105 కోట్లు మంజూరు చేయగా, ఇందులో విద్యుత్ శాఖకు సంబంధించి రూ.3.76 కోట్లను మాత్రమే కేటాయించారు.కొత్తూరు సబ్‌స్టేషన్‌లో 8.0 ఎంవిఎ పవర్ ట్రాన్స్‌ఫార్మర్లను రెండింటిని ఏర్పాటు చేశారు. ఇక్కడ 33/11 కెవి బ్రేకర్లను పరికరాల పరిరక్షణకు బిగించారు. మేడారం గద్దెల వద్ద కొత్తగా ఏర్పాటు చేసిన సమ్మక్క సబ్‌స్టేషన్‌లో 5.0 ఎంవిఎ పవర్ ట్రాన్స్‌ఫార్మర్లను రెండింటిని ఏర్పాటు చేశారు.

8 సెక్టార్‌లలో పని విభజన

మేడారం జాతరలో మెరుగైన విద్యుత్ సరఫరాకు 8 సెక్టార్‌లను ఏర్పాటు చేసి పని విభజన చేశారు. ఒక్కో సెక్టార్‌కు 1 ఎఇ, 1 సబ్ ఇంజనీర్, ఒ అండ్ ఎం స్టాఫ్‌ను ఏర్పాటు చేశారు. జాతరలో ఏర్పాటు చేసుకున్న దుకాణదారుల నుండి విద్యుత్ వినియోగానికి సంబంధించి ఆయా దుకాణాల లోడ్‌ను బట్టి రూ.1,500 నుంచి రూ.4,500 వసూలు చేస్తున్నారు.

500 మంది సిబ్బందితో పనులు

మేడారం జాతరలో ఎన్పీడిసిఎల్ ఇంజినీరింగ్ అధికారులతోపాటు సిబ్బంది సుమారు 500 మంది వరకు పనిచేస్తున్నారు. ఎన్పీడిసిఎల్ సిఎండితోపాటు నలుగురు సిజిఎంలు, 1 డైరెక్టర్, 2 చీఫ్ ఇంజనీర్లు, 4 ఎస్ఇలు, 20 మంది డిఇలు, 30 మంది ఎడిఇలు, సుమారు 50 మంది ఎఇలు, 70 మంది సబ్ ఇంజినీర్లు ఇతర ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ సిబ్బంది జాతరలో సేవలందించనున్నారు. నిరంతర విద్యుత్ అందించడానికి 230 ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేశారు. గత జాతర కంటే 10 ట్రాన్స్‌ఫార్మర్లను పెంచారు. 315 కెవిఎ సామర్థ్యం కలిగిన డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు 4, 160 కెవిఎ సామర్థ్యం కలిగినవి 90, 100 కెవిఎ సామర్థ్యం కలిగినవి 105, సింగిల్ ఫేస్ 25 కెవిఎ సామర్థ్యం కలిగినవి 31 ఏర్పాటు చేస్తున్నారు. మేడారం జాతర అటవీప్రాంతంలో వుండటంతో గాలులకు కండక్టర్ ఒకదానికొకటి తగిలి ప్రమాదాలు సంభవించకుండా జాగ్రత్తలు తీసుకున్నారు.

ప్రభుత్వం.. మా గొంతు నొక్కుతోంది

- బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు
- అసెంబ్లీమీడియా పాయింటు వద్దకు వెళ్తుండగా అడ్డుకున్న పోలీసులు
- బారికేడ్ల వద్ద ఎమ్మెల్యేల బైటాయింపు



నవతెలంగాణ-సిటీబ్యూరో

ప్రభుత్వం కావాలనే తమ గొంతు నొక్కుతోందని, అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద కూడా మాట్లాడొద్దా అంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఆవేదన వ్యక్తం చేశారు. శాసనసభ నుంచి బీఆర్ఎస్ సభ్యులు బుధవారం వాకౌట్ చేసి మీడియా పాయింట్ వద్దకు వెళ్తుండగా పోలీసులు, మార్షల్స్ అడ్డుకున్నారు. పోలీసులు బారికేడ్లు అడ్డుపెట్టారు. సభ జరుగుతున్న సమయంలో మీడియా పాయింట్ వద్దకు వెళ్లేందుకు అనుమతి లేదనడంతో వాగ్వాదం జరిగింది. దాంతో ఎమ్మెల్యేలు హరీశ్‌రావు, కేటీఆర్, జగదీశ్ రెడ్డి, ప్రశాంత్ రెడ్డి, కడియం శ్రీహరి, సబితా ఇంద్రారెడ్డి, మర్రి రాజశేఖర్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు.అసెంబ్లీ సమావేశం నడుస్తుండగా మీడియా పాయింట్ వద్ద ఎమ్మెల్యేలు మాట్లాడ వద్దనే నిబంధన ఏదీ లేదని, ప్రభుత్వం కావాలనే తమ గొంతు నొక్కుతోందని అన్నారు. ఉత్తర్వులు చూపాలంటూ ఎమ్మెల్యేలు డిమాండ్ చేస్తూ అక్కడే బైటాయించారు. ఎన్ని రోజులైనా మాట్లాడండి అవకాశం ఇస్తామని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు.. కానీ తమకు సభలో మాట్లాడేందుకు మైక్ ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మీడియా పాయింట్ వద్ద కూడా మాట్లాడేందుకు అవకాశం లేదా అని ప్రశ్నించారు. ప్రజాపాలనలో నిర్బంధాలుండవని, కంచెలు తొలగిస్తామని మాటలు చెబుతూనే శాసన సభ్యులకు మీడియా పాయింట్ వద్ద మాట్లాడే అవకాశం లేకుండా కంచెలు ఏర్పాటు చేసి, వందలాది మంది పోలీస్‌లు, మార్షల్స్‌తో అడ్డుకోవడం ఏంటని ప్రశ్నించారు. తాను కూడా శాసన సభ వ్యవహారాల మంత్రిగా పని చేశానని, తనకు మాట్లాడే అవకాశం స్పీకర్ ఇవ్వడం లేదని ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి అన్నారు. సీఎం చెప్పేదొకటి చేసేదొకటని ఎమ్మెల్యే కడియం శ్రీహరి విమర్శించారు.

అసెంబ్లీలో సీఎం చెప్పలేని భాషలో మాట్లాడుతున్నారని, రేవంత్ రెడ్డి అనుచిత భాషను ఖండిస్తున్నామన్నారు. రికార్డుల నుంచి వాటిని తొలగించాలన్నారు. రెండు నెలలోనే కాంగ్రెస్ పాలనలో ప్రజాస్వామ్య స్ఫూర్తి లోపించిందని, ఎమ్మెల్యే కడియం శ్రీహరిపై ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి మాట్లాడిన అనుచిత భాషను వెంటనే రికార్డుల నుంచి తొలగించాలి ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి డిమాండ్ చేశారు. కడియం ఎక్కడా బడ్జెట్‌కు సంబంధం లేని విషయాలు మాట్లాడలేదన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ఇష్టమొచ్చిన భాష మాట్లాడుతూ దాన్ని తెలంగాణ భాషగా చెప్పుకుంటున్నారని విమర్శించారు. తెలంగాణకు రాజీవ్ గాంధీకి ఏం సంబంధమని, సెక్రటేరియట్ ముందు రాజీవ్ గాంధీ విగ్రహం పెట్టాలనే నిర్ణయాన్ని వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేశారు.అక్కడ ఇంతకుముందు కేసీఆర్ ప్రతి పాదించిన తెలంగాణ తల్లి విగ్రహం పెట్టాలన్నారు.

వీల్‌చైర్ నాటకాలు మానండి

(మొదటిపేజీ తరువాయి)

సభలో చర్చిద్దామా అధ్యక్షా?.. 'ఏం పీకపోయారు' అంటారా అధ్యక్షా?. మాజీ సీఎంగా పదేండ్లు, కేంద్రమంత్రిగా, రాష్ట్రమంత్రిగా పనిచేశాననీ, ఉద్యమనేతనని గొప్పలు చెప్పుకుని జబ్బులు చరచుకునే కేసీఆర్.. ప్రధాన ప్రతిపక్ష నేత హోదాలో ఉండి ఏం పీకపోయారు అని అంటారా? ఇప్పటికే ప్రజలు ఆయన పాయింట్ పీకేశారు. అట్లనే మాట్లాడితే ఉన్న అంగి, లాగును కూడా పీకుతం. తెలంగాణ ప్రజలు మొన్న జరిగిన ఎన్నికల్లో పాయింట్ ఊడపీకారు. అది తట్టుకోలేక బొక్కబోర్లపడితే బొక్కలు ఇరిగినయి. ముఖ్యమంత్రిని పట్టుకుని ఏంపీకపోయారు అని అడుగుతారా? నాలుగు కోట్ల మంది ఓట్లేసి గెలిపించిన సీఎం అలా అనటమే సాంప్రదాయమా? మేడిగడ్డ మేడిపండులా కుంగిపోతే మేడిగడ్డలో నీళ్లు నింపడానికి అవకాశం ఉంటదా? గతంలో హరీశ్‌రావు, కేసీఆర్ సాగునీటి పారుదల శాఖ మంత్రులుగా పనిచేశారు కదా? ఇప్పుడు వారికే పెత్తనం ఇస్తాం. వాళ్లనే చేయమనండి. అక్కడ నీళ్లు ఎలా నింపుతారో? మేడిగడ్డ నుంచి అన్నారంలో ఏవిధంగా ఎత్తిపోస్తరో? అన్నారం నుంచి సుందిళ్లలో ఏవిధంగా ఎత్తిపోస్తారో? బాధ్యతను వాళ్లను తీసుకోమనండి. కుంగిపోయి కుప్పకూలిపోయే పరిస్థితి ఉంటే నీళ్లు నింపడానికి ఏమాత్రం అవకాశం లేదు. 94 వేల కోట్ల రూపాయలు వృథాఅయిపోయి, ప్రాజెక్టుకు అక్కరకు రాకుండా పోయింది' అని సీఎం అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై చర్చకు రావాలని టీఆర్ఎస్ఎల్పీ నేతను అడిగితే పారిపోయి ఫామ్‌హౌజ్‌లో పడుకున్నారని ఎద్దేవా చేశారు. కాళేశర్వంలో జరిగిన అవినీతి బయటపడుతుందనే కారణంతోనే భయపడి సభకు రావడం లేదని విమర్శించారు. కేసీఆర్‌ను తాము చంపుతామంటూ ప్రచారం చేస్తున్నారనీ, చచ్చిన పామును ఎవరైనా చంపుతారా? అని ప్రశ్నించారు. మొన్నటి ఎన్నికలలో ఆ పామును ప్రజలు చేతితో కాకుండా కట్టెతో కొట్టి చంపారని అన్నారు. దాన్ని తట్టుకోలేక సానుభూతి కోసం వీల్‌చైర్, వీధి నాటకాలు ఆడుతున్నారని విమర్శించారు. నిజాయితీ ఉంటే మేడిగడ్డ పిల్లర్ల కుంగుబాటుపై చర్చకు రావాలని కేసీఆర్‌కు సవాల్ విసిరారు. సాగునీటి ప్రాజెక్టులపై శ్వేతపత్రం పెట్టడానికి తాము సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. కాళేశ్వరం మీదనే ప్రత్యేక చర్చ అంటారా? సమయం ఇవ్వండి' అని స్పీకర్‌ను కోరారు.

ఆ గ్యారంటీల అమలు సాధ్యమే

ప్రతి పేదవానికి బడ్జెట్ ఫలితాలు అందాలి

- సంపదపై పన్ను విధించాలి
- అసెంబ్లీలో సీపీఐ సభ్యులు కూనంనేని సాంబశివరావు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

మనసుంటే మార్గముంటుందనీ, కాంగ్రెస్ ఇచ్చిన గ్యారంటీలు, హామీల అమలు సాధ్యమేనని సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అభిప్రాయపడ్డారు. బుధవారం శాసనసభలో ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌పై జరిగిన చర్చలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బీఆర్ఎస్ పాలనలో తెలంగాణ ప్రగతి సాధించిందంటూ ఆ పార్టీ సభ్యులు చేసిన వ్యాఖ్యలను కొట్టిపారేశారు. ఇందు కోసం కడియం కొన్నికొలమానాలను ప్రస్తావించారనీ, అయితే నీటిఅయోగ్ ఇచ్చిన పలు అంశాల్లో రాష్ట్రం వెనుకబడి ఉందన్న విషయాన్ని కూనంనేని గుర్తుచేశారు. అది ధనిక రాష్ట్రమంటే తలసరి ఆదాయం సగటు గణింపు, మిగులు ఆదాయం కాదనీ, బడ్జెట్ ఫలితాలు అందరికి అందితేనే ధనిక రాష్ట్రమని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం రూ.50 వేల కోట్లు అప్పు చేస్తుందన్న అంచనాల నేపథ్యంలో మెరుగైన ఆర్థిక నిర్వహణ చేయగలిగితే హామీలన్నింటినీ అమలు చేయవచ్చని సూచించారు. హైదరాబాద్ లో వేలాది ఎకరాల దేవాదాయ, భూదాన, వక్ఫ్ భూములతో పాటు చెరువుల కింద భూములు కూడా ఆక్రమణలో ఉన్నాయని తెలిపారు. వాటిని స్వాధీనం చేసుకునేందుకు చర్యలు చేపట్టాలని కోరారు. రైతుబంధు సాయాన్ని 10 ఎకరాలకు అటు, ఇటుగా పరిమితం చేస్తే బాగుంటుందని అభిప్రాయపడ్డారు. ఇందు కోసం ప్రజా ప్రతినిధుల అభిప్రాయం తీసుకోవాలని కూనంనేని సూచించారు.

వారికి నేరుగా జీతాలివ్వండి

ఆంధ్రప్రదేశ్‌లో కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు నేరుగా జీతాలు చెల్లిస్తున్నట్టుగానే రాష్ట్రంలోనూ చెల్లించాలని కూనంనేని ఈ సందర్భంగా ప్రభుత్వానికి సూచించారు.ఆయా క్యాడర్ల వారీగా ప్రభుత్వం ఇస్తున్న దాంట్లో ఏజెన్సీలు కోత విధించి ఉద్యోగులకు తక్కువగా ఇచ్చి దోపిడీ చేస్తున్నాయని తెలిపారు. రెగ్యులర్ ఉద్యోగులకు పదవీ విరమణ తర్వాత బెనిఫిట్స్ అందుతున్నట్టుగా కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్, అసంఘటిత కార్మికులకు వర్తించేలా బీమా కంపెనీల సాయంతో చర్యలు చేపట్టాలని కోరారు. కొన్ని దేశాల్లో విధిస్తున్నట్టుగా మన రాష్ట్రంలో సంపన్నులకు పన్ను విధించాలని కోరారు.తెలంగాణ ఉద్యమం, బీఆర్ఎస్ పాలనలో బనాయించిన కేసులను ఎత్తివేయాలన్నారు. అగ్రిగోల్డ్ బాధితులను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. శెట్టిబలిజ తదితర 26 కులాలను బీసీల్లో చేరుస్తామన్న హామీని నిలబెట్టుకోవాలని గుర్తుచేశారు. ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులను దారి మళ్లించకుండా చూడాలనీ, ధరణి బందాల నుంచి తొందరగా బాధితులను విముక్తులను చేయాలన్నారు. కాళేశ్వరం సమస్యను వెంటనే పరిష్కరించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.

వరంగల్‌ను దత్తత తీసుకోవాలి: నాయిని రాజేందర్ రెడ్డి

కాంగ్రెస్ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ వరంగల్ జిల్లాను బీఆర్ఎస్ చిన్నాభిన్నం చేసిందని విమర్శించారు. దాన్ని దత్తత తీసుకోవాలని కోరారు. కాంగ్రెస్ ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ బీఆర్ఎస్ పాలనలో కేజీబీవీలు, గురుకులాలు, మోడల్ స్కూళ్లు అధ్వాన్నంగా తయారయ్యాయని విమర్శించారు. బీజేపీ ఎమ్మెల్యే పాయల శంకర్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం హామీల్లో భాగంగా కేంద్రం ఇచ్చిన గిరిజన విశ్వవిద్యాలయాన్ని ఆదిలాబాద్‌లో ఏర్పాటు చేయాలని కోరారు. కాంగ్రెస్ ఎమ్మెల్యే శ్రీహరి మాట్లాడుతూ మక్తల్ నియోజకవర్గంలో సాగునీటి సమస్య పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకుందని ధన్యవాదాలు తెలిపారు.

కునారిల్లిన వైద్యారోగ్య వ్యవస్థ : డాక్టర్ వంశీకృష్ణ

బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రంలో వైద్యారోగ్య వ్యవస్థ కునారిల్లిందని కాంగ్రెస్ ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ ఆవేదన వ్యక్తం చేశారు. కార్పొరేట్ వైద్యమంటూ కనీస వైద్యాన్ని కూడా అందివ్వలేదని విమర్శించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మొదలు మెడికల్ కాలేజీల వరకు అన్నింటిని పూర్తి స్థాయి సిబ్బంది లేకుండానే కొనసాగించారని తెలిపారు. ఆస్పత్రుల్లో స్టాఫ్ నర్సులు, అదే విధంగా డాక్టర్లు, పారామెడికల్ సిబ్బందిని పూర్తి స్థాయిలో భర్తీ చేయాలని కోరారు. శాసనసభలో ఆయన పార్టీల నుంచి 15 మంది సభ్యులు డాక్టర్లే ఉన్నారనీ, వీరిలో ఏడుగురు ఉస్మానియా మెడికల్ కాలేజీ పూర్వ విద్యార్థులని తెలిపారు. వైద్యారోగ్య రంగాన్ని ప్రజలకు మరింత చేరువ చేసే క్రమంలో వారి సూచనలు, సలహాలను స్వీకరించాలని కోరారు. బీజేపీ ఎమ్మెల్యే డాక్టర్ పి.హరీశ్ బాబు మాట్లాడుతూ ఉస్మానియా ఆస్పత్రి నిర్మాణంలో హెరిటేజ్ సమస్యకోర్టు సమస్యలుంటే మిగిలిన ఖాళీ స్థలాన్ని పరిశీలించాలని సూచించారు.

ఎనుమాములకు భారీగా మిర్చి

- వరంగల్ మార్కెట్‌లో దేశిరకం మిర్చి క్వింటా రూ.39వేలు



నవతెలంగాణ కాశిబుగ్గ

వరంగల్ (ఏనుమాముల) వ్యవసాయ మార్కెట్ మిర్చి యార్డులో బుధవారం మిర్చి(ఎర్ర బంగారం) పోటెత్తింది. యార్డుకు సుమారు 50వేలకు పైగా మిర్చి బస్తాలు అమ్మకానికి వచ్చాయి. ఈ సీజన్ ప్రారంభం నుంచి ఇంత పెద్దఎత్తున మిర్చి రావడం ఇదే తొలిసారి కావడంతో వ్యాపారులు, కార్మికులు సంతోషం వ్యక్తం చేశారు. దేశీ రకం మిర్చికి గరిష్టంగా క్వింటా ధర రూ.39వేలు పలుకగా, తేజ రకం రూ.21వేలు, వండర్ హాట్ రూ.22వేలు, యూఎస్341 రూ.20,500, దీపిక రకం మిర్చి క్వింటాకు రూ.22,500 ధర పలికింది. శుక్రవారం దేశవ్యాప్త సమ్మె ఉండటం.. శని, ఆదివారాలు మార్కెట్ యార్డు బంద్ ఉండటం, మేడారం జాతర దగ్గర పడటంతో రైతులు పెద్దఎత్తున తమ పంట ఉత్పత్తులను అమ్మడానికి మార్కెట్‌కు తీసుకొస్తున్నారు.

రాజ్యసభకు సోనియా

(మొదటిపేజీ తరువాయి)

(పీసీసీ) సోనియా గాంధీ నామినేషన్ దాఖలు చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, రాజస్థాన్ మాజీ సీఎం అశోక్ గెహ్లాట్ లు హాజరయ్యారు.

తెలంగాణ నుంచి రేణుకా చౌదరి, అనిల్ కు చోటు

తెలంగాణ, మధ్యప్రదేశ్, కర్నాటక నుంచి మొత్తం ఆరుగురు పేర్లను అధిష్టానం ప్రకటించింది. తెలంగాణ నుంచి పార్టీ సీనియర్ నాయకురాలు రేణుకా చౌదరి, యువ నేత అనిల్ కుమార్ యాదవ్ లకు పార్టీ అవకాశం కల్పించింది. అయితే తెలంగాణ నుంచి మొత్తం మూడు రాజ్యసభ సభ్యుల పదవి కాలం ముగిసింది. అసెంబ్లీలో కాంగ్రెస్ సంఖ్యా బలం బట్టి కేవలం రెండు సీట్లు మాత్రమే ఆ పార్టీ గెలుచుకునే అవకాశం ఉంది. దీంతో అధిష్టానం ఇద్దరి పేర్లను మాత్రమే ప్రకటించింది. ఇక కర్నాటక నుంచి అజయ్ మాకెన్, నసీర్ హుస్సేన్, జి. సి చంద్రశేఖర్ పేర్లను కాంగ్రెస్ వెల్లడించింది. మధ్య ప్రదేశ్ నుంచి అశోక్ సింగ్ పేరును ఖరారు చేసింది.

గుజరాత్ నుంచి పెద్దల సభకు బీజేపీ అధ్యక్షుడు నడ్డా

గుజరాత్, మహారాష్ట్ర రాష్ట్రాల నుంచి రాజ్యసభకు ఏడుగురు అభ్యర్థుల పేర్లను బీజేపీ ప్రకటించింది. ఇందులో గుజరాత్ నుంచి నలుగురు, మహారాష్ట్ర నుంచి ముగ్గురిని ఎంపిక చేసినట్టు బుధవారం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి అరుణ్ సింగ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో గుజరాత్ నుంచి పార్టీ జాతీయ అధ్యక్షుడు నడ్డా, సీనియర్ నేతలు గోవింద్ భాయ్, మయాన్ భాయ్ నాయక్, జశ్వంత్ సిన్హ్ సలామ్ సిన్హ్ పార్మర్ లు నామినేషన్ దాఖలు చేయనున్నారు. అలాగే మహారాష్ట్ర నుంచి మాజీ సీఎం అశోక్ చౌహాన్, మేధా కులకర్ణి, డాక్టర్ అజిత్ గోప్చాడేలు పెద్దల సభకు పోటీ చేయనున్నారు.

ఆ నిర్ణయాలు సరైనవి కావు..

(మొదటిపేజీ తరువాయి)

స్థానాలు ఉన్నాయి. అయితే ప్రస్తుతం బీహార్ జనాభా తమిళనాడు కంటే 1.5 రెట్లు అధికంగా ఉంది. 2026 పునర్విభజన జరిగితే పార్లమెంటులో తమిళనాడు ప్రాతినిధ్యం అనేక ఉత్తరాది రాష్ట్రాల కంటే తక్కువగా ఉంటుంది' అని వివరించారు. జనాభా ప్రాతిపదికన నియోజకవర్గాల పునర్విభజన తమిళనాడు వంటి రాష్ట్రాలను బలహీనపరుస్తుందని అన్నారు. 'గత 50 ఏళ్లుగా ప్రజా ప్రయోజనాల కోసం వివిధ సామాజిక-ఆర్థిక అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలను అమలు చేసిన తమిళనాడు వంటి రాష్ట్రాలకు శిక్ష విధించకుండా చూడాలని ఈ సభ కోరుతోంది' అని తీర్మానం పేర్కొంది. ఈ తీర్మానాన్ని పార్టీలకు అతీతంగా హజరైన సభ్యులంతా ఆమోదించారు.

'ఒకే దేశం-ఒకే ఎన్నికలు' ప్రతిపాదనను వ్యతిరేకిస్తూ రెండో తీర్మానాన్ని ఆమోదించారు. ఇలాంటి ప్రతిపాదన అమలు చేయడం 'అసాధ్యం' అని తీర్మానంలో పేర్కొన్నారు. స్వేచ్ఛ, నిష్పాక్షికమైన, స్వతంత్ర ఎన్నికలను పేర్కొన్న రాజ్యాంగం ప్రాథమిక సిద్ధాంతాలకు ఈ ప్రతిపాదన విరుద్ధమని విమర్శించారు. జమిలి ఎన్నికలు ఒకవేళ అమలు చేస్తే కేంద్రంలో ప్రభుత్వం పడిపోతే రాష్ట్ర ప్రభుత్వాలన్నింటినీ రద్దు చేస్తారా' అని స్టాలిన్ ఈ సందర్భంగా ప్రశ్నించారు. అదేవిధంగా కొన్ని రాష్ట్రాల్లో ప్రభుత్వాలు పతనం చెందితే కేంద్రంలో అధికారంలో ఉన్నవారు తమకు తాముగా దిగిపోతారా? అని ప్రశ్నించారు.

రాజధానిపై వైసీపీ పిల్లి మొగ్గలు

- సీపీఐ(ఎం) ఏపీ రాష్ట్ర కమిటీ ఖండన



అమరావతి : రాష్ట్ర రాజధాని విషయంలో వైసీపీ పిల్లిమొగ్గల్ని సీపీఐ(ఎం) ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు పార్టీ ఏపీ రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. హైదరాబాద్ రాజధానిగా మరికొంతకాలం వుండాలని వైసీపీ అధికార ప్రతినిధి వైవి సుబ్బారెడ్డి ప్రతిపాదించడం, దానికి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి వంతపాడటం చూస్తుంటే ఉద్దేశపూర్వకంగానే ప్రజలను గందరగోళానికి గురిచేసేలా ఉందని విమర్శించారు. అంతేకాకుండా తెలంగాణకు వ్యతిరేకంగా ప్రజలను రెచ్చగొట్టి తమ వైఫల్యాన్ని కప్పిపుచ్చుకొనే ప్రయత్నం చేస్తున్నట్టు అర్థమవుతోందని విమర్శించారు. ఇటువంటి చర్చల్ని ఆపేయాలని శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. తెలంగాణ ఎన్నికలకు ముందు నాగార్జునసాగర్ వద్ద పోలీసులను మోహరించి నాటకమాడినట్టు ఇప్పుడు మరో కొత్త నాటకానికి తెరలేపారని విమర్శించారు. అలాగే అమరావతి రాజధానిగా దారి తప్పించే ప్రయత్నం చేస్తున్నట్టుగా వుందని తెలిపారు. ఈ చర్చ రాష్ట్ర ప్రజలకు ఏమాత్రమూ సమ్మతం కాదన్నారు. హైదరాబాద్‌ను వదిలేసి పదేండ్లయిందని, ఇప్పుడు హైదరాబాద్ రాజధాని అంటూ కొత్త చర్చను లేవదీసి మొత్తం ప్రజా సమస్యలను పక్కదారి పట్టించే ప్రయత్నం చేయడం సరైందికాదని అన్నారు. అమరావతిని రాజధానిగా అంగీకరించి అభివృద్ధి చేయకపోతే వైసీపీని ప్రజలు క్షమించరని తెలిపారు.

16న సమ్మె, గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయాలి

(మొదటిపేజీ తరువాయి)

గాదగోని రవి (ఎంసీపీఐయూ), సిహెచ్ మురహరి (ఎస్‌యూసీఐసీ), జానకి రాములు (ఆరెస్పీ), బి సురేందర్‌రెడ్డి (ఫార్వర్డ్‌బ్లాక్), ఎం రమేష్‌రాజా (సీపీఐఎంఎల్ లిబరేషన్), ప్రసాదన్న (సీపీఐఎంఎల్) సంయుక్తంగా బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. దేశ రాజధాని ఢిల్లీ నగరానికి ఇప్పటికే రైతులు పెద్ద సంఖ్యలో చేరుకున్నారని తెలిపారు. మోడీ ప్రభుత్వం రైతుల ప్రదర్శన మీద తీవ్ర నిర్బంధం ప్రయోగిస్తున్నదని విమర్శించారు. నిత్యావసర సరుకుల ధరలను నియంత్రించడంలో కేంద్ర ప్రభుత్వం వైఫల్యం చెందిందని పేర్కొన్నారు. ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలిస్తామన్న వాగ్దానాన్ని గాలికి వదిలేసిందని తెలిపారు. రైతాంగం కోరుతున్న కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించడంలో హామీని నిలబెట్టుకోలేదని విమర్శించారు. వ్యవసాయ కార్మికులకు ఏడాదికి 200 రోజులు పని కల్పించేలా ఉపాధి హామీ చట్టాన్ని నీరుగారుస్తోందని తెలిపారు. కార్మిక చట్టాలను బలహీనం చేసే నాలుగు రకాల లేబర్ కోడ్‌లను సిద్ధం చేసి కార్మికుల ఉద్యోగ భద్రతకు ముప్పు తెచ్చిందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజా వ్యతిరేకతను రాజకీయంగా ఎదుర్కోలేక రామాలయం ప్రారంభోత్సవాన్ని ముందుకు తెచ్చి హిందూత్వ రాజకీయాలతో ఓటు బ్యాంకు పెంచుకుని తిరిగి గద్దె నెక్కడానికి సిద్ధమవుతున్నదని విమర్శించారు. ఈ నేపథ్యంలో నరేంద్రమోడీ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ కార్మికులు, రైతులు, వ్యవసాయ కార్మికులు తలపెట్టిన సమ్మెను, గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయాలని ప్రజానీకానికి విజ్ఞప్తి చేశారు. వామపక్ష శ్రేణులు ఈ ఆందోళనలో క్రియాశీలంగా పాల్గొనాలని పిలుపునిచ్చారు.



ఖాళీ కడుపుతో తింటేనే...

మనం సహజంగా పండ్లను ఏ విధంగా తింటాం.. చాలా వరకు భోజనం చేసిన తర్వాతనే కదా.. అంతేకాదు, మన ఊర్లలో అమ్మలు, అమ్మమ్మలు, బామ్మలు రుచి కోసం పెరుగున్నంలో మామిడి, అరటి పండ్ల వంటివి కలిపి తినిపిస్తుంటారు. కానీ ఇలా తినడం వల్ల ఆరోగ్యంపై ప్రభావం పడుతుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఇది ఈ మధ్య కనుగొన్నది కాదు, దశబ్దాల కిందటే ప్రయోగాలు చేసి నిరూపించిన అక్షర సత్యం. అంతేకాదు, పరగడుపున అంటే ఖాళీ కడుపుతో పండ్లు, పండ్ల రసాలు తీసుకుంటే చాలా రకాల అనారోగ్యాలు దూరమవుతాయని నిపుణులు సూచిస్తున్నారు. అయితే కొన్ని పండ్లను ఎలా తినాలో, ఎందుకు తినాలో తెలుసుకుందాం...

పండ్లను తినడం అంటే.. మార్కెట్‌కు వెళ్ళి మనకు నచ్చిన పండ్లను కొనుక్కొని వచ్చి, శుభ్రంగా కడిగి కట్ చేసి తినడమే కదా అనుకుంటాం. కానీ అది అనుకున్నంత సులువు కాదు. పండ్లను తినడం ఎప్పుడు ఎలా అనేది చాలా ముఖ్యం.

సరైన పద్ధతి ఏంటి?

భోజనం తర్వాత పండ్లను తినొద్దు. పండ్లను ఖాళీ కడుపుతోనే తినాలి. ఎందుకంటే.. ఖాళీ కడుపుతో తింటే, జీర్ణవ్యవస్థ విషతుల్యం కాకుండా కాపాడుతుంది. శరీరానికి కావాల్సిన శక్తిని అందించి, బరువు పెరగకుండా కాపాడడంతో పాటు కొన్ని రకాల మేలు చేస్తుంది.

ముఖ్యమైన ఆహారం

మనం ఆహారం లేదా మరే ఇతర పదార్థాలతో పాటైనా పండ్లను తీసుకున్నామనుకోండి.. ఆ పదార్థం పూర్తి స్థాయిలో జీర్ణం అవడంలో అవరోధాలు ఏర్పడతాయి. దానర్థం ఆహారంతో పాటు మన కడుపులోకి వెళ్ళిన పండ్లు యాసిడ్‌గా మారి పూర్తి స్థాయిలో ఆహారాన్ని జీర్ణం కానివ్వదు. పండును మరో పదార్థంతో కలిపి తినడం వల్ల గ్యాస్ ఉత్పత్తి అయి, పొట్ట అంతా గందరగోళ పరుస్తుంది. పండ్ల ముక్కలు నేరుగా లేదా, జ్యూస్‌గా తీసుకుంటే ఇవి పేగులోకి వెళ్ళడానికి సిద్ధంగా ఉంటాయి. దీని వల్ల పేగుల్లో నిల్వ ఉండే ఆహారాన్ని సైతం జీర్ణం చేస్తాయి. లేదంటే ఆహారాన్ని జీర్ణం చేసేందుకు అవసరమైన యాసిడ్‌లను తయారు చేస్తాయి. కాబట్టి పండ్లను ఖాళీ కడుపుతోనే తినాలి. లేదంటే భోజనానికి కొంత సమయం ముందు తినాలి. పండ్లను సరైన పద్ధతిలో తింటే అందం, ఆయుష్షు, ఆరోగ్యం, శక్తి, సంతోషం, సాధారణ బరువు వంటివి మన సొంతమవుతాయి. పండ్ల రసాలు తాగాలనుకుంటే, తాజా పండ్ల రసాలను మాత్రమే తాగాలి. పాకెట్లలో, బాటిళ్ళలో అందుబాటులో ఉండే వాటిని తాగొద్దు.

ఏర్పడే సమస్యలు

చాలా మంది చాలా రకాలుగా ఫిర్యాదులు చేస్తుంటారు. 'నేను పుచ్చకాయ తినగానే కడుపులో నుంచి గాలి నోటి ద్వారా బయటకు వస్తోంది, పనస పండు తినగానే పొట్ట ఎత్తుగా అయింది, అరటిపండు తినగానే బాత్‌రూమ్‌కు వెళ్లాల్సి వస్తోంది' వంటివి సర్వసాధారణంగా వినిపిస్తుంటాయి. కానీ ఖాళీ కడుపుతో పండ్లు తింటే ఇలాంటి సమస్యలు దరిచేరవు. వెంట్రుకలు ఎరుపు రంగులోకి మారడం, బట్టతల రావడం, కడుపు ఉబ్బడం, కండ్ల కింద నల్లటి వలయాలు రావడం వంటివి ఖాళీ కడుపుతో కాకుండా పండ్లను ఇతర ఆహార పదార్థాలతో కలిపి తీసుకోకపోవడం వల్లనే ఏర్పడతాయి.


ఎన్నో పరిశోధనల ఫలితంగా..

డాక్టర్ స్టీఫెన్ మాక్ కాన్సర్ బాధితులను ఒక పద్ధతిలో బాగు చేశారు. సోలార్ శక్తిని ఉపయోగించకముందు ఆయన సహజ వైద్యాన్ని ఉపయోగించి అనారోగ్యాలను నయం చేశారు. 'క్యాన్సర్‌ను బాగు చేయడంలో దాదాపు 80 శాతం విజయం సాధించాను. రోజూ పండ్లను తింటే క్యాన్సర్ బాధితులు చనిపోరు' అని ఆయన వెల్లడించారు. డాక్టర్ హెర్బెర్ట్ హెల్టాన్ చేసిన పరిశోధనల ఆధారంగా వాస్తవానికి నిమ్మ, నారింజ వంటి పండ్లు ఆమ్లత్వం కలిగినవి కావు, అవి మన పొట్టలోనే ఆల్కలీన్‌గా మారతాయని నిరూపించారు.

వేడిచేసిన పానీయాలు తాగొద్దు

ఉడికించిన పండ్లను తినకూడదు. ఎందుకంటే, వాటిలో ఉంటే సహజత్వం, పోషకాలు ఆ తర్వాత ఉండవు. అలా చేయడం వల్ల వాటి రుచి మాత్రమే పొందగలుగుతాం. వండే క్రమంలో వాటిలోని విటమిన్లు కనుమరుగవుతాయి. రసాలు తయారు చేసుకోవడం కంటే, పండును నేరుగా తినడం ఇంకా ఉత్తమం. తాజా పండ్ల రసాలు తాగేపుడు మెల్లగా తాగాలి. నోటిలో ఉండే లాలాజలాన్ని కూడా కలిపి మింగడం వల్ల ఉపయోగం ఉంటుంది.

తాజా పండ్లను తీసుకుంటే శరీరంలో ఉండే విషతుల్యాలన్నీ విసర్జితమై, చర్మం కాంతులీనుతుందని పోషకాహార నిపుణులు పేర్కొంటున్నారు.



కివి పండు : చూడడానికి చిన్నదైనప్పటికీ చాలా శక్తివంతమైనది. దీనిలో పొటాషియం, మెగ్నీషియం, విటమిన్ ఇ, ఫైబర్ వంటివి పుష్కలంగా అందుతాయి. ఇందులో ఉండే విటమిన్ సి రెండు నారింజ పండ్లలో ఉండేంత ఉంటుంది.

యాపిల్ : రోజుకో యాపిల్ తినడం వల్ల డాక్టర్ అవసరం ఉండదని నానుడి ఉంది. యాపిల్‌లో విటమిన్ సి తక్కువగానే ఉన్నప్పటికీ పెద్ద పండ్లతో పోలిస్తే యాంటి ఆక్సిడెంట్ గుణం ఎక్కువగా ఉంటుంది. ఇది పెద్దపేగుకు వచ్చే కాన్సర్, గుండె పోటు ముప్పు నుంచి కాపాడుతుంది.

స్ట్రాబెర్రి : మన శరీరాన్ని రక్షించే పండని చెప్పవచ్చు. పెద్ద పండ్లతో పోల్చుకుంటే ఇందులో ఎక్కువ మొత్తంలో యాంటి ఆక్సిడెంట్ గుణం ఉంటుంది. శరీరాన్ని కాన్సర్ కారకం నుంచి కాపాడుతుంది. రక్తనాళాల్లో రక్తం గడ్డ కట్టకుండా కాపాడుతుంది.

నారింజ : దీన్ని తియ్యనైన మందని చెప్పవచ్చు. ఒక రోజులో 2 నుంచి 4 నారింజలు తీసుకుంటే జలుబు దరి చేరదు. తక్కువ కొలెస్ట్రాల్‌ను కలిగి ఉంటుంది. కిడ్నీలో రాళ్ళు రాకుండా కాపాడుతుంది. పెద్దపేగు కాన్సర్ ముప్పును దరిచేరనీయదు.

పుచ్చకాయ : చల్లగా ఉండడంతో పాటు దాహం తీర్చే గుణం కలిగి ఉంటుంది. దీనిలో దాదాపు 92 శాతం నీరు ఉంటుంది. శరీర రోగ నిరోధక శక్తిని పెంచే గ్లూటాథియోన్ అనే యాంటి ఆక్సిడెంట్‌తో నిండి ఉంటుంది. అంతేకాదు, కాన్సర్‌తో పోరాడే లైసోపిన్ ఆక్సిడెంట్‌ను కలిగి ఉంటుంది. దీనితో పాటు విటమిన్ సి, పొటాషియం వంటి పోషకాలను ఉన్నట్టు గుర్తించారు.

జామ, బొప్పాయి : ఈ రెండింటిలోనూ విటమిన్ సి అధికంగా ఉంటుంది. జామలో ఫైబర్ ఎక్కువగా ఉంటుంది. ఇది మలబద్ధకాన్ని దరి చేరనీయదు. బొప్పాయిలో కెరోటిన్ అధికంగా ఉంటుంది. ఇది కండ్లకు మేలు చేస్తుంది.



కంపు కొడుతున్నాయా..?

ఒకప్పుడు మంచినీళ్లు తాగడానికి ఉపయోగించిన గ్లాసుల వాడకం రానురాను కనుమరుగవుతోంది. వాటి స్థానంలో వాటర్ బాటిల్స్ వచ్చి చేరాయి. ఇంటి అవసరాలకే కాదు, చుట్టాలు, స్నేహితులు వచ్చినా గ్లాసుల్లో ఇవ్వడం తగ్గిపోయింది. మంచినీళ్లు ఇవ్వాలంటే బాటిల్స్‌లోనే ఇవ్వడం అలవాటైపోయింది. అంతేకాదు, ఆఫీసులకు కూడా వాటర్ బాటిల్స్ తీసుకెళ్ళడం పరిపాటి అయ్యింది. అందులోనూ ప్రస్తుత వేసవిలో వీటి వాడకం మరీ ఎక్కువ. అయితే నిత్యం ఉపయోగించే ఈ బాటిల్స్ సరిగా శుభ్రం చేసుకోకపోతే వాసన వస్తాయి. బాటిల్ అడుగున జిగటగా, పసుపు రంగులోకి మారుతుంది. వీటి వల్ల అనారోగ్య సమస్యలూ దరిచేరతాయి. అందుకే వీటి వాడకంలో, శుభ్రం చేయడంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. ఇంట్లో ఉపయోగించే వాటితోనే వీటిని సులువుగా శుభ్రం చేయవచ్చు. అదెలాగంటే...

- మురికి చేతులతో ఎప్పుడూ వాటర్ బాటిల్ తీసుకోకూడదు. దీంతో బాటిల్ మూత మురికిగా మారుతుంది.
- వాటర్ బాటిల్‌ను వారానికి ఒకసారి వేడి నీటిలో నానబెట్టి కడగాలి.
- ఆహారంలో, ఇంటిని శుభ్రం చేయడంలో ఉపయోగించే వెనిగర్‌ను వీటిని శుభ్రం చేయడానికి కూడా ఉపయోగించవచ్చు. ఎందుకంటే దీనిని సహజ క్రిమి సంహారక పదార్థంగా ఉపయోగిస్తారు. అందువల్ల బాటిల్ శుభ్రమవడమేకాక, మరకలు, దుర్వాసనలూ తొలగిపోతాయి.

ఎలా చేయాలి

బాటిల్‌ను శుభ్రం చేయడానికి ఒక భాగం వెనిగర్‌ను ఒక భాగం గోరువెచ్చని నీటితో కలపాలి. స్ప్రే బాటిల్‌లో వేసి స్ప్రే చేయాలి. సుమారు 15-20 నిమిషాల తర్వాత శుభ్రమైన నీటితో బాటిల్‌ను బాగా కడగాలి. ఇలా చేస్తే బాటిల్ బాగా శుభ్రపడుతుంది.

బాటిల్ వాసన వస్తుంటే నిమ్మకాయ, వెనిగర్‌లు కలపాలి. ఈ లిక్విడ్‌తో బాటిల్ నింపాలి. అరగంట పాటు పక్కన పెట్టి, తర్వాత కడిగేసి పూర్తిగా ఆరనివ్వాలి. బాటిల్ పూర్తిగా ఆరనివ్వడం చాలా ముఖ్యం. ప్లాస్టిక్ బాటిల్స్, స్టీల్ బాటిల్స్, సీసా బాటిల్స్ ఏవైనా సరే ఈ విధంగా కడిగితే మళ్ళీ ఉపయోగించడానికి చాలా బాగుంటాయి.

నేరస్తులుగా చూడొద్దు

(మొదటిపేజీ తరువాయి)

ఆర్థికవేత్త మధురా స్వామినాథన్ సూచించారు. కేంద్ర ప్రభుత్వం ఎంఎస్ స్వామినాథన్‌కు అత్యున్నత పౌర పురస్కారం ప్రకటించిన సందర్భాన్ని పురస్కరించుకొని భారతీయ వ్యవసాయ పరిశోధనా సంస్థ (ఐఏఆర్ఐ) మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె ప్రసంగించారు. డిమాండ్ల సాధన కోసం ఆందోళన చేస్తున్న రైతులను దేశ రాజధానిలోకి ప్రవేశించకుండా అడ్డుకోవడాన్ని ఆమె ప్రస్తావిస్తూ ఈ వ్యాఖ్య చేశారు. శాస్త్రవేత్తలు రైతులను సంప్రదించాలే కానీ వారిని నేరస్థులుగా చూడరాదని ఆమె హితవు పలికారు.

'పంజాబ్ రైతులు ఢిల్లీ దిశగా కదులుతున్నారు. వారి కోసం హర్యానాలో జైళ్లను సిద్ధం చేశారు. బారికేడ్లు ఏర్పాటు చేశారు. అన్నదాతలను అడ్డుకునేందుకు చేయాల్సిందంతా చేస్తున్నారు' అని మధురా స్వామినాథన్ చెప్పారు. వారు రైతులే తప్ప నేరస్థులు కాదని సభికుల హర్షధ్వానాల మధ్య అన్నారు. 'నేను దేశంలోని ప్రముఖ శాస్త్రవేత్తలందరినీ కోరుతున్నాను. అన్నదాతలతో మాట్లాడండి. మనం వారిని నేరస్థులుగా భావించకూడదు. సమస్యకు పరిష్కారం వెతకాలి. ఇది నా అభ్యర్థన. మనం స్వామినాథన్‌ను గౌరవించాలంటే భవిష్యత్ ప్రణాళికల కోసం రూపొందించే వ్యూహంలో రైతులను కూడా భాగస్వాములను చేయాలి' అని కోరారు.

కనీస మద్దతు ధరల కోసం భారత రైతులకు ఓ చట్టం అవసరమని శాస్త్రవేత్త ఆర్‌బీ సింగ్ చెప్పారు. రైతుల సమస్యలను అధ్యయనం చేసిన స్వామినాథన్ కమిషన్‌లో ఆయన కూడా సభ్యుడిగా వ్యవహరించారు. రైతులు తాము పండించిన పంటకు సరైన ధర పొందాలంటే ఎంఎస్‌పీపై కొత్త చట్టాన్ని రూపొందించాల్సిన అవసరం ఉన్నదని సింగ్ తెలిపారు. అప్పుడే కమిషన్ చేసిన సిఫార్సులు సక్రమంగా అమలు జరుగుతాయని అన్నారు. పంట ఉత్పత్తి వ్యయం కంటే ఎంఎస్‌పీ యాభై శాతం అధికంగా ఉండాలన్న కమిషన్ సిఫారసును దేశమంతటా ఒకేలా అమలు చేయలేదని సింగ్ చెప్పారు.

దశాబ్దం నుంచి దగా

(మొదటిపేజీ తరువాయి)

అందించిన సమాచారాన్ని ఉపయోగించుకుంటూ 2015-16లో భారతీయ రైతుల జాతీయ సగటు వార్షిక ఆదాయం రూ.96,703 ఉంటుందని అంచనా వేసింది. దీని ఆధారంగానే 2022 నాటికి రైతుల ఆదాయం రూ.1,92,694 (2015-16 ధరల ప్రకారం) ఉండాలని లక్ష్యంగా నిర్దేశించింది. 2022-23 ధరల ప్రకారమైతే అన్నదాతల వార్షిక సగటు ఆదాయం రూ.2,71,378 ఉండాలని కూడా తెలిపింది. ఈ లక్ష్యాన్ని సాధించాలంటే ఏడు సంవత్సరాల పాటు వ్యవసాయ ఆదాయం ఏటా 10.4% వృద్ధి సాధించాల్సి ఉంటుందని లెక్కలు వేసింది.

ఇవీ వాస్తవాలు...

2022-23 సంవత్సరపు లెక్కలు ఇంకా అందుబాటులోకి రాలేదు. 2021లో విడుదల చేసిన సర్వే నివేదిక ప్రకారం 2015-16లో రూ.96,703గా ఉన్న రైతు కుటుంబాల సగటు వార్షిక ఆదాయం 2018-19 నాటికి రూ.1,22,616కి పెరిగింది. దీనిని బట్టి అర్థమయింది ఏమిటంటే రైతుల ఆదాయం కేవలం నామమాత్రంగా 2.98% మాత్రమే పెరిగింది. 2002-03 నుండి 2012-13 మధ్య కాలం వరకూ రైతు కటుంబాల సగటు వార్షిక ఆదాయం 3% మేర పెరగగా తాజాగా ఆ స్థాయిలో కూడా పెరుగుదల లేకపోవడం గమనార్హం. 2003-2013 మధ్య దశాబ్ద కాలం దేశాన్ని కాంగ్రెస్ నేతృతత్వంలోని యూడీఎఫ్ పరిపాలించింది. ఇక్కడ గమనించాల్సిన ముఖ్యమైన విషయమేమంటే 2015-16 నుండి పంటల సాగు ద్వారా వచ్చిన ఆదాయం ఏటా 1.5% మేర తగ్గుతూ వస్తోంది.

రాష్ట్రాల పైకి నెట్టేసిన కేంద్రం

రైతుల ఆదాయం తగ్గుతున్నప్పటికీ దేశీయ వ్యవసాయ రంగం గత దశాబ్ద కాలంలో 3.8% వృద్ధి నమోదు చేసింది. అంతకుముందు దశాబ్ద కాలంలో కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ హయాంలో ఈ వృద్ధి 3.5%గా నమోదైంది. రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామని ఇచ్చిన హామీ అమలులో పురోగతిపై గత సంవత్సరం డిసెంబరులో అడిగిన ప్రశ్నకు కేంద్ర వ్యవసాయ మంత్రి నరేంద్ర సింగ్ తోమర్ సమాధానమిస్తూ 'వ్యవసాయం రాష్ట్రానికి సంబంధించిన అంశం. రాష్ట్రంలో వ్యవసాయాభివృద్ధి, రైతుల సంక్షేమానికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వాలే అవసరమైన చర్యలు తీసుకుంటాయి' అని చెప్పి తప్పించుకున్నారు. రాష్ట్రాల ప్రయత్నాలకు కేంద్రం విధానపరమైన చర్యలు, బడ్జెటరీ మద్దతు, వివిధ పథకాలు-కార్యక్రమాల ద్వారా మద్దతు మాత్రం అందిస్తుందని చెప్పుకొచ్చారు.

అమలుకు నోచని జాతీయ కమిషన్ సిఫార్సులు

రైతులపై ఏర్పాటు చేసిన జాతీయ కమిషన్ చేసిన సిఫార్సులకు 2018-19 బడ్జెట్‌లో మోడీ ప్రభుత్వం



పచ్చజెండా ఊపింది. పంటల కనీస మద్దతు ధరలు సగటు ఉత్పత్తి వ్యయం కంటే కనీసం యాభై శాతం అదనంగా ఉండాలన్న సిఫార్సును ఆమోదించింది. దీనికి కట్టుబడి ఉంటామని 2022 డిసెంబరులో వ్యవసాయ మంత్రి పార్లమెంటుకు తెలియజేశారు. అయితే గత దశాబ్ద కాలంలో కనీస మద్దతు ధరల పెంపు యూపీఏ హయాంతో పోలిస్తే కనిష్ట స్థాయిలోనే ఉన్నదని ప్రభుత్వ గణాంకాలు చెబుతున్నాయి.

భూమి లేని రైతులకు అందని పథకం

వ్యవసాయ రంగం కోసం మోడీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకం ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి. దీనిని పీఎం కిసాన్ అని పిలుస్తున్నారు. ఈ నగదు బదిలీ పథకాన్ని 2019లో ప్రారంభించారు. గత సంవత్సరం డిసెంబరులో పార్లమెంటుకు ప్రభుత్వం అందజేసిన సమాచారం ప్రకారం ఈ పథకం ద్వారా ఇప్పటి వరకూ 11 కోట్ల మంది రైతులు లబ్ది పొందారు. అయితే దేశంలోని వ్యవసాయ కార్మికుల్లో కనీసం 55%గా ఉన్న భూమిలేని రైతులు ఈ పథకం పరిధిలోకి రావడం లేదు.

వ్యవసాయ చట్టాలపై వెనక్కి

ఇక 2020లో మోడీ ప్రభుత్వం మూడు వ్యవసాయ చట్టాలను తీసుకొచ్చిన విషయం తెలిసిందే. ఈ చట్టాల ద్వారా వ్యవసాయ వాణిజ్యం పెరుగుతుందని, రైతులు ఎలాంటి ఆంక్షలు లేకుండా తమ ఉత్పత్తులను ప్రైవేటు కంపెనీలకు అమ్ముకోవచ్చునని తెలిపింది. అయితే ఈ చట్టాలు వ్యవసాయ రంగాన్ని కార్పొరేటీకరించేందుకు ఉద్దేశించినవేనని ఉత్తరాది రాష్ట్రాల రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ చట్టాలపై తీవ్ర నిరసనలు వ్యక్తం కావడం, అన్నదాతలు దీర్ఘకాలం ఉద్యమించడంతో 2021లో వాటిని కేంద్రం వెనక్కి తీసుకోక తప్పలేదు.

మోడీ సర్కార్‌కు గుణపాఠం తప్పదు : సీఐటీయూ, ఏఐకేఎస్

న్యూఢిల్లీ : కనీస మద్దతు ధరకు చట్టపరమైన హామీని కల్పించడంతో సహా తమ డిమాండ్ల సాధన కోసం చలో ఢిల్లీకి వెళుతున్న రైతులపై పంజాబ్, హర్యానా సరిహద్దుల్లో హర్యానా పోలీసులు దారుణంగా హింసాత్మక, అణచివేత చర్యలకు పాల్పడడాన్ని సీఐటీయూ, ఏఐకేఎస్‌లు తీవ్రంగా ఖండించాయి. రైతులపై బాష్పవాయు గోళాల ప్రయోగానికి డ్రోన్‌లను ఉపయోగించడం చూస్తుంటే ఈ దేశ రైతాంగంపై బీజేపీ ప్రభుత్వం ఎంత కక్షతో, ప్రతీకారంతో వుందో అర్థమవుతోందని విమర్శించాయి. ఈ మేరకు సీఐటీయూ ప్రధాన కార్యదర్శి తపన్‌సేన్, ఏఐకేఎస్ అధ్యక్ష కార్యదర్శులు అశోక్ ధావలె, విజూ కృష్ణన్‌లు వేర్వేరుగా ప్రకటనలు జారీ చేశారు. నిరసన తెలియచేసే ప్రజాస్వామిక హక్కుపై ఇటువంటి దాడులకు పాల్పడితే పరిస్థితులు తీవ్రంగా మారతాయని హెచ్చరించారు. సంయుక్త కిసాన్ మోర్చా, ఇతర కేంద్ర కార్మిక సంఘాలతో కలిసి ఎఐకెఎస్ ఇటువంటి అణచివేత చర్యలను ప్రతిఘటిస్తుందని నేతలు హెచ్చరించారు. తక్షణమే అరెస్టు చేసిన నేతలందరినీ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సరిహద్దుల్లో రెండు పాయింట్ల వద్ద మంగళవారం రైతులపై దాడి జరిగింది. వారిపై లాఠీచార్జి చేయడంతో పాటూ బాష్పవాయు గోళాలను ప్రయోగించారు. రైతులతో అనేక దఫాలుగా చర్చలు జరిపిన తర్వాత కనీస మద్దతు ధరకు చట్టపరమైన హామీ కల్పించడం సాధ్యం కాదని కేంద్ర వ్యవసాయ మంత్రి అర్జున్ ముండా స్పష్టం చేశారు. కనీస మద్దతు ధరకు చట్టపరమైన హామీతో పాటూ స్వామినాథన్ కమిషన్ సిఫారసులను తక్షణమే అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వ కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలను తీవ్రంగా నిరసిస్తూ ఎస్కేఎం, సీఐటీయూలు నిరంతరంగా పోరాటాలు జరుపుతునే వున్నాయని పేర్కొంది. అన్ని రంగాల్లో మోడీ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైందని విమర్శించారు. ప్రజాస్వామ్యంపై, భార రాజ్యాంగంపై జరుగుతున్న దాడులను, విషపూరితమైన మతోన్మాద దాడులను ప్రతిఘటించాల్సిందిగా సమాజంలోని అన్ని వర్గాలకు పిలుపిచ్చారు.

రైతులపై పోలీసుల కర్కశం

(మొదటిపేజీ తరువాయి)

సరిహద్దు పాయింట్ల వద్ద ఆంక్షలు విధించడంతో సరిహద్దుల్లో ఉద్రిక్తత నెలకొంది. పంజాబ్-హర్యానా సరిహద్దులో శాంతియుతంగా నిరసనలు తెలుపుతున్న రైతులపై పోలీసులు మరోసారి టియర్ గ్యాస్ ప్రయోగించారు. భారీ భద్రత, కాంక్రీట్ బారికేడ్లు ఉన్నప్పటికీ రైతులు తమ ఢిల్లీ చలో మార్చ్‌ను కొనసాగించడంతో శంభు ప్రాంతం వద్ద వందలాది ట్రాక్టర్లు బారులు తీరాయి. బారికేడ్లు దాటి రాకుండా ఉండేందుకు ఆందోళనకారులపై పోలీసులు భాష్పవాయువును ప్రయోగించారు. నిరసనల కారణంగా దేశ రాజధాని ఢిల్లీతో పాటు సమీప నగరాల్లోనూ ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. రైతులు ఢిల్లీకి రాకుండా అడ్డుకునేందుకు సరిహద్దు వద్ద భారీ బందోబస్తు నిర్వహిస్తున్నారు.

రైతుల 'చలో ఢిల్లీ' మార్చ్‌ను అడ్డుకునేందుకు పోలీసులు అనేక ప్రయత్నాలు చేస్తున్నారు. డ్రోన్లతో టియర్ గ్యాస్ షెల్స్ ప్రయోగిస్తున్నారు. అయితే రైతులు గాలిపటాలు ఎగురవేసి డ్రోన్లను అడ్డుకుంటున్నారు. గాలిపటాల దారాలు డ్రోన్లకు చుట్టుకోవడంతో కొన్ని కూలిపోయాయి. ఈ వీడియో క్లిప్స్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి.

హర్యానా పోలీసులు, భద్రతా సిబ్బంది టియర్ గ్యాస్ షెల్స్ ప్రయోగం నేపథ్యంలో రైతులు తగిన జాగ్రత్తలు తీసుకున్నారు. టియర్ గ్యాస్ ప్రభావాన్ని తగ్గించుకునే ప్రయత్నం చేస్తున్నారు. వెంట తెచ్చుకున్న వాటర్ బాటిల్స్‌తో దుస్తులు తడిగా ఉంచుకుంటున్నారు. అలాగే టియర్ గ్యాస్ ప్రభావం నుంచి రక్షణ కల్పించే దుస్తులు ధరిస్తున్నారు.

మూడు వ్యవసాయ చట్టాల రద్దు కోసం 2020-21 నిరసనల తరువాత మరోసారి ఆందోళనలు కొనసాగిస్తున్నారు. తమ పంట ఉత్పత్తులకు కనీస మద్దతు ధర కల్పించాలని కోరుతూ ఢిల్లీ బాటపట్టారు. వ్యవసాయ ఉత్పత్తులపై ప్రభుత్వం ఇప్పటికే ఎంఎస్‌పిని అందజేస్తున్నప్పటికీ దానికి హామీ ఇచ్చే చట్టం తీసుకురావాలని డిమాండ్ చేస్తున్నారు.

చర్చలకు సిద్ధంగా ఉన్నాం: కేంద్ర మంత్రి అర్జున్ ముండా


ఆందోళన చేపట్టిన అన్నదాలతో చర్చలకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి అర్జున్ ముండా పేర్కొన్నారు. చర్చలకు అనువైన వాతావరణం కల్పించాలని, సాధారణ జనజీవనానికి అవాంతరాలు కల్పించరాదని రైతులకు విజ్ఞప్తి చేశారు. సాధారణ జనజీవనం భగ్నం కాకుండా చూడాలని తాను రైతు సంఘాలను కోరుతున్నానని, రైతు సంఘాలతో సానుకూల వాతావరణంలో చర్చలు కొనసాగుతాయని తానిప్పటికే స్పష్టం చేశానని మంత్రి పేర్కొన్నారు. రైతు సంఘంతో నిర్మాణాత్మక చర్చలకు ప్రయత్నాలు కొనసాగుతున్నాయని అన్నారు. అన్ని దృక్కోణాలను పరిగణనలోకి తీసుకుని చర్చలు జరిపేందుకు సంసిద్ధత వ్యక్తం చేసిన మంత్రి, చర్చలకు అనుకూలమైన వాతావరణం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. చట్టంపై నిర్ణయం తీసుకోలేమని రైతు సంఘాలు అర్థం చేసుకోవాలని ఆయన అన్నారు. చర్చలతో రైతు సంఘాలు సమస్యల పరిష్కారానికి ముందుకు రావాలని, అంతేగానీ.. రాజకీయ పార్టీల ప్రలోభాలకు రైతు సంఘాలు గురి కావొద్దని అన్నారు.

నిర్బంధాన్ని ఆపాలి : రైతు సంఘం నేత

పంజాబ్ కిసాన్ మజ్దూర్ సంఘర్ష్ కమిటీ జనరల్ సెక్రటరీ సర్వన్ సింగ్ పంధేర్ బుధవారం నాడు ఆందోళన చేస్తున్న రైతులపై టియర్ గ్యాస్, ఇతర బలగాల ప్రయోగాన్ని నిలిపివేసి సుహృద్భావ వాతావరణాన్ని సృష్టించాలని ప్రభుత్వాన్ని అభ్యర్థించారు. దేశ రాజధానికి పాదయాత్ర చేస్తున్న రైతులను చెదరగొట్టేందుకు పోలీసులు సెల్ఫ్‌లోడింగ్ రైఫిల్ (ఎస్ఎల్ఆర్)ను ప్లాస్టిక్, రబ్బరు బుల్లెట్‌లు, టియర్ గ్యాస్ ప్రయోగించారని ఆయన విమర్శించారు. "మా రైతులను చెదరగొట్టేందుకు పోలీసులు ఎస్ఎల్ఆర్ బుల్లెట్లు, టియర్ గ్యాస్, ప్లాస్టిక్, రబ్బర్ బుల్లెట్‌లను ప్రయోగించారు. ఇలాంటి చర్యలు ఆమోదయోగ్యం కాదు. మమ్మల్ని పిలిచి ఖలిస్తానీ ట్యాగ్‌ను వేస్తున్నారు. కాంగ్రెస్, పంజాబ్ ప్రభుత్వానికి మద్దతుదారు, ఇది సరైనది కాదు" అని పంధేర్ అన్నారు. తమ డిమాండ్లపై కేంద్రం నుండి చర్చలకు ఆహ్వానం అందితే దానిని పరిశీలిస్తామని, అయితే చర్చలకు సానుకూల వాతావరణం ఉండేలా చూడాలన్నారు. కనీస మద్దతు ధర (ఎంఎస్‌పి)కి హామీ ఇచ్చేలా చట్టం చేయాలని డిమాండ్ చేశారు.

డ్రోన్లకు గాలిపటాలతో చెక్

- మోడీ సర్కార్‌కు వ్యూహానికి రైతుల ఎదురుదాడి



న్యూఢిల్లీ : రైతులు చేపడుతున్న ఢిల్లీ చలో మార్చ్ రెండో రోజుకి చేరుకుంది. పంజాబ్, హర్యానా సరిహద్దుల నుంచి రైతులు ఢిల్లీకి చేరుకుంటున్నారు. అయితే రైతులను అడ్డుకునేందుకు పోలీసులు తీవ్రంగా యత్నిస్తున్నారు. వారిపై హర్యానా పోలీసులు డ్రోన్ల ద్వారా టియర్‌గ్యాస్‌ను ప్రయోగించారు. డ్రోన్ల ద్వారా టియర్ గ్యాస్ షెల్స్ ప్రయోగిస్తున్నారు. అయితే రైతులు వాటికి గాలిపటాలతో చెక్ పెడుతున్నారు. గాలిపటాలను ఎగరవేయడంతో వాటి దారాలు డ్రోన్లకు చుట్టుకుని కూలిపోతున్నాయి. ఈ దృశ్యాలు సోషల్‌మీడియాలో వైరలయ్యాయి.

కనీస మద్దతు ధర, రుణ మాఫీ సహా ఇతర వ్యవసాయ సంస్కరణలకు చట్టపరమైన హామీని డిమాండ్ చేస్తూ రైతులు ఢిల్లీలో ఆందోళన చేపట్టేందుకు సిద్ధమయ్యారు. రైతులపై టియర్‌గ్యాస్ షెల్స్ ప్రయోగించడంతో అంబాలా సమీపంలోని శంబు సరిహద్దులో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది.

ఆధిపత్య సమరం!

- నేటి నుంచి భారత్, ఇంగ్లాండ్ మూడో టెస్టు
- రాజ్‌కోట్‌లో గెలుపే లక్ష్యంగా ఇరు జట్లు
- రెట్టించిన ఉత్సాహంతో ఆతిథ్య భారత్
- ఉదయం 9.30 నుంచి స్పోర్ట్స్18లో..

భారత్, ఇంగ్లాండ్ టెస్టు సవాల్ రసవత్తర దశకు చేరుకుంది. హైదరాబాద్‌లో బజ్‌బాల్, విశాఖలో స్పిన్‌బాల్ పైచేయి సాధించగా.. రాజ్‌కోట్‌లో ఏం జరుగుతుందనే ఉత్కంఠ రెట్టింపు అవుతుంది. ఇటు వాస్తవిక పరిస్థితులను అవగాహన చేసుకుని దూసుకెళ్లాలనే టీమ్ ఇండియా మంత్ర, అటు ఎటువంటి లెక్కలు చూడకుండా దండెత్తాలనే ఇంగ్లాండ్ తంత్ర.. రెండూ ఇరు జట్లకు సత్ఫలితాలు ఇచ్చాయి. ముచ్చటగా మూడో టెస్టులో పైచేయి ఎవరిది? సిరీస్‌లో 2-1 ఆధిపత్యం కోసం భారత్, ఇంగ్లాండ్ నేటి నుంచి సమరానికి సై అంటున్నాయి.

రాజ్‌కోట్‌లో రికార్డుల వేట సాగనుంది. భారత ట్రంప్‌కార్డ్ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ 500వ టెస్టు వికెట్ ముంగిట నిలువగా.. ఇంగ్లాండ్ పేస్ దిగ్గజం జేమ్స్ అండర్సన్ 700వ టెస్టు వికెట్‌పై కన్నేశాడు. ఇంగ్లాండ్ కెప్టెన్ బెన్ స్టోక్స్ కెరీర్ 100వ టెస్టు మ్యాచ్‌ను రాజ్‌కోట్‌లో ఆడేందుకు రంగం సిద్ధం చేసుకున్నాడు. అసమాన ప్రదర్శనలతో ఇటీవల టెస్టు క్రికెట్‌ను మరింత రక్తికట్టించిన బెన్‌స్టోక్స్ నేడు భారత్‌పై స్పెషల్ షోకు సిద్ధమవుతున్నాడు. నేటి నుంచి భారత్, ఇంగ్లాండ్ మూడో టెస్టు పోరు.



సరికొత్త సవాల్ : రాజ్‌కోట్‌లో యువ బ్యాటింగ్ లైనప్‌తో ఆడనున్న రోహిత్ శర్మ



భావి తరం : రజత్ పటీదార్, యశస్వి, ధ్రువ్ జురెల్, సర్ఫరాజ్ ఖాన్

నవతెలంగాణ-రాజ్‌కోట్

భారత్, ఇంగ్లాండ్ టెస్టు సిరీస్ ఫలితాలతో పాటు వ్యక్తిగత ప్రదర్శనల్లోనూ భిన్న కోణం ఆవిష్కరించింది. పరుగుల వేటలో విరాట్ కోహ్లి, జో రూట్.. వికెట్ల వేటలో జడేజా, బెన్ స్టోక్స్ వార్తల్లో నిలవాల్సిన సిరీస్‌లో ఇరు వైపులా యువ క్రికెటర్లు అనూహ్యంగా తెరపైకి వచ్చారు. రెండు వైపులా అనుభవలేమి క్రికెటర్లు గెలుపు ప్రదర్శనలు చేస్తూ టెస్టు సిరీస్‌ను మరింత ఆసక్తికరంగా మార్చారు. అయితే, మూడో టెస్టులో కథ కాస్త మారనుంది. ఇరు జట్ల నుంచి సీనియర్ క్రికెటర్లు రికార్డుల వేటలో ఉండగా బెన్ స్టోక్స్, జేమ్స్ అండర్సన్, రవిచంద్రన్ అశ్విన్‌లు రాజ్‌కోట్ టెస్టులో ప్రధాన ఆకర్షణగా నిలువనున్నారు. ఇరు జట్లు ఇద్దరేసి పేసర్లతో బరిలోకి దిగుతున్న టెస్టులో ఆధిపత్యం కోసం అమీతుమీ ఖాయమే.

యువ మిడిల్ ఆర్డర్

విరాట్ కోహ్లి అందుబాటులో లేడు. కెఎల్ రాహుల్ గాయపడ్డాడు. శ్రేయస్ అయ్యర్ ఉద్వాసనకు గురయ్యాడు. భారత మిడిల్ ఆర్డర్ ఒక్కసారిగా ఖాళీ అయ్యింది. విశాఖలో రజత్ పటీదార్ నం.4 స్థానంలో అరంగ్రేటం చేయగా.. ఇప్పుడు నం.5 స్థానంలో సర్ఫరాజ్ ఖాన్ బ్యాట్ పట్టనున్నాడు. బ్యాటింగ్ విభాగంలో రోహిత్ శర్మ ఒక్కడే సీనియర్ ఆటగాడు. యశస్వి జైస్వాల్, శుభ్‌మన్ గిల్, సర్ఫరాజ్ ఖాన్, రజత్ పటీదార్ రూపంలో యువ బ్యాటర్లు బరిలోకి దిగుతున్నారు. తొలి రెండు టెస్టుల్లో నిరాశపరిచిన రోహిత్ శర్మ రాజ్‌కోట్‌లో రాణించాల్సిన అవసరం ఉంది. అతడు వేగంగా వికెట్ కోల్పోతే.. మిడిల్ ఆర్డర్ ఒత్తిడిలో పడే ప్రమాదం ఉంది. యశస్వి జైస్వాల్, శుభ్‌మన్ గిల్ శతకాలతో ఫామ్‌లో ఉండటం భారత్‌కు సానుకూలం. రజత్ పటీదార్, సర్ఫరాజ్ ఖాన్ దేశవాళీ జోరు ఇక్కడ చూపిస్తే భారత్‌కు తిరుగుండదు. ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా బ్యాట్‌తో అదనపు బాధ్యత తీసుకోనున్నాడు. లోయర్ ఆర్డర్‌ను జడేజా ముందుకు నడిపించనున్నాడు. వికెట్ కీపర్‌గా తెలుగు తేజం కె.ఎస్ భరత్‌పై వేటు పడనుంది. ధ్రువ్ జురెల్ తుది జట్టులోకి రానున్నాడు. అశ్విన్, కుల్దీప్ స్పిన్.. బుమ్రా, సిరాజ్ పేస్ బాధ్యతలు పంచుకోనున్నారు.

అతడు మెరవాలని..

ఇంగ్లాండ్ స్టార్ బ్యాటర్ జో రూట్ తొలి రెండు టెస్టుల్లో నిరాశపరిచాడు. అతడు సాధించిన పరుగులు (52) కంటే సంధించిన ఓవర్లే (64) అధికం. పరుగుల వరద పారిస్తాడని ఆశించిన బ్యాటర్.. స్పిన్ దళంలో కుదురుకున్నాడు. బ్యాటింగ్ విభాగానికి రూట్ వైఫల్యం భారంగా మారింది. సంప్రదాయ క్రికెటర్ జో రూట్.. బజ్‌బాల్ మేనియాలో సహజశైలిని కోల్పోతున్నాడనే విమర్శలు ఉన్నాయి. రాజ్‌కోట్‌లో రూట్ బ్యాట్‌తో రాణించాలని ఆ జట్టు కోరుకుంటుంది. జాక్ క్రాలీ, బెన్ డకెట్, ఒలీ పోప్ రాణిస్తున్నారు. జానీ బెయిర్‌స్టో స్థాయికి తగ్గ ఇన్నింగ్స్ బాకీ పడ్డాడు. బెన్ స్టోక్స్ హైదరాబాద్, విశాఖలో మెప్పించే ఇన్నింగ్స్‌లు ఆడాడు. జశ్‌ప్రీత్ బుమ్రాపై ఎదురుదాడి వ్యూహంతో రానున్న ఇంగ్లాండ్ ఈ క్రమంలో వికెట్లు కోల్పోతుందా, పరుగులు పిండుకుంటుందా? చూడాలి. జేమ్స్ అండర్సన్, మార్క్ వుడ్ పేస్ బాధ్యతలు తీసుకోనుండగా.. టామ్ హర్ట్లీ, రెహాన్ అహ్మద్ స్పిన్ విభాగం చూసుకోనున్నారు.

ఇద్దరు అరంగ్రేటం!

భారత టెస్టు జట్టు ప్రణాళిక రహిత రూపాంతరం ముందు నిలిచింది!. పుజార, రహానెలను పక్కనపెట్టిన భారత్ పలు కారణాలతో విరాట్ కోహ్లి, కెఎల్ రాహుల్, శ్రేయస్ అయ్యర్ సేవలు కోల్పోయింది. దీంతో ఆతిథ్య జట్టు కుర్రాళ్లపై ఆధారపడుతుంది. విశాఖ టెస్టులో రజత్ పటీదార్ అరంగ్రేటం చేయగా.. రాజ్‌కోట్‌లో సర్ఫరాజ్ ఖాన్, ధ్రువ్ జురెల్‌లు తొలి టెస్టు క్యాప్ అందుకోనున్నారు.

పిచ్, వాతావరణం

రాజ్‌కోట్‌లో పరుగుల వరద పారనుంది. నిరంజన్ షా స్టేడియం పిచ్ స్పిన్‌తో పాటు పేస్‌కు అనుకూలం. ఇక్కడి శీతల వాతావరణం బ్యాటర్లకు, పేసర్లకు కొత్త ఉత్సాహం ఇవ్వనుంది. తక్కువ ఉష్ణోగ్రతలు స్పిన్ మాయను ఆలస్యం చేయనుంది. మూడో రోజు నుంచి స్పిన్‌కు అవకాశం ఉండవచ్చు. టాస్ నెగ్గిన జట్టు తొలుత బ్యాటింగ్ ఎంచుకోనుంది. నాల్గో ఇన్నింగ్స్‌లో ఛేదన కష్టతరం కానుంది.



100వ టెస్టుకు సిద్ధం : కెరీర్ మైలురాయి మ్యాచ్‌కు సిద్ధమైన బెన్ స్టోక్స్

తుది జట్లు (అంచనా)

భారత్ : రోహిత్ శర్మ (కెప్టెన్), యశస్వి జైస్వాల్, శుభ్‌మన్ గిల్, రజత్ పటీదార్, సర్ఫరాజ్ ఖాన్, రవీంద్ర జడేజా, ధ్రువ్ జురెల్, రవిచంద్రన్ అశ్విన్, కుల్దీప్ యాదవ్, జశ్‌ప్రీత్ బుమ్రా, మహ్మద్ సిరాజ్.

ఇంగ్లాండ్ : జాక్ క్రాలీ, బెన్ డకెట్, ఒలీ పోప్, జో రూట్, జానీ బెయిర్‌స్టో, బెన్ స్టోక్స్ (కెప్టెన్), బెన్ ఫోక్స్ (వికెట్ కీపర్), రెహాన్ అహ్మద్, టామ్ హర్ట్లీ, మార్క్‌వుడ్, జేమ్స్ అండర్సన్.

100 ఇంగ్లాండ్ కెప్టెన్ బెన్ స్టోక్స్ రాజ్‌కోట్‌లో కెరీర్ 100వ టెస్టు ఆడనున్నాడు. టెస్టు క్రికెట్‌లో ద్వి శతకాలు చేసిన బ్యాటర్లు 210 మంది, ఐదు వికెట్ల ప్రదర్శన చేసిన బౌలర్లు 752 మంది. ఈ రెండు ఘనతలు సాధించిన 34 మంది క్రికెటర్లే కాగా అందులో బెన్ స్టోక్స్ ఒకరు.

499 భారత ట్రంప్‌కార్డ్ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ 97 టెస్టుల్లో 23.92 సగటు, 51.5 స్ట్రయికరేట్‌తో 499 వికెట్లు పడగొట్టాడు. 500 వికెట్ల క్లబ్‌లో అడుగుపెట్టేందుకు అశ్విన్ ఒక్క వికెట్ దూరంలో నిలిచాడు.

33/23 ఇంగ్లాండ్ యువ స్పిన్ దళం అరుదైన ప్రదర్శన చేసింది. తొలి రెండు టెస్టుల్లో భారత స్పిన్నర్లు 38 సగటుతో 23 వికెట్లు పడగొట్టగా.. ఇంగ్లాండ్ స్పిన్నర్లు 34 సగటుతో 33 వికెట్లు ఖాతాలో వేసుకున్నారు.

700 ఇంగ్లాండ్ పేస్ దిగ్గజం జేమ్స్ అండర్సన్ టెస్టుల్లో 700 వికెట్ల మైలురాయికి ఐదు వికెట్ల దూరంలో నిలిచాడు. 184 టెస్టుల్లో 26.34 సగటుతో అండర్సన్ 695 వికెట్లు ఖాతాలో వేసుకున్నాడు.



చైనాకు భారత్ షాక్

- 3-2తో అమ్మాయిల మెరుపు విజయం
- హాంగ్‌కాంగ్‌పై అబ్బాయిల గెలుపు
- ఆసియా టీమ్ చాంపియన్‌షిప్స్

షా ఆలమ్ (మలేషియా) : బ్యాడ్మింటన్ ఆసియా టీమ్ చాంపియన్‌షిప్స్‌లో మన అమ్మాయిలు అద్భుత విజయం సాధించారు. ఒత్తిడిలేని గ్రూప్ దశ మ్యాచ్‌లో అగ్ర జట్టు చైనాను చిత్తు చేశారు. మహిళల గ్రూప్-డబ్ల్యూలో భారత్, చైనా రెండు జట్లే ఉన్నాయి. దీంతో ఇరు జట్లకు నాకౌట్ బెర్తులు ఖాయం. అయినా, ఏకైక గ్రూప్ దశ మ్యాచ్‌లో అమ్మాయిలు చెలరేగారు. మోకాలి గాయం నుంచి కోలుకున్న పి.వి సింధు వరుస గేముల్లో విజయంతో సత్తా చాటింది. సింధు 21-17, 21-15తో హన్ యెవపై గెలుపొందగా.. తనీశ క్రాస్టో, అశ్విని పొన్నప్ప జంట 19-21, 16-21తో నిరాశపరిచింది. అష్మిత చాలిహ 13-21, 15-21తో వాంగ్ జి యి చేతిలో ఓడింది. మూడు గేముల అనంతరం భారత్ 1-2తో వెనుకంజ వేసింది. ట్రెసా జాలి, గాయత్రి జంట 10-21, 21-18, 21-17తో లి జింగ్, షి మిన్‌లపై పైచేయి సాధించింది. ఆఖరు గేమ్‌లో అండర్‌డాగ్ అన్మోల్ ఖర్బ్ 22-20, 14-21, 21-18తో అసమాన విజయం నమోదు చేసింది. 3-2తో చైనాను చిత్తు చేసిన భారత్ విజయంతో నాకౌట్‌కు చేరుకుంది.

మెన్స్ విభాగంలో భారత్ 4-1తో హాంగ్‌కాంగ్‌పై గెలుపొందింది. తొలి గేమ్‌లో ప్రణయ్ 18-21, 14-21తో నిరాశపరిచినా.. వరుసగా నాలుగు గేముల్లో భారత్ పైచేయి సాధించింది. సాత్విక్, చిరాగ్ జోడి 21-16, 21-11తో, అర్జున్, ధ్రువ్ జోడి 21-12, 21-7తో గెలుపొందగా.. లక్ష్యసేన్ 21-14, 21-9తో, కిదాంబి శ్రీకాంత్ 21-14, 21-18తో విజయాలు నమోదు చేశారు. గ్రూప్-ఏలో నేడు మరో మ్యాచ్‌లో చైనాతో భారత్ తలపడనుంది.

నవచిత్రం



ప్రియమణి, సీరత్‌కపూర్

మహిళా శక్తిని తెలిపే భామా కలాపం 2

ఆహా స్టూడియోస్‌తో కలిసి బాపినీడు, సుధీర్ ఈదర అసోసియేషన్ డ్రీమ్ ఫార్మర్స్ 'భామా కలాపం 2' నిర్మించారు. ప్రియమణి ప్రధాన పాత్రలో నటించిన ఈ చిత్రంలో సీరత్ కపూర్, శరణ్య, రఘు ముఖర్జీ, బ్రహ్మాజీ తదితరులు ముఖ్య పాత్రలు పోషించారు. అభిమన్యు తడిమేటి దర్శకుడు. ఈనెల 16న ఆహాలో ఇది స్ట్రీమింగ్ కానుంది.

ఈ సందర్భంగా ప్రియమణి మాట్లాడుతూ, 'ఇందులో అన్నీ డబుల్ ఉంటాయి. ఎక్కువ థ్రిల్స్, ట్విస్ట్‌లుంటాయి. అంతే కాకుండా ఈసారి కాస్త డేంజరస్‌గా కూడా ఉంటుంది. అదేంటో తెలుసుకోవాలంటే సినిమాను చూడాలి. మా దర్శకుడు అభిమన్యుతో రెండో సినిమా చేస్తున్నాను. శిల్ప, అనుపమ పాత్రలు ఇలానే కంటిన్యూ అవ్వాలి. రెండో పార్ట్‌లో కొన్ని పాత్రలను యాడ్ చేశాం. సీరత్ కపూర్ పాత్ర బాగుంటుంది. ప్రతీ పాత్రకు చాలా ఇంపార్టెన్స్ ఉంటుంది. హౌస్ వైఫ్ అంటే అన్ని బాధ్యతలను నిర్వర్తిస్తుంది. మహిళ తలుచుకుంటే ఏమైనా సాధించగలదని చూపించే ప్రయత్నమిది' అని తెలిపారు.

'మా టీజర్, ట్రైలర్‌కు మంచి రెస్పాన్స్ వచ్చింది. సినిమాను కూడా అలానే ఆదరిస్తారని కోరుకుంటున్నాను. ఈ చిత్రంలో చాలా ట్విస్టులుంటాయి. మొదటి పార్ట్ చూసి, రెండో పార్ట్ చూస్తే బాగుంటుంది. ఇంకా ఎక్కువగా కనెక్ట్ అవుతారు. సీరత్ పోషించిన పాత్రతోనే ఎక్కువగా ట్విస్టులు వస్తాయి' అని దర్శకుడు అభిమన్యు అన్నారు. సీరత్ కపూర్ మాట్లాడుతూ, 'మొదటి సీజన్ చాలా పెద్ద హిట్ అయింది. ప్రియమణి, శరణ్యతో నటించడం ఆనందంగా ఉంది. జుబేదా పాత్రను నాకు ఇచ్చిన మా దర్శకుడు అభిమన్యుకు థ్యాంక్స్' అని చెప్పారు.

ఇది పక్కా ప్రజల సినిమా



భాను

వాస్తవ సంఘటనల ఆధారంగా రూపొందిన చిత్రం 'రాజధాని ఫైల్స్'. హిమ బిందు సమర్పణలో తెలుగువన్ ప్రొడక్షన్స్ పతాకంపై భాను దర్శకత్వంలో కంఠంనేని రవిశంకర్ ఈ చిత్రాన్ని నిర్మించారు. అఖిలన్, వీణ, వినోద్ కుమార్, వాణీ విశ్వనాథ్ కీలక పాత్రలు పోషించారు. ఈ చిత్రం ఈనెల 15న థియేటర్లలో విడుదల కానుంది.

ఈ నేపథ్యంలో దర్శకుడు భాను మాట్లాడుతూ, "అమరావతి ఫైల్స్' పేరుని 'రాజధాని ఫైల్స్'గా మార్చాం. సెన్సార్‌కి వెళ్ళినప్పుడు ఫిక్షనల్ చేస్తేనే సెన్సార్ ఇస్తామని చెప్పారు. వారు చెప్పిన కరెక్షన్స్ కూడా చేశాం. ఇది రాజకీయ చిత్రం కాదు. ప్రజల చిత్రమని మరోసారి స్పష్టం చేస్తున్నాను. ప్రజల ఆవేదనని చూపించే చిత్రమిది. ప్రజలు ఒక ప్రభుత్వాన్ని నమ్మి తమ భూములు ఇచ్చారు. మరో ప్రభుత్వం వచ్చి వారిపై ఆంక్షలు పెట్టి ఇబ్బందులు పెట్టింది. ప్రజలు నమ్మింది ప్రభుత్వాన్ని కాని, పార్టీలను కాదు. ఈ అంశాన్నే ఇందులో చూపించబోతున్నాం. ఇది పొలిటికల్ కంటెంట్ కాదు. రైతుల పడిన ఇబ్బందులు, మానసిక సంఘర్షణ, వారిని ఇబ్బంది పెట్టే మనుషులు, న్యాయం కోసం రైతులు చేసిన పోరాటం తప్పితే పొలిటికల్ కోణం ఉండదు. ఇందులో సమస్యకి పరిష్కారం కూడా చూపించాం. ఇది రైతుల కథ. వారి జీవితాల్లోకి వచ్చి ఇబ్బంది పెట్టిన వారి పాత్రలనే తీసుకున్నాం కానీ ఎవరి వ్యక్తిగతాల జోలికి పోలేదు' అని తెలిపారు.

ఆసక్తికరంగా కాలం చెప్పిన కథలు



పల్లవి

ఎస్.ఎం 4 ఫిలింస్ పతాకంపై బేబీ షాన్వీ శ్రీ షాలిని సమర్పణలో సాగర్, వికాస్, అభిలాష్, రోహిత్, రవితేజ, హరి, శృతి శంకర్, విహారిక చౌదరి, ఉమ, హాన్విక, పల్లవి రేష్మ ప్రధాన తారాగణంగా ఎం.ఎస్.వి.సాగర్ స్వీయ రచన, దర్శకత్వంలో నిర్మించిన చిత్రం 'కాలం చెప్పిన కథలు. ఈ చిత్ర టీజర్ విడుదల వేడుక బుధవారం ఫిల్మ్ ఛాంబర్‌లో జరిగింది.

ఈ వేడుకకు ముఖ్య అతిథిగా విచ్చేసిన పీపుల్స్ మీడియా ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ శ్రీధర్ టీజర్‌ను విడుదల చేశారు.

చిత్ర రచయిత, దర్శక, నిర్మాత సాగర్ మాట్లాడుతూ, 'గ్రామీణ నేపథ్యంలో తెరకెక్కించిన ఈ ప్రేమకథలో ఫ్యామిలీ ఎమోషన్స్, సస్పెన్స్, భక్తి మిళితమై ఉంటాయి. మొత్తం 6 కథలు ఇందులో కలిసి ఉంటాయి. షూటింగ్ మచిలీపట్నం పరిసర ప్రాంతాల్లో చేశాం. సంగీత పరంగా కూడా మంచి క్యాచీ ట్యూన్స్ వచ్చాయి. 5 పాటలు ఉంటాయి. పోస్ట్ ప్రొడక్షన్ కూడా కంప్లీట్ అయ్యింది. త్వరలోనే ప్రేక్షకుల ముందుకు ఈ చిత్రాన్ని తీసుకొస్తాం. మంచి కంటెంట్‌తో రూపొందిన ఈ సినిమా కచ్చితం విజయం సాధిస్తుంది' అని తెలిపారు.

రెట్టింపు వినోదం ఖాయం



అనుపమ పరమేశ్వరన్, సిద్ధు జొన్నలగడ్డ

'డీజే టిల్లు' చిత్రంతో సంచలన విజయాన్ని అందుకున్న సిద్ధు జొన్నలగడ్డ ఈ చిత్ర సీక్వెల్ 'టిల్లు స్క్వేర్'తో త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. ఈ సీక్వెల్‌తో మొదటి భాగానికి రెట్టింపు వినోదాన్ని అందిస్తామని చిత్రం బృందం ఎంతో నమ్మకంగా ఉంది. ప్రేమికుల దినోత్సవం సందర్భంగా బుధవారం హైదరాబాద్‌లోని శ్రీరాములు థియేటర్‌లో 'టిల్లు స్క్వేర్' ట్రైలర్‌ను విడుదల చేసింది చిత్ర బృందం. ఇందులో అనుపమ పరమేశ్వరన్ కథానాయికగా నటిస్తోంది. ఇందులో ఆమె లుక్స్‌తో పాటు ఆమె బాడీ లాంగ్వేజ్, సిద్ధూతో ఆమె కెమిస్ట్రీ ఈ ట్రైలర్‌లో హైలైట్‌గా నిలిచాయి. మొదటి భాగంలో రాధిక ప్రేమ కారణంగా ఇబ్బందులు కొని తెచ్చుకున్న టిల్లు.. ఇప్పుడు మరోసారి అదే తరహాలో సమస్యల సమూహంలో చిక్కుకున్నట్లుగా ట్రైలర్‌లో చూపించారు. అయితే మేకర్స్ కథకి సంబంధించిన విషయాలను ఎక్కువగా వెల్లడించకుండా.. ఏం జరిగిందో తెలుసుకోవాలనే ఆసక్తిని కలిగించేలా ట్రైలర్‌ను అద్భుతంగా రూపొందించారు. రామ్ మిరియాల స్వరపరిచిన పాటలు ఇప్పటికే విడుదలై వైరల్ అవుతున్నాయి. ప్రముఖ సంగీత దర్శకుడు ఎస్ థమన్ ఈ చిత్రానికి నేపథ్య సంగీతం అందిస్తున్నారు.

మల్లిక్ రామ్ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. ట్రైలర్‌తోనే ఆయన.. ప్రేక్షకుల అంచనాలకు ఏమాత్రం తగ్గకుండా, మొదటి భాగాన్ని మించి అలరించనున్నామనే నమ్మకాన్ని కలిగించగలిగారు. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. శ్రీకర స్టూడియోస్ ఈ చిత్రాన్ని సమర్పిస్తోంది. మార్చి 29న ప్రపంచవ్యాప్తంగా ఈ సినిమా భారీస్థాయిలో విడుదల కానుంది.

హరోం హర
టైటిల్ ట్రాక్ సందడి షురూ



సుధీర్‌బాబు

హీరో సుధీర్ బాబు నటిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'హరోం హర' విడుదలకు సిద్ధమవుతోంది. సెహరి ఫేమ్ జ్ఞానసాగర్ ద్వారక దర్శకత్వంలో ఎస్ఎస్‌సి (శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర సినిమాస్) బ్యానర్‌పై సుమంత్ జి నాయుడు నిర్మించిన ఈ చిత్రం నుంచి ఫస్ట్ సింగిల్- హరోం హరను విడుదల చేయడంతో మ్యూజిక్ ప్రమోషన్‌ని ప్రారంభించారు. చైతన్ భరద్వాజ్ స్కోర్ చేసిన ఈ ఎనర్జిటిక్ నెంబర్ దైవిక శక్తి అనుభూతి అందిస్తోంది. ఇది ఓ ఫెరోషియస్ హీరో అద్భుత కథ. కళ్యాణ్ చక్రవర్తి త్రిపురనేని ఈ పాటకు పవర్ ఫుల్ లిరిక్స్ రాశారు. అనురాగ్ కులకర్ణి డైనమిక్ వాయిస్‌తో ఆకట్టు కున్నారు. స్వరకర్త చైతన్ భరద్వాజ్ స్వయంగా ఎడిషనల్ వోకల్స్ అందించారు. పాటలో సుధీర్ బాబు బ్రూటల్‌గా కనిపించారు. విజువల్స్ టాప్-నాచ్‌గా ఉన్నాయి. ఈ సినిమాలో సుధీర్ బాబుకు జోడిగా నటిస్తున్న మాళవిక శర్మ కూడా ఈ పాటలో కనిపించింది. కంపోజిషన్, లిరిక్స్, వోకల్స్, విజువల్స్ అన్నీ అద్భుతంగా ఉన్న ఈ ట్రాక్ చార్ట్‌బస్టర్‌గా అలరిస్తుందని చెప్పడంలో ఎలాంటి సందేశం లేదు. చిత్తూరు జిల్లా కుప్పంలో 1989 నాటి నేపథ్యంలో సాగే ఈ కథలో సుధీర్ బాబు కుప్పం యాసలో డైలాగులు చెప్పనున్నారు. భారీ బడ్జెట్‌తో రూపొందుతున్న ఈ చిత్రానికి ది రివోల్ట్ అనేది ట్యాగ్ లైన్. తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో ఈ సినిమా విడుదల కానుంది అని చిత్ర బృందం తెలిపింది.

స్వచ్ఛమైన ప్రేమకథ




రక్షిత్ అట్లూరి, కోమలి

రక్షిత్ అట్లూరి హీరోగా, కోమలి హీరోయిన్‌గా 'శశివదనే' సినిమాతో ప్రేక్షకుల ముందుకు రానున్నారు. రచయిత, దర్శకుడు సాయి మోహన్ ఉబ్బన చేసిన ఈ చిత్రాన్ని ఏజీ ఫిల్మ్ కంపెనీ, ఎస్‌వీఎస్ స్టూడియోస్ ప్రైవేట్ లిమిటెడ్ పతాకాలపై అహితేజ బెల్లంకొండ నిర్మించారు.

ఈ సినిమాకు సంబంధించిన ప్రతీ అప్డేట్ అందరినీ ఆకట్టుకుంది. టీజర్‌తో ఈ చిత్రం ఎలా ఉంటుంది.. మళ్లీ గోదావరి జిల్లాల అందాలను ఎలా చూపించబోతోన్నారు అనే దానిపై ఓ స్పష్టత వచ్చింది. ఇక ఇప్పుడు ఈ చిత్ర విడుదల తేదీని ప్రకటించారు. రిలీజ్ డేట్‌ను ప్రకటిస్తూ రిలీజ్ చేసిన పోస్టర్ సైతం అందరినీ ఆకట్టుకుంటోంది. ఏప్రిల్ 5న ఈ చిత్రం ప్రపంచ వ్యాప్తంగా విడుదల కానుంది. 'మనసులో పుట్టే ప్రేమ మచ్చలేనిదైతే ఆ ప్రేమకు మరణం కూడా మనతోనే' అనే డైలాగ్ ఆ పోస్టర్ మీద హైలెట్‌గా నిలిచింది. ఆ డైలాగ్‌తో సినిమా సారాన్ని చెప్పేశారు. శశివదనే స్వచ్ఛమైన గ్రామీణ ప్రేమ కథగా ప్రేక్షకుల ముందుకు రానుంది.

తండ్రీకొడుకుల భావోద్వేగభరిత ప్రయాణం



సముద్రఖని, ధనరాజ్

స్లేట్ పెన్సిల్ స్టోరీస్ బ్యానర్ పై ప్రభాకర్ ఆరిపాక సమర్పణలో పృథ్వీ పొలవరపు నిర్మాణంలో తెరకెక్కుతున్న ద్విభాషా చిత్రం 'రామం రాఘవం'. నటుడు ధనరాజ్ మొదటిసారి దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో సముద్రఖని ప్రధాన పాత్రలో నటిస్తున్నారు. ప్రేమికుల రోజు సందర్భంగా ఈ చిత్ర గ్లిమ్స్‌ను హీరో రామ్ పోతినేని తన ట్విట్టర్ ఖాతా ద్వారా విడుదల చేసి సినిమా పెద్ద విజయాన్ని అందుకోవాలని ఆకాంక్షించారు.

అలాగే దర్శకుడు హరీష్ శంకర్ మీడియా గ్లింప్స్‌ను రిలీజ్ చేసిన అనంతరం మాట్లాడుతూ,'ధనరాజ్ ఒక మంచి కథను ప్రేక్షకులకు చెప్పాలనే ఉద్దేశంతో ఈ సినిమాను తీశారు. గ్లింప్స్ చాలా ఆసక్తికరంగా ఉంది. ఎమోషనల్ జర్నీతో తండ్రీ కొడుకుల మధ్య ఉన్న బాండింగ్‌ను కళ్ళకు కట్టినట్లు చిత్రీకరించిన గ్లింప్స్ కొత్తగా ఉంది' అని అన్నారు. మోక్ష, హరీష్ ఉత్తమన్, సత్య, పృధ్వి, శ్రీనివాసరెడ్డి, చిత్రం శ్రీను, ప్రమోదిని, రాకెట్ రాఘవ, రచ్చ రవి, ఇంటూరి వాసు తదితరులు నటిస్తున్నారు.

Printed and Published by Nandayla Narsimha Reddy on behalf of Navatelangana Printers Private Limited, Printed at Navatelangana Printers Private Limited Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Telangana State, Published at Navatelangana Printers Private Limited, Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Editor : R.Sudha Bhaskar. TEL TEL/2015/60886